సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు... 'వివక్షాపూరిత' సిఎఎ చట్టాన్ని రద్దు చేస్తుంది 05

పరస్పర దాడులతో దద్దరిల్లిన ఇరాన్ – ఇజ్రాయెల్ 02

సంపుటి 09, సంచిక: 123 | శుక్రవారం | 03-04-2026 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## మరోసారి మానవ సహిత

# చంద్రయానం





విజయవంతంగా తొలి ఘట్టం పూర్తి చేసిన నాసా

**కేప్ కానవెరల్ (అమెరికా):** దశాబ్దాల విరామం తరువాత మనిషి మరోసారి చంద్రుడి యాత్రకు ఉపక్రమించాడు. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' చేపట్టిన ఆర్టెమిస్–II మిషన్ ప్రథమ ఘట్టం విజయవంతంగా పూర్తయింది. ఓరియన్ క్యాప్సూల్ ముందుగా అంచనా వేసిన విధంగానే స్పేస్ క్రాఫ్ట్ విడిపోగా, వ్యోమగాములు స్వయంచాలక బాధ్యతలను చేపట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా వారు చంద్రుని ఆవలి వైపు వెళతారు. అక్కడి నుంచి చంద్రుడి ఉపరితలాన్ని పరిశీలించిన అనంతరం తిరిగి పూర్వ కక్ష్యకు చేరుకుంటారు. వీరు చంద్రునిపై కాలు మోపనప్పటికీ అక్కడి వాతావరణాన్ని, పరిస్థితులను క్షుణంగా అధ్యయనం చేస్తారు. అమెరికాలోని కేప్ కానవెరల్ నుంచి ప్రయాణం ప్రారంభించిన ఈ యాత్రలో నలుగురు వ్యోమగాములు చంద్రుని చుట్టూ పర్యటించేందుకు బయలుదేరారు. ఇది గత యాభై సంవత్సరాలకు పైగా కాలం తరువాత జరిగే తొలి మానవ చంద్రయానం కావడం విశేషం. భవిష్యత్తులో చంద్రుడిపై స్థిర నివాసాన్ని ఏర్పాటు చేయాలనే నాసా దీర్ఘకాల ప్రణాళికలో ఇది కీలక దశ. ఈ ప్రయాణంలో ముగ్గురు అమెరికన్లు, ఒక కెనడియన్ వ్యోమగామి ఉన్నారు. ఫ్లోరిడాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి 32 అంతస్తుల ఎత్తు గల స్పేస్ లాంచ్ సిస్టమ్ రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగిసింది. ఈ చారిత్రక క్షణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు వేలాదిమంది ప్రజలు అక్కడికి చేరుకున్నారు. 1960, 1970 దశకాలలో జరిగిన అపోలో ప్రయోగాల సందర్భాన్ని గుర్తు చేసేలా సమీప రహదారులు, సముద్రతీరాలు జనంతో కిక్కిరిసిపోయాయి. ఇది నాసా చంద్ర పరిశోధన కార్యక్రమంలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన ఘట్టం. ప్రయోగం ప్రారంభానికి ముందు మిషన్ డైరెక్టర్ చార్లీ బ్లాక్‌వెల్ థాంప్సన్ మాట్లాడుతూ, ఈ యాత్రతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఔత్సాహకుల ఆశలు, అమెరికన్ ప్రజల ధైర్యసాహసాలు, కొత్త తరం కలలు కూడా వ్యోమగాములతో కలిసి ప్రయాణిస్తున్నాయని వ్యాక్యానించారు. ఆర్టెమిస్–II ప్రయోగం కూడా అపోలో ప్రాజెక్టు సందర్భంగా చంద్రుని వైపు ప్రయాణించిన ప్రయోగ స్థలం నుంచి ప్రారంభమవడం చారిత్రక ఘటనను పునరావృతం చేసింది. అప్పటి వ్యోమగాములలో ఇంకా బ్రతికున్న కొందరు ఈ కొత్త తరం ప్రయాణాన్ని అభినందించారు. ప్రయోగం ప్రారంభమైన ఐదు నిమిషాలకే కమాండర్ రీడ్ వైజ్‌మన్ చంద్రుని దర్శించారని తెలిపారు. ఆయనతో పాటు పైలట్ విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, కెనడాకు చెందిన జెరెమీ హాన్సెన్ ప్రయాణిస్తున్నారు. మొదటిసారిగా ఒక మహిళ, అందునా వర్ణ వివక్షను ఎదుర్కొన్న వర్గానికి చెందిన వ్యక్తి, అదే విధంగా, అమెరికాకు చెందని వ్యక్తి చంద్ర యాత్రలో

తరువాయి 2లో

## 16న పార్లమెంట్

# తిరిగి ప్రారంభం

లోక్‌సభ స్థానాలు 816కు పెంపు, మహిళా రిజర్వేషన్ బిల్లుల కోసమే!





**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశం తాత్కాలిక విరామం తర్వాత ఏప్రిల్ 16న మళ్లీ ప్రారంభం కానుంది. మహిళల రిజర్వేషన్ చట్టాన్ని వీలైనంత త్వరగా అమలు చేయడానికి లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కి పెంచే బిల్లులను ఆమోదించేందుకు ఈ సమావేశం జరగనుంది. ఎన్నికల కాలంలో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఇది తాజా వివాదాస్పద అంశంగా మారే అవకాశముంది. ప్రభుత్వం ఈ బిల్లులను, ముఖ్యంగా మహిళల రిజర్వేషన్ బిల్లు లేదా నారీ వందన్ అధినియమ్, 2023లో సవరణలను ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షం మాత్రం రాష్ట్ర ఎన్నికలలో రాజకీయ లాభం పొందేందుకు కేంద్రం తొందరపాటుగా ఈ మార్పులను తీసుకువస్తోందని ఆరోపించింది. కాగా, ప్రస్తుత బడ్జెట్ సమావేశాలను ఆనావాయితీగా నిరవధికంగా వాయిదా వేయకుండా, ఈనెల 16న మళ్లీ ప్రారంభమవుతాయి. ఇవి సుమారు మూడు రోజుల పాటు కొనసాగే అవకాశముందని తెలుస్తున్నది. ప్రతిపక్ష పార్టీలకు కూడా ఈ విషయాన్ని ప్రభుత్వం తెలియజేసిందని వర్గాలు తెలిపాయి. మహిళల కోటా అమలు కోసం అవసరమైన బిల్లులను ముందుగా లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశముందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా, గురువారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు రాజ్యసభలో మాట్లాడుతూ, కీలకమైన చట్టప్రాయ బిల్లును పరిశీలించేందుకు సభ త్వరలో మళ్లీ సమావేశమవుతుందని తెలిపారు. 'మాకు కొన్ని ముఖ్యమైన బిల్లులు, అంశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రతిపక్షంతో కూడా పంచుకున్నాము. వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో ఒక అత్యంత ముఖ్యమైన బిల్లును తీసుకురానున్నాము' అన్నారు. మహిళల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయడానికి కనీసం రెండు బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రతిపక్షంతో పరోక్ష చర్చలు జరుపుతోంది. అలాగే జనగణన ప్రక్రియ నుండి నియోజకవర్గాల పునర్విభజనను వేరు చేసి, లోక్‌సభ స్థానాలనుపెంచే ప్రతిపాదనపై కూడా చర్చలు జరుగుతున్నాయి. రాజ్యసభలో ఈ అంశంపై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. సభా నాయకుడు జెపి నడ్డా, చట్టాలను ఎప్పుడు తీసుకురావాలో నిర్ణయించే హక్కు ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాత్రం ప్రభుత్వం దౌర్జన్యంగా వ్యవహరిస్తోందని, మహిళల రిజర్వేషన్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత అన్ని పార్టీల సమావేశం నిర్వహించాలని ప్రతిపక్షం కోరిందని చెప్పారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను పట్టించుకోకుండా ప్రభుత్వం ఈ బిల్లును ముందుకు తెస్తోందని ఆయన ఆరోపించారు. 'ఈ బిల్లును ఆమోదించడం ద్వారా ఎన్నికల లాభం పొందాలనే ప్రభుత్వ లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పూర్తిగా అభ్యంతరకరం. అందుకే అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏప్రిల్ 29 తర్వాత సమావేశం నిర్వహించాలని

తరువాయి 2లో

## అభివృద్ధి విషయంలో

# రాజీలేదు

గ్రామ సభల నేపథ్యంలో ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి సందేశం

ప్రజాపక్షం/హైదరాబాద్



"ప్రభుత్వ పథకాలు కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. ఆ ఉద్దేశంతోనే ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా కొనసాగుతోంది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో సిఎం ప్రజలకు సందేశం విడుదల చేశారు. 'ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయ్యింది. మేం పాలకులం కాదు. సేవకులం అనే భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం' అని రేవంత్ రెడ్డి తన సందేశంలో స్పష్టం చేశారు. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదని, ఒక దీక్ష అని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలనేది తన కల అని, ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలని సిఎం

తరువాయి 2లో

# ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం



కేరళ ఎన్నికల ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సిఎం పినరయి విజయన్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె. ప్రకాశ్‌బాబు, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి.రామకృష్ణన్, కృష్ణకుట్టి, ఎ.కె.శశిధరన్, ఎలమారమ్ కరీం

- సంపూర్ణ పేదరిక నిర్మూలన
- సంక్షేమ పెన్షన్ రూ.3000లకు పెంపు
- 20 లక్షల మంది గృహిణులకు ఉపాధి
- ప్రతి గ్రాడ్యుయేట్‌కూ ఉద్యోగం, ఉపాధి
- సార్వత్రిక ఆరోగ్య పథకం కింద అపరిమిత వైద్య సేవలు
- 60 అంశాలు, 950 నిర్దిష్ట హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన ఎల్‌డిఎఫ్

02

## ఎల్‌డిఎఫ్‌కు పెరుగుతున్న ఆదరణతో

# యుడిఎఫ్, బిజెపి బెంబేలు

కేరళ ఎన్నికల ప్రచారంలో డి.రాజా



కేరళలో మోదీ, యుడిఎఫ్ ఇరువురివి ఒకే రాజకీయ భాష, లక్ష్యాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని, ఎందుకంటే వీరిద్దరికీ అసలైన రాజకీయ ప్రత్యర్థి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) మాత్రమేనని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్‌ను బలహీనపరిచేందుకు ఇరుపక్షాల నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. కేరళ ప్రజలు వామపక్ష విధానాలపై పదేపదే విశ్వాసం ఉంచారని, అందుకే ఎల్‌డిఎఫ్ ప్రజల్లో తన బలమైన ఉనికిని కొనసాగించగలిగిందని ఆయన అన్నారు. కేరళ అభివృద్ధి నమూనా దేశానికి ఆదర్శమని అన్నారు. కేరళ శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నెడుమంగాడ్ నియోజకవర్గంలో జరిగిన ఎల్‌డిఎఫ్ సభలో డి.రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఎల్‌డిఎఫ్‌కు పెరుగుతున్న ఆదరణతో యుడిఎఫ్, బిజెపి రెండూ ఆందోళన

తరువాయి 2లో



అమెరికన్‌లను ఉద్దేశించి కీలక ప్రసంగంలో ట్రంప్ హెచ్చరిక

ఈ యుద్ధం భవిష్యత్తుకు పెట్టుబడి అని ప్రజలు గ్రహించాలి

హోర్ముజ్‌ను రక్షించుకోవాలని ప్రపంచ దేశాలకు పిలుపు

## దౌత్యాన్ని తిరస్కరిస్తే...

## రాతియుగంలోకి నెట్టేలా ఇరాన్‌పై

# భీకర దాడులు

**వాషింగ్టన్ :** ఇరాన్‌తో దౌత్యానికి, చర్చలకే మొదటి ప్రాధాన్యతనిస్తానని, దీనిని తిరస్కరిస్తే ఇరాన్ ఎక్కడ మొదలైందో అదే స్థానానికి, అదే రాతియుగంలోకి నెట్టేసేవిధంగా రాబోయే వారాల్లో భీకర దాడులలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరిక జారీ చేశారు. ట్రంప్ చేసిన ఈ తాజా హెచ్చరికతో ఆసియాలో స్టాక్‌మార్కెట్లు కుప్పకూలాయి. చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. బంగారం,వెండి ధరలు పతనమయ్యాయి. ట్రంప్ చేసిన ఒక్క ప్రకటనతో పరిస్థితి మళ్ళీ తారుమారైంది. గడచిన మూడురోజులుగా ట్రంప్ పరస్పర భిన్న ప్రకటనలతో ప్రపంచదేశాలను గందరగోళంలోకి నెట్టేశారు. ఒప్పందంతో ప్రమేయం లేకుండా పశ్చిమాసియాను వదిలివెళ్ళిపోతామని ఒకసారి, మరుసటి గంటలోనే భీకర దాడులు చేస్తామని పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారు. ఈ పూర్వరంగంలో గురువారం అమెరికా ప్రజలను ఉద్దేశించి

తరువాయి 12లో



## 23 నుంచి ఆశా వర్కర్ల

# నిరవధిక సమ్మె

ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సిందే

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

ప్రజాపక్షం/హైదరాబాద్

చాలీచాలని జీతాలతో రోజంతా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆశా వర్కర్ల సమస్యలపై దృష్టి సారించక పోవడం అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. ఎఐటియుసి

తరువాయి 12లో

# మహిళలకు చేదోడుగా ఉచిత బస్సు

రూ.10వేల కోట్లు ఆదా : ఎమ్మెల్యే కూనంనేని




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మహిళా సాధికారతకు చేదోడుగా వాదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీ ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూనంనేని ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న

తరువాయి 2లో

## హోర్ముజ్ లేకుండా కొత్త రవాణా మార్గాలు

### గల్ఫ్ దేశాల అధ్యయనం



**దుబాయ్:** హోర్ముజ్ జలసంధితో ప్రమేయం లేకుండా ఒక కొత్త చమురు సరఫరా పైపులైన్ నిర్మించుకునే విషయంపై గల్ఫ్ దేశాలు ఆలోచన చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం తర్వాత ఇరాన్ షియా–సున్నీ దేశాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో హోర్ముజ్ జలసంధి ప్రసక్తి లేకుండా చమురు సరఫరాలను సులభంగా కొనసాగించేందుకు గల్ఫ్ దేశాలు కొత్త రవాణా మార్గాలను అభివృద్ధి చేసుకునే విషయంపై అధ్యయనం ప్రారంభించాయని ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక ప్రకటించింది. ఈ ప్రాంతం నుండి స్థిరమైన ఎగుమతులు సాధించడానికి ప్రత్యామ్నాయ పైపులైన్లు, రవాణా మార్గాల నిర్మాణమే ఆచరణాత్మకంగా ఉంటుందని అధికారులు,పరిశ్రమల అధిపతులు భావిస్తున్నారు. పశ్చిమాసియా ద్వారా భారత్ నుండి యూరప్ వరకూ ప్రతిపాదించిన అమెరికా మద్దతు కూడా ఉన్న ఐఎంఇసి (భారత్–పశ్చిమాసియా–యూరప్ ఎకనామిక్ కారిడార్) అంశం కూడా ఈ సందర్భంలో ప్రధానంగా చర్చల్లోకి వస్తోంది. గల్ఫ్ నుండి చమురు రవాణాకు హోర్ముజ్ జలసంధి చాలాకాలంగా ప్రధాన రవాణామార్గంగా కొనసాగుతోంది. కానీ ఈ ప్రాంతంలో ఏ మాత్రం చిన్న తేడా వచ్చినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఎంత విఘాతం కలుగుతుందనే విషయం ఇటీవల పశ్చిమాసియా యుద్ధంతో బాహాటంగా స్పష్టమైంది. అక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా ప్రపంచ చమురు రవాణా స్తంభించిపోతోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు చెందిన షియా ఛాందసవాద ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించడంతో పరిస్థితి గతంకంటే భిన్నంగా మారింది. పైగా గడచిన 35 రోజులుగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేసి మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. పశ్చిమాసియా నుండి అమెరికాను పూర్తిగా వెళ్ళగొట్టాలని, అమెరికా,ఇజ్రాయెల్ ప్రమేయం, ఆధిపత్యం లేని సరికొత్త ప్రాంతీయ భద్రతా పొందికను తమ నేతృత్వంలో రూపొందిస్తామని ఇరాన్ చేసిన ప్రతిపాదనతో గల్ఫ్ దేశాలు విభేదిస్తున్నాయి.

## సోషల్ మీడియా వ్యసన నిర్మూలనకు ఇటలీ చట్టం

**రోమ్:**సోషల్ మీడియా వ్యవసాన్ని అరికట్టేదుకు ఒక చట్టం తీసుకురావాలని ఇటలీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఒక బిల్లును ప్రతిపాదించింది. వినియోగదారులకు పంపిణీ చేసే కంటెంట్ విషయంలో ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫారాలు చాలా బాధ్యతగా వ్యవహరించడంకోసం ఇటలీ సెనేటర్లు ఒక ముసాయిదా చట్టాన్ని ఎగువసభలో ప్రతిపాదించారు. డిజిటల్ వేదికలపై యూరప్ అంతటా ఇటీవల కాలంలో ప్రభుత్వాలకు పట్టింపు పెరిగింది. డిజిటల్ వేదికలను పరిశుద్ధంగా, నిజాయతీతో బాధ్యతాయుతంగా ఉంచాలనే ఆలోచనా ధోరణి తరుణంలో ఇటలీ కూడా ఆ దిశగా అడుగులు వేసింది. యువతరానికి హానికరమైనవిగా భావించే ఫ్లాట్‌ఫారాలను తయారు చేయడంలో మెటా, ఆల్ఫాబెట్ గూగుల్ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించాయని ఇటీవల అమెరికా కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో యూరప్‌లో ఈ ముందు జాగ్రత్తలు మొదలయ్యాయి.

# పరస్పర దాడులతో దద్దరిల్లిన ఇరాన్–ఇజ్రాయెల్

- ఆయుధాలు చేపట్టేందుకు 70 లక్షలమంది ఇరాన్ ప్రజలు రెడీ
- ఇరాన్ క్షిపణి కేంద్రం వద్ద భారీ పేలుళ్ళు
- కరాజ్‌లో నివాస ప్రాంతాలపై దాడులు
- ఇరాక్ వదిలి వెళ్ళాలని అమెరికన్లకు తక్షణ హెచ్చరిక
- ఎ-10 ఫైటర్‌జెట్స్ మోహరించిన అమెరికా
- పతనమైన ఆసియా మార్కెట్లు, పెరిగిన చమురు ధర



**దుబాయ్:** జాతిని ఉద్దేశించి ప్రసంగంలో ట్రంప్ చేసిన హెచ్చరిక, ఇరాన్ ప్రతిహెచ్చరికల తర్వాత పశ్చిమాసియాలో 34వ రోజు గురువారం యుద్ధం ఒక్కసారిగా మరింత విజృంభించింది. ఇరాన్‌లో అనేకచోట్ల దాడులు జరిగాయి. సైన్యంలోకి ప్రవేశించి సేవలు చేసేందుకు 70 లక్షలమంది (ఏడు మిలియన్లు) ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ గురువారం ప్రకటించారు. అమెరికా–ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా చేసిన విస్తారమమైన ప్రచారం వల్ల ఆయుధాలు చేపట్టి యుద్ధంలో పోరాడేందుకు ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారని చెప్పారు. "మీరు ఇప్పుడు మా దేశంలోకి రండి, దేశ రక్షణకోసం వాళ్ళు కుటుంబాలతో సహా ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నారు,మేం గతంలో చేశాం, ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నాం" అని ఘాలిబాఫ్ ప్రకటించారు.ట్రంప్ హెచ్చరికలతో ఆసియా మార్కెట్లు పతనం కాగా, చమురు ధర భారీగా పెరిగింది. చమురు సంక్షోభం పెరిగి, ధరలు హెచ్చడంతో పలు దేశాల్లో ప్రభుత్వాలు పన్నుల రద్దు చర్యలు తీకున్నాయి. దక్షిణాఫ్రికా కూడా ఒక నెలరోజులపాటు చమురుపై లెవీని రద్దుచేసింది. అమెరికా అలవికాని వాదనలు చేస్తోందని, నిర్హేతుకమైన డిమాండ్లు చేస్తోందని ఇరాన్ ప్రభుత్వ టీవీ విమర్శించింది. సమగ్ర చర్చలకు ఇరాన్ ఇష్టపడటంలేదని ట్రంప్ విమర్శలు గుప్పించగా, కాల్పుల విరమణ కోరుతూ తాము అమెరికాను ఆశ్రయించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్ గల్ఫ్ వ్యాప్తంగా దాడులు కొనసాగించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పశ్చిమప్రాంతంలో అమెరికా–ఇజ్రాయెల్ గగనతల దాడులతో భారీ పేలుళ్ళు సృష్టించాయి. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరంలోని క్షిపణి కేంద్రం సమీపంలో మరోసారి భారీ పేలుళ్ళు సంభవించాయి. ఇరాన్ నగరం కరాజ్‌లో నివాసిత ప్రాంతాలపై ఇరాన్–అమెరికా గగనతల దాడులకు పాల్పడ్డాయి. మషాద్ ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ సమీపంలో దాడులు జరిగాయి. జాతీయ రహదారి స్తంభించింది. స్ట్రేజీ ట్యాంకులు లక్ష్యంగా దాడులు జరిగాయని ఇరాన్ మీడియా పేర్కొంది. అదేవిధంగా ఇజ్రాయెల్‌లో కూడా ఇరాన్,హెజ్బొల్లా దాడులు చేశాయి. దక్షిణ లెబనాన్ బాంబుదాడులతో దద్దరిల్లింది. కొత్త ప్రాంతాలలో ప్రజలు ఇళ్ళుఖాళీ చేసి వెళ్ళిపోయారు. ఇరాక్‌లో భారీ దాడులు చేస్తామని చేసిన హెచ్చరికలతో రాబోయే 48 గంటల్లో ఇరాక్‌ను వదిలివెళ్ళిపోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని అక్కడున్న అమెరికన్లకు ఆ దేశ విదేశాంగమంత్రి మార్కో రుబియో హెచ్చరిక జారీ చేశారు. ఇరాక్ గగనతల రక్షణ, హోర్ముజ్ రక్షణకోసం అమెరికా మిలిటరీ కొత్తగా మరిన్ని ఎ–10 ఎయిర్‌క్రాఫ్ట్‌లను పశ్చిమాసియా యుద్ధ రంగంలోకి దించింది. అదే విధంగా ఇరాక్‌లో జరుగుతున్న ఇరాన్ ఆధిపత్య పరిణామాలపై అమెరికా స్పందిస్తూ, మరిన్ని దాడులు తప్పవని పేర్కొంది. ఇప్పటికే గుర్తుతెలియని వ్యక్తులు అమెరికా మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్టును బుధవారంనాడు కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. ఈ యుద్ధంలో ఇరాన్ దాడుల వల్ల ఇరాక్ తీవ్రంగా నష్టపోతోంది. ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై ఇరాన్, హెజ్బొల్లా చేసిన దాడుల్లో 25 మంది ఇజ్రాయెలీ ప్రజలు గాయపడ్డారు. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో ఇరాన్‌లో 2,076 మంది మరణించగా, మరో 3,500 మంది గాయపడ్డారు. లెబనాన్‌లో 1300 మంది పైగా మరణించారు. యుద్ధం ముగిసిపోయినాగానీ లెబనాన్‌ను తమ దళాలు ఆక్రమించే ప్రక్రియ కొనసాగుతుందని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు.

## ఇరాన్ దేశ పునర్నిర్మాణానికి సిద్ధంకండి

### ప్రజలకు సుప్రీం నేత మొజ్తాబా తొలి సందేశం



**టెహ్రాన్:** ఇరాన్ పునర్నిర్మాణానికి సిద్ధం కావాలని దేశ ప్రజలకు మొజ్తబా ఖమేనీ పిలుపు ఇచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే–నేషనల్ నేచర్ డే సందర్భంగా ఆయన ఈ పిలుపు ఇచ్చారు. యుద్ధం వల్ల నాశనమైన దేశాన్ని తిరిగి నిర్మించుకోవాలని, దేశంలోని పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపు ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా, శత్రుదేశ ప్రస్తావన లేకుండా, ఇరాన్ ప్ర జల జీవితాలను తీర్చిదిద్దడంకోసం ఆయన తొ లి కీలక సందేశంలో నిర్మాణాత్మకమైన ప్రకటన చేయడం ప్రపంచదేశాలకు ఎంతో ఆసక్తి కలిగించింది. తండ్రి అలీ ఖమేనీ అమెరికా దాడుల్లో ఫి బ్రవరి 28న మరణించిన తర్వాత సుప్రీం నేత గా మార్చి 8–9 తేదీల్లో బాధ్యతలు తీసుకున్న మొజ్తబా ఖమేనీ నుండి గడచిన 35 రోజుల్లో సరైన ప్రకటన వెలువడలేదు. కానీ డోనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజలను ఉద్దేశించి గురువా రం కీలక ప్రసంగం చేసిన తర్వాత మొదటిసారి మొజ్తాబా దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన కీలక ప్రకటన, పిలుపు ట్రంప్‌కు పెద్ద దిగ్భ్రాంతికరం గా మారింది. ఆయన సజీవంగా లేరని ఒకసా రి, ఒకవేళ సజీవంగా ఉన్నాగానీ, తీవ్ర గాయాలతో మంచానపడి ఉన్నారని మరోసారి ట్రంప్ ప్రకటనలు చేశారు. రెండు మూడు వారాల్లో ఇ రాన్‌ను వదిలి వెళ్ళిపోతామని, తీవ్ర దాడులు చే స్తామని ట్రంప్ భిన్న ప్రకటనలు చేశాక మొ జ్తాబా ఖమేనీ, శత్రువును రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా, చాలా స్థిరంగా తన దేశ పునర్నిర్మాణంకోసం ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఇరా న్ నాయకత్వాన్ని మార్చేస్తామని, ఇప్పుడున్న ఇరాన్ నాయకత్వం ఎంతో స్మార్ట్‌గా ఉందని ట్రంప్ కొద్ది గంటల క్రితమే ప్రకటనలు చేశారు. మొజ్తాబా ఉనికిని ట్రంప్ ఇప్పటివరకూ గుర్తించలేదు. ఆయన రాజ్యపాలనకు అర్హుడు కాదని మార్చిమొదటివారాల్లో ట్రంప్ ప్రకటనలు చేశా రు. కానీ ఇప్పుడు మొజ్తాబా ప్రకటన వెలువడింది. ఆయన వీడియోల ద్వారా లేదా బహిరంగంగా ప్రజలకు కనిపించకపోయినప్పటికీ, గాయాల నుండి తమ నాయకుడు కోలుకుంటున్నారని ఇరాన్ నేతలు పలుసార్లు ప్రకటించారు. పైగా కొద్ది గంటల క్రితమే ఇరాన్‌లోని రష్యా దౌత్యవేత్త కూడా ఒక ప్రకటన చేస్తూ, మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని ధృవీకరించారు. ఈ ప్రకటన తర్వాత మొజ్తాబా సందేశం వెలువడటం విశేషం.

## ట్రాన్స్ అట్లాంటిక్ ఉద్రిక్తతల నడుమ వచ్చేవారం

## అమెరికాకు నాటో చీఫ్ రాయబారం

**బ్రస్సెల్స్:**ట్రంప్ వ్యాఖ్యలతో టాన్స్ అట్లాంటిక్ మధ్య పెరుగుతున్న దూరం–విభేదాల మధ్య నాటో సెక్రటరీ జనరల్ వచ్చేవారం వాషింగ్టన్‌లో పర్యటించనున్నారు. ఇరు ఖండాలమధ్య సయోధ్య తెచ్చేందుకు బహుశా ఆయన కృషి చేసే అవకాశం ఉంది. నాటో మిత్రదేశాలు విధేయత ప్రదర్శించడంలేదని పదే పదే ట్రంప్ చేస్తున్న విమర్శలతో రెండు దేశాలమధ్య దూరం రోజు రోజుకూ పెరిగిపోతోంది.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ ప్రకటనలు ప్రారంభించినప్పుడు మొదలైన విభేదాలు పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మరింతగా పెరిగిపోయాయి. అమెరికాతో యూరోపియన్ యూనియన్, నాటో దేశాల సంబంధాలు మరింత చెడిపోవడం ట్రంప్ స్వయంకృతాపరాధంగా మారింది. అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలను మరింత నాశనం చేసుకోవడానికి ఇష్టంలేని నాటో దేశాలు అటు ఆయుధ సంపత్తిని పెంచుకోలేక, ఇటు ఉక్రేన్ యుద్ధాన్ని పరిష్కరించుకోలేక సతమతమవుతుంటే ఇరాన్ యుద్ధంలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోలేదని నాటో మిత్రదేశాలపై ట్రంప్ ఘర్షణకు దిగారు. నాటో నిబంధనలకు విరుద్ధంగా వారు ప్రవర్తించారని ట్రంప్ తప్పు పడుతున్నారు.యుద్ధంలో చేరేది లేదని, తమ దేశ ప్రయోజనాలే తమకు ముఖ్యమని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ నిర్ద్వంద్వంగా ప్రకటించడం, ఇరాన్‌పై యుద్ధంకోసం తమ గగన తలాన్ని ఉపయోగించుకోకుండా స్పెయిన్, ఇటలీ దేశాలు అమెరికాను తిరస్కరించడం,ఫ్రాన్స్‌కూడా చాలా పరిమితులు విధించడం,హోర్ముజ్‌ను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్‌ల పట్టునుండి విడిపించేందుకు కలిసి రాకపోవడంతో నాటోతో సంబంధాలను పునఃసమీక్ష చేస్తామని, నాటో నుండి వైదొలగే ఆలోచనలు చేస్తున్నామని ట్రంప్ ఖరాఖండీగా ప్రకటించారు. ఈ ప్రకటనకు ముందుగా హోర్ముజ్‌కు వెళ్ళి మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోవాలని, అమెరికా ఎవ్వరికీ సహాయం చేయబోదని ట్రంప్ ప్రకటించారు. హోర్ముజ్ లేకపోతే అమెరికాకు గడవని పరిస్థితులు లేవని, హోర్ముజ్ జలసంధి తమకు అవసరం లేదని కూడా నాటో దేశాలపై ట్రంప్ అలక ప్రదర్శించారు. యూరప్ దేశాలు కూడా ఈ పరిస్థితులకు ముందునుండే ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారించాయి. ఈ నేపథ్యంలో నాటో చీఫ్ రాయబారం చేస్తున్నారు.

## రాజీలేదు

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు ప్రజలు ఆమోదం, మద్దతు ప్రకటించారని, ఈ ఫలితాలు ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచాయని రేవంత్ రెడ్డి తెలిపారు. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పనిచేయాలని, వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలన్నారు. 'మహాలక్ష్మి'ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలని ఆయన అధికారులకు సూచించారు. 'తెలంగాణ రైజింగ్–2047 విజన్'తో ఆర్థికంగానే కాకుండా, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలపాలన్నది ప్రభుత్వ సంకల్పమని, ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని సిఎం కోరారు. క్యూర్, ప్యూర్, రేర్ గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నామని, వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా రాష్ట్రం ఎదగాలన్నారు.

## తిరిగి ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కోరుతున్నాయి' అన్నారు. దీనిపై మంత్రి రిజిజు మాట్లాడుతూ, దేశ మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. 'ఇది ఏ రాష్ట్ర ఎన్నికలతో సంబంధం లేదు. పార్లమెంట్ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత మాకు ఉంది. సమయ పరిమితులు ఉన్నందున ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలి' అని వ్యాఖ్యానించారు. ఈ ముఖ్యమైన అంశాన్ని రాజకీయ రంగులో చూడకూడదని అన్నారు. ఇదే సమయంలో ఖర్గే మాట్లాడుతూ, శాసనసభల్లో మహిళల రిజర్వేషన్‌కు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, అయితే ఈ బిల్లులు దీర్ఘకాల ప్రభావాలు కలిగిస్తాయని పేర్కొన్నారు. 'మహిళల రిజర్వేషన్‌కు మేమందరం మద్దతు ఇస్తున్నాం. కానీ బిల్లును ఎప్పుడు, ఎలా తీసుకురావాలనే విషయంలో రాజకీయ ఆటలు ఆడకండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిజు మాత్రం ప్రతిపక్షమే ఈ అంశాన్ని రాజకీయంగా మలుస్తోందని, కాంగ్రెస్ ఈ సమావేశానికి ఎందుకు హాజరుకావడంలేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత సంజయ్ సింగ్ కూడా ఈ అంశాన్ని ప్రభుత్వం రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్ రాజ్యసభ, రాష్ట్ర శాసన మండళ్లలో కూడా మహిళలకు రిజర్వేషన్ ఇస్తారా? అని ప్రశ్నించారు. ఆర్‌జెడి నేత మనోజ్ ఝా, మహిళలకు కేటాయించిన స్థానాల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ఉప రిజర్వేషన్ విషయంపై ప్రభుత్వ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించారు. కాగా. చట్టసభల కార్యక్రమాల తేదీలను నిర్ణయించే హక్కు ప్రభుత్వానిదేనని రిజుజు మరోసారి స్పష్టం చేశారు. కాగా, నారీ శక్తి వందన్ అధినియమ్ ఆమోదించిన సమయంలో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాన్ని అమలు చేయలేమని, ఎందుకంటే నియోజకవర్గాల పునర్విభజన అవసరమని ప్రభుత్వం చెప్పిన విషయాన్ని జైరాం రమేష్ గుర్తుచేశారు. లోక్‌సభ పరిమాణాన్ని 50 శాతం పెంచే బిల్లును ప్రభుత్వం బలవంతంగా ఆమోదింపజేయాలని ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతి రాష్ట్రానికి కేటాయించిన స్థానాలను కూడా 50 శాతం పెంచే ప్రతిపాదన చిన్న రాష్ట్రాలకు, ముఖ్యంగా దక్షిణ, ఈశాన్య, పశ్చిమ ప్రాంతాలకు నష్టదాయకమని పేర్కొంది. ఇలావుంటే,

ఇది బడ్జెట్ సమావేశం రెండో భాగం. సాధారణంగా ఈ సమావేశం ముగిసిన తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడుతుంది. తదుపరి మాన్సూన్ సమావేశంలో మళ్లీ సమావేశమవుతుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 2న సభ నిరవధికంగా వాయిదా పడాల్సి ఉంది. పుదుచ్చేరి, అసోం, కేరళలో ఎన్నికలు ఏప్రిల్ 9న జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో పోలింగ్ జరుగుతుంది. తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే దశలో ఎన్నికలు జరుగుతాయి.

# ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం

- * సంపూర్ణ పేదరిక నిర్మూలన
- * సంక్షేమ పెన్షన్ రూ.3000లకు పెంపు
- * 20 లక్షల మంది గృహిణులకు ఉపాధి
- * ప్రతి గ్రాడ్యుయేట్‌కూ ఉద్యోగం, ఉపాధి
- * సార్వత్రిక ఆరోగ్య పథకం కింద అపరిమిత వైద్య సేవలు
- * 60 అంశాలు,950 నిర్దిష్ట హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిన ఎల్‌డిఎఫ్

**కోజికోడ్:** కేరళ అసెంబ్లీ ఎన్నికలకు అధికార లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేసింది. కోజికోడ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె. ప్రకాశ్‌బాబు, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టి.పి.రామకృష్ణన్, కృష్ణకుట్టి, ఎ.కె.శశిధరన్, ఎలమారమ్ కరీంలు ఎల్‌డిఎఫ్ మేనిఫెస్టోను ప్రకటించారు. మొత్తం 60 అంశాలతో రెండు భాగాలుగా 950 నిర్దిష్ట హామీలతో రూపొందించిన ఈ పత్రంలో సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఉద్యోగాల్లో 50 శాతం మహిళలకు కేటాయించాలని ప్రతిపాదిస్తూ, మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. మేనిఫెస్టోలో ముఖ్యంగా సంక్షేమ పింఛన్లను రూ. 3,000కు పెంచడం, వృద్ధులు, మంచానపడిన రోగులకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 60,000మంది యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని పట్టభద్రులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతను వ్యాపారాల వైపు దారితీసేందుకు వడ్డీ లేని రుణాలు అందించాలని ప్రతిపాదించారు. అలాగే ఐదేళ్లలో పారిశ్రామిక రంగంలో రెండు లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ పథకం ద్వారా అపరిమిత వైద్య సేవలు అందించడం, పౌరసత్వ చట్టానికి సంబంధించిన ఆందోళనలను తగ్గించేందుకు నివాసయోగ్యత కార్డులు జారీ చేయడం వంటి అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. పాత్రికేయుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి వారికి పింఛన్లు అందించే ప్రతిపాదన సైతం మేనిఫెస్టోలో ఉంది. శబరిమల మాస్టర్ ప్లాన్‌ను ఐదేళ్లలో పూర్తి చేయడం, ఇడుక్కి, వయనాడ్, కాసరగోడ్, కుట్టనాడ్‌తోపాటు తీర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు కొనసాగించడం వంటి హామీలు ఇచ్చారు. ఇక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా తిరువనంతపురం, కోజికోడ్ నగరాల్లో మెట్రో ప్రాజెక్టులను చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. కెఎస్‌ఆర్‌టిసి ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు సంబంధించి సంస్కరణలు అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్ని రేషన్ దుకాణాలను 'కె స్టోర్స్'గా మార్చడం, ప్రతి వార్డులో ఫిట్‌నెస్ సర్కిల్స్ ఏర్పాటు చేయడం, ప్రతి ఇంటికి 30 నిమిషాల పరిధిలో క్రీడా స్థలం లేదా పార్క్ అందుబాటులో ఉంచడం వంటి లక్ష్యాలను నిర్దేశించారు. విద్యుత్ రంగంలో ప్రస్తుతం ఉన్న 1003 మెగావాట్ల సౌరశక్తి ఉత్పత్తిని 2030 నాటికి 4,000 నుంచి 5,000 మెగావాట్లకు పెంచాలని లక్ష్యం గా పెట్టుకున్నారు. ఉద్యానవన పంటల అభివృద్ధి, పాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధనపై కూడా దృష్టి సారించారు.

**ఓటర్లను ఆకర్షించేలా యుడిఎఫ్ హామీలు**

**కోజికోడ్:** కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూడా ఓటర్లను ఆకర్షించేలా పలు హామీలను ప్రకటించింది. ఈ మేనిఫెస్టోను కాంగ్రెస్ నాయకుడు విడి సతీశన్ విడుదల చేయగా, కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, సంక్షేమ పింఛన్లను రూ. 3,000కు పెంచడం, కాలేజీలకు వెళ్లే విద్యార్థినిలకు నెలకు రూ. 1,000 ఆర్థిక సహాయం వంటి హామీలు ఇచ్చారు. యుడిఎఫ్ మేనిఫెస్టోలో ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల బీమా పథకం, చిన్న వ్యాపారులకు రూ. 5 లక్షల వడ్డీ లేని రుణాలు, వయనాడ్‌లో గిరిజన విశ్వవిద్యాలయం స్థాపన వంటి అంశాలు ఉన్నాయి. ఆశా, అంగన్‌వాడీ కార్మికుల వేతనాల సవరణ, కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధానికి 'సిద్ధార్థ్ చట్టం' అమలు వంటి ప్రతిపాదనలు కూడా చేర్చారు. మత్స్యకారుల కోసం ప్రత్యేక ఉప ప్రణాళిక, వారికి సముద్రంపై హక్కులు కల్పించడం, చేపల వేట పడవలు, ఆటో, టాక్సీ కార్మికులకు ఇంధన రాయితీలు ఇవ్వడం వంటి అంశాలు ఉన్నాయి.

ఆరోగ్య రంగంలో డయాలసిస్ చికిత్సను పూర్తిగా ఉచితం చేయడం, వృద్ధ మహిళల కోసం ప్రత్యేక పథకాలు, అదే విధంగా మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం 'షీ హాస్పిటల్స్' ఏర్పాటు వంటి హామీలు కూడా ఇచ్చారు. దివ్యాంగులకు సామాజిక భద్రతా పింఛనులో అదనంగా 25 శాతం పెంపు చేయాలని ప్రతిపాదించారు. ఇలావుంటే, ఈసారి కేరళ ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. పినరయి విజయన్ నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్ వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఇక పదేళ్ల తర్వాత అధికారంలోకి రావాలని యుడిఎఫ్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవైపు ఇటీవల తిరువనంతపురం కార్పొరేషన్ విజయంతో ఉత్సాహంగా ఉన్న బిజెపి కూడా ఈ ఎన్నికల్లో తన స్థాయిని మెరుగుపరచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఈ నెల 9న ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

## చంద్రయానం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొంటున్నారు. ఈ ప్రయాణం కోసం నాసా రూపొందించిన ఓరియన్ క్యాప్సూల్ ఉపయోగించారు. నాసా నిర్వాహకుడు జారెడ్ ఐజాక్‌మన్ ఈ ప్రయోగాన్ని 'మానవ సహిత చంద్రయానాల' పునరాగమనం గా పేర్కొన్నారు. గత యాభై సంవత్సరాల విరామాన్ని తాత్కాలిక విరామంగా అభివర్ణించారు. కాగా, ఈ ప్రయోగానికి ముందు అనేక సాంకేతిక సవాళ్లు ఎదురయ్యాయి. ముఖ్యంగా హైడ్రోజన్ ఇంధన లీకులు పెద్ద సమస్యగా మారాయి. ఈ సమస్యల కారణంగా ముందుగా షెడ్యూల్ చేసిన ప్రయోగం వాయిదా పడింది. కానీ ఈసారి ప్రయోగానికి ముందు ఎటువంటి పెద్ద లీకులు నమోదు కాలేదు. 7 లక్షల గ్యాలన్లకు పైగా ఇంధనం రాకెట్‌లో నింపారు. ప్రయోగానికి ముందు చివరి నిమిషాల్లో కొన్ని సాంకేతిక సమస్యలు కూడా తలెత్తాయి. బ్యాటరీ సెన్సర్లు సరిగా పనిచేయకపోవడం, రాకెట్ నియంత్రణ వ్యవస్థతో కమ్యూనికేషన్ లోపాలు ఎదురుకావడం వంటి సమస్యలు తలెత్తాయి. అయితే వీటిని తక్షణమే పరిష్కరించడం ద్వారా ప్రయోగం సజావుగా కొనసాగింది.

వ్యోమగాములు మొత్తం పది రోజుల ప్రయాణంలో మొదటి 25 గంటలు భూమి చుట్టూ కక్ష్యలోనే గడుపుతూ క్యాప్సూల్ వ్యవస్థలను పరీక్షించనున్నారు. అనంతరం ప్రధాన ఇంజిన్‌ను ఉపయోగించి చంద్రుని దిశగా ప్రయాణం ప్రారంభమవుతుంది. ఈ యాత్రలో వ్యోమగాములు అపోలో– 8 మిషన్ లాగా చంద్రుని చుట్టూ కక్ష్యలో తిరగరు. వారు చంద్రుని సమీపంగా దాటిన తరువాత మరో 6,400 కిలోమీటర్లు ముందుకు వెళ్లి తిరిగి భూమి వైపు ప్రయాణిస్తారు. ఈ ప్రయాణం పూర్తయిన తరువాత పసిఫిక్ మహాసముద్రంలో దిగుతారు. భూమి చుట్టూ ఉన్న ఉన్నత కక్ష్యలో స్థిరపడిన తరువాత వ్యోమగాములు క్యాప్సూల్‌ను స్వయం గా నియంత్రిస్తూ రాకెట్ విడిపోయిన భాగం చుట్టూ ప్రయోగాత్మకంగా నడిపించారు. 10 మీటర్ల దూరానికి చేరి నియంత్రణ సామర్థ్యాన్ని పరీక్షించారు. ఆటోమేటిక్ వ్యవస్థలు విఫలమైతే మానవ నియంత్రణ ఎంతవరకు పనిచేస్తుందో తెలుసుకోవడం దీని ఉద్దేశ్యం. వ్యోమగాములు ఓరియన్ కిటికీల ద్వారా చిత్రాలు తీస్తారు. సరైన కాంతి పరిస్థితులు ఉంటే ఇప్పటివరకు మానవ కంటికి కనిపించని కొన్ని భౌగోళిక లక్షణాలను కూడా వీక్షించే అవకాశం ఉంది. అదనంగా వారు సంపూర్ణ సూర్యగ్రహణంలోని కొన్ని క్షణాలను కూడా చూడవచ్చు. చంద్రుడు సూర్యుడిని కప్పేసినప్పుడు వెలువడే కరోనా దృశ్యం వారికి ప్రత్యేక అనుభూతిని కలిగించనుంది. నాసా భవిష్యత్ చంద్ర ప్రణాళికలన్నీ ఈ మిషన్ విజయంపై ఆధారపడి ఉన్నా యి. రాబోయే సంవత్సరాల్లో మరిన్ని ప్రయోగాలు జరిపి చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. రోబోటిక్ వాహనాలు, డ్రోన్ల సహాయంతో ఈ ప్రణాళిక అమలు చేయనుంది. ఆర్టెమిస్–I తరువాత, అదే తరహాలో ఇది రెండో ప్రయోగం. అయితే, తొలి మిషన్‌లో మానుషులు లేకపోవడంతో జీవన అవసరాల వ్యవస్థలను పరీక్షించే అవకాశం లభించలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఆ ప్రయోగాలకు అవకాశం ఏర్పడింది. అయితే, వ్యోమగాములను చంద్రుని వైపు పూర్తిగా పంపే ముందు ఒక రోజు సమయం తీసుకుని అన్ని వ్యవస్థలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే క్యాప్సూల్‌లోని మరుగుదొడ్డి వ్యవస్థలో సమస్యలు తలెత్తినట్లు సమాచారం.

తాత్కాలిక పద్ధతులను ఉపయోగిస్తూ సమస్య పరిష్కారంపై ఇంజినీర్లు పనిచేస్తున్నారు. ఈ మిషన్‌కు సంబంధించి ప్రమాదాల అంచనాలను నాసా వెల్లడించలేదు. సాధారణంగా కొత్త రాకెట్ ప్రయోగాలలో విజయం సాధించే అవకాశాలు 50 శాతం కంటే ఎక్కువగా ఉంటాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఖచ్చితమైన వివరాలు లేవు. హైడ్రోజన్ లీకులు, హీలియం వ్యవస్థలో సమస్యలు వంటి అంశాలు గతంలో ప్రయోగాలను ఆలస్యం చేశాయి.

ఆర్టెమిస్–Iలో క్యాప్సూల్ ఉష్ణ రక్షణ కవచంలో సమస్య తలెత్తింది. ఇప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకొని, యాత్ర మొదలైనప్పటికీ, ప్రమాదాల భయం లేకపోలేదు. అయితే, దీర్ఘకాల లక్ష్యాల దృష్ట్యా ఈ ప్రయత్నం కొనసాగుతోంది. మానవుల మార్స్ యాత్రకు చంద్రుడు ఒక పరీక్షా స్థలంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టెమిస్ కార్యక్రమం కేవలం అమెరికా ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా మానవ జాతి భవిష్యత్ ప్రయాణానికి మార్గదర్శిగా నిలుస్తోంది.

## చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

(మొదటి పేజీ తరువాయి)

మహిళా ఉద్యోగులకు కూడా ఈపథకం ఓ వరంగా మారిందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది ఊరటనిచ్చిందన్నారు. ప్రతీ రోజు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సును సద్వినియోగం చేసుకుంటున్నారని, ఇప్టపి వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 290 కోట్ల జీరో టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ.10 వేల కోట్లు మేరా ఆదా అయ్యాయని చెప్పారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుని లబ్ధిపొందిన మహిళలను ఎంఎల్‌ఏ శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వరరావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## యుడిఎఫ్, బిజెపిలకు ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

చెందుతున్నాయని ఆయన అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య సంస్థలపై దాడులు తీవ్రమయ్యాయని అని అన్నారు. ఫాసిస్ట్, మతతత్వ, కార్పొరేట్ మద్దతుగల రాజకీయాలకు వ్యతిరేకంగా నిరంతరం, సైద్ధాంతికంగా పోరాడుతున్నది ఎవరైనా ఉన్నారంటే అది వామపక్ష ఉద్యమమేనని ఆయన స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో బిజెపి మతతత్వ రాజకీయాలను, కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలను వామపక్ష రాజకీయాలు మాత్రమే ఎదుర్కోగలవని ప్రజలు అర్థం చేసుకోవాలని రాజా విజ్ఞప్తి చేశారు.

సిపిఐకి ఆదరణ : నెడుమంగాడ్ నియోజవర్గ నుంచి పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి , రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి జి.ఆర్.అనిల్‌కు విస్తృత ప్రజా మద్దతు లభిస్తోంది. ఇంటింటికీ వెళ్ళి ఆయన ప్రజలను కలుస్తున్న సమయంలో అత్యంత ఉత్సాహభరితమైన స్పందన కనపడుతోంది. పిల్లల నుండి వృద్ధుల వరకు, మహిళలు, యువత, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, సామాన్య కుటుంబాల వరకు సిపిఐ అభ్యర్థితో సెల్ఫీలు దిగుతున్నారు. అలాగే చిరాయికీళు నియోజకవర్గంలో సిపిఐ అభ్యర్థి మనోజ్ బి. ఇడమనకు మద్దతుగా వాహన ప్రచార ర్యాలీ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైంది.

# యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ
# నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్నిచర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ( ఎఫ్‌సిడిఎ) కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ( వైఐఎస్‌యు)కి సంబంధించిన భవన సముదాయాల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు.ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు ఆ ప్రాంత రూపకల్పనలను పరిశీలించి, అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీకి చెందిన పలు భవనాల ను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు , యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు , ఇతర అధికారులు పాల్గొన్నారు.



## వ్యవసాయ రంగం సాంకేతిక బలోపేతంలో
# అంతర్జాతీయ భాగస్వామ్యాలు కీలక పాత్ర

**ఫ్లోరిడా విశ్వవిద్యాలయ ప్రతినిధుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని సాంకేతికంగా బలోపేతం చేయడం, రైతుల ఆదాయం పెంచేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. గురువారం ఫ్లోరిడా విశ్వవిద్యాలయం సహజ వనరులు , పర్యావరణ పాఠశాల డైరెక్టర్ డా. కె. రమేష్ రెడ్డి నాయకత్వంలోని ప్రతినిధుల బృందం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధి, ఫ్లోరిడా విశ్వవిద్యాలయం తరఫున కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం తో కలిసి పరిశోధన, విస్తరణ, విద్యా రంగాల్లో సంయుక్త భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే ప్రభుత్వం, కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కలిసి తెలంగాణ డిజిటల్ సుస్థిర వ్యవసాయ వ్యవస్థల కేంద్రం ( టిడిఎస్ఎసి) స్థాపనపై కూడా చర్చించారు. ఈ భాగస్వామ్యం ద్వారా డిజిటల్, ఖచ్చిత వ్యవసా యం, ఎఐ ఆధారిత వ్యవస్థలు, రిమోట్ సెన్సింగ్, డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులను వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టే అవకాశం ఉందనిఫ్లోరిడా విశ్వవిద్యాలయం బృందం వివరించింది. అలాగే వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటలు అభివృద్ధి, నేల ఆరోగ్య సంరక్షణ, నీటి వినియోగ సమర్థత పెంపు వంటి అంశాలపై ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రత్యేకంగా తెలంగాణలో స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ వంటి అధిక విలువ పంటల సాగు, అలాగే వాటికి సంబంధించిన ప్రాసెసింగ్ టెక్నాలజీలు, పరిశ్రమల స్థాపన ద్వారా రైతులకు అధిక ఆదాయం అందించే అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ ,విలువ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసి, రైతులకు మార్కెట్ అవకాశాలను విస్తరించే దిశగా కలిసి పనిచేయాలని ప్రతినిధులు సూచించారు. దీంతో ఈ కార్యక్రమాల అమలుకు సంబంధించి ఒక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో మాజీ ఎఎన్‌జిఆర్‌యు వైస్ చాన్సలర్ డా. ఎస్. రఘువర్ధన్ రెడ్డి , కొండా లక్ష్మ ణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐ ప్యాక్ కార్యాలయాలలో ఇడి సోదాలు

**కోల్ స్మగ్లింగ్ కేసుతో లింక్..**
**దేశవ్యాప్తంగా పలుచోట్ల సోదాలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయ వ్యూహ సంస్థ ఐప్యాక్ కార్యాలయాలు, అనుబంధ వ్యక్తులపై గురువారం డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) దేశవ్యాప్తంగా దాడులు నిర్వహించింది. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఒకేసారి ఈ సోదాలు జరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అధికారుల సమాచారం ప్రకారం ఈ దాడులు పశ్చిమ బెంగాల్‌లో వెలుగుచూసిన కోల్ స్మగ్లింగ్ (బొగ్గు అక్రమ రవాణా) కేసుతో సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో మనీ లాండరింగ్ కోణంలో విచారణ కొనసాగిస్తున్న ఇడి, ఐప్యాక్‌కు చెందిన కీలక నిర్వాహకుల నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. బెంగళూరులో ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు రిషి రాజ్ సింగ్‌కు సంబంధించిన ప్రాంగణాలు, ముంబైలో కొన్ని అనుబంధ వ్యక్తుల నివాసాలు కూడా ఈ దాడుల పరిధిలోకి వచ్చినట్లు సమాచారం. ఈ కేసు మూలం 2020లో నమోదైన సిబిఐ ఎఫ్‌ఐఆర్‌కు సంబంధించినదిగా అధికారులు పేర్కొంటున్నారు.



బొగ్గు అక్రమ తవ్వకం, రవాణా ద్వారా కోట్ల రూపాయల హవాలా లావాదేవీలు జరిగాయని ఆరోపణలపై ఇడి విచారణ కొనసాగిస్తోంది. ఇదిలా ఉంటే, ఐప్యాక్ తృణమూల్ కాంగ్రెస్‌కు ఎన్నికల వ్యూహ సేవ లు అందిస్తున్న సంస్థ కావడంతో, ఈ దాడులు రాజకీయ రంగంలో మరింత వేడి రేపుతున్నాయి. ప్రతిపక్షాలు కేంద్ర సంస్థల దుర్వినియోగం అంటూ విమర్శలు గుప్పిస్తుండగా, విచారణ మాత్రం కొనసాగుతోంది. మొత్తానికి, ఎన్నికల సమయం దగ్గరపడుతున్న వేళ ఐప్యాక్‌కు ఇడి దాడులు దేశ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారాయి.

# ట్రాన్స్‌కో సంస్థలో బిసి సెల్ ఏర్పాటు చేయాలి

**రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ట్రాన్స్‌కో సంస్థలో బిసి సెల్ ఏర్పాటు చేసి, తగిన వసతి సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి , సభ్య కార్యదర్శి బాల మాయ దేవి గురువారం హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయాన్ని సందర్శించి, సంస్థలో రిజర్వేషన్ల అమలులో బిసిలకు జరిగిన అన్యాయాలతో పాటు ఇతర అంశాల గురించి సుదీర్ఘంగా విచారించారు. ఈ విచారణ కార్యక్రమంలో విద్యుత్ సంస్థ సిఎండి డి. కృష్ణ భాస్కర్, డైరెక్టర్లు వి. శ్రీనివాసులు, డి.లత వినోద్‌తో పాటు తెలంగాణ ఎలక్ట్రిసిటీ బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కుమారస్వామి, వెంకన్న గౌడ్, ట్రాన్స్‌కో అధ్యక్ష కార్యదర్శులు ఎం.అశోక్ కుమార్, కె.ప్రవీణ్, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ 2014 నుంచి 2026 మధ్యన జరిగిన నియామకాల వివరాలను 15 రోజులుగా బిసి కమిషన్‌కు ఇవ్వవలసిందిగా ఆదేశించారు. వివిధ పెండింగ్ కోర్టు కేసులకు సంబంధించిన వివరాల గురించి సంస్థ ఒక కమిటీ వేసి ఉద్యోగుల ప్రమోషన్లు, సీనియారిటీ, ఇతర అంశాలను పరిశీలించాలని కోరారు. అలాగే 2014 నుండి డైరెక్టర్లుగా పనిచేసిన వారి వివరాలు వారి సామాజిక వర్గంతో సహా కమిషన్‌కు అందజేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రిసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణతో పాటు ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## కేరళం సిఎంపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
# ఉపసహరించుకోవాలి

**సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేరళం రాష్ట్ర ఎన్నికల సభలో కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను తెలంగాణ మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోల్చడం సరికాదని, ఈ వ్యాఖ్యాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఓట్లు, సీట్లు కోసం ఏమైనా మాట్లాడవచ్చు, ఎవరినైనా విమర్శించవచ్చు అనే పద్ధతిలో రేవంత్ రెడ్డి మాట్లాడినట్టుగా ఉందని ఆయన ఒక ప్రకటనలో ఆక్షేపించారు. దేశంలోనే 100 శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా కేరళ పేరుగాంచిందని, అక్కడ డిగ్రీ వరకు ఉచిత విద్య కొనసాగించడమే కాకుండా భూ సంస్కరణలు అమలు చేసి పేదవారికి భూ పంపిణీ చేశారని రామకృష్ణ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేరళం రాష్ట్ర ప్రభుత్వం 2025 నవంబర్ 1 నుండి అత్యంత దారిద్ర, దుర్భర జీవనం గడుపుతున్న వారి వివరాలు సేకరించి, వారందరికీ ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాలు కల్పించి పేదరికం లేకుండా చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలో అవినీతి పెరుగుతుండగా, అతి తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిని గుర్తించకుండా అధికారం కావాలనే తాపత్రయంతో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమైనవని రామకృష్ణ పేర్కొన్నారు.

# పరిశ్రమ వ్యర్థాలపై నిర్లక్ష్యం సహించం

**అధికారులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జడ్చర్ల నియోజకవర్గంలోని పోలేపల్లి ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థాలను లెదర్ పార్క్ భూము ల్లో అక్రమంగా పారబోస్తున్న ఘటనపై రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని మంత్రి మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకే స్పందించని అధికారులు సాధారణ ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారో సమాధానం చెప్పాలన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం సచివాలయంలో జరిగే ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాలుష్య నియంత్రణ మం డలి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించా రు. అలాగే రెడ్ జోన్ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు కూ డా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు, పరిశ్రమల వ్యర్థాల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : జీడిమెట్ల సర్కిల్-55** (GHMC)

NIT No. 05/DB/EE/Jedimetla Circle/GHMC/2025-26 తేదీ: 02.04.2026

పని పేరు: పైప్‌లైన్ మరమ్మతు పనులు మరియు అగ్నిమాపక పరికరాల రీఫిల్లింగ్, అంచనా విలువ: రూ.2.20 లక్షలు, ప్రారంభ తేదీ & సమయం: 06.04.2026న మ.3.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 09.04.2026న మ.3.00గం.ల వరకు, టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు మరియు మొబైల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జీడిమెట్ల సర్కిల్-55, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 54-PP/CL/ADVT/2026-27, Date: 02-04-2026

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూ సే) శాఖ
**ఫారం-VI**
(సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ 19 సెక్షన్ 11(1) ఆఫ్ ది యాక్ట్ 30/2013 చూడుము)

**జిల్లా కలెక్టరు ఫైల్ సంఖ్య: G/879/2026** **తేదీ: 23.03.2026**
**RDO ఫైలు సంఖ్య: సి/551/2026** **తేదీ: 24.03.2026**
**గెజిట్ సంఖ్య: 19/2026** **తేదీ: 28.03.2026**

**ప్రాథమిక ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ డివిజన్ - V జనగాం, గారు ఇచ్చిన రిక్విజిషన్ ప్రకారము ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన తిరుమలగిరి మండలము తిరుమలగిరి గ్రామ శివారు లో ఉన్న భూమి విస్తీర్ణం ఎ **16.26 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా 5L of 7R Distributary of Chennur Main Canal of Chennur Tank of JCRDLIS-Phase-III-PackageVI కొరకు అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తం ప్రకటన జారీ చేయనైనది.
ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాది పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు సెక్షన్ 10A(b) ఆఫ్ చాప్టర్-IIIA ప్రకారం ఆహార భద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.
కావున తిరుమలగిరి మండలము, తిరుమలగిరి గ్రామ శివారు పరిధిలో ఉన్న విస్తీర్ణం ఎ **16.26 గుంటలు** మరియు ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

**గ్రామము: తిరుమలగిరి మండలం: తిరుమలగిరి జిల్లా: సూర్యాపేట**

**5 Lఆఫ్ 7 R Distributary of Chennur Main Canal of Chennur Tank of JCRDLIS-Phase-III-PackageVI**

షెడ్యూల్

| క్ర.సం. | సర్వే నం. | యాజమాన్యపు రకము | భూమి రకము | సేకరించబడు భూమి ఎ.గుంటలు / ఏ.గ. | పట్టాదారు పేరు మరియు అనుభవదారు పేరు | సరిహద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 42 | పట్టా | మెట్ట | 0.03 | వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య (ప &అ) | 47 | 866 | 42 | VB | 1 వేప చెట్టు |
| | | | | 0.06 | వర్రే రాజయ్య | | | | | |
| | | | | 0.005 | చిర్రబోయిన సైదులు తండ్రి మల్లయ్య(అ) వెల్పుల సౌందర్య భర్త సైదులు (ప) | | | | | |
| | | | | 0.01 | జక్కుల కోటిలింగం తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.02 | జక్కుల లింగయ్య తండ్రి సోమయ్య (ప &అ) | | | | | |
| 2 | 47 | పట్టా | మెట్ట | 0.005 | వేల్పుల లింగయ్య తండ్రి భయ్యలు (ప &అ) | 48 | 42 | 47 | VB | 29 తాటి చెట్లు |
| | | | | 0.075 | చిలకల లింగయ్య తండ్రి వీరయ్య (ప &అ) | | | | | |
| | | | | 0.095 | కడెం సోమయ్య తండ్రి లింగయ్య (ప&అ) | | | | | |
| 3 | 48 | పట్టా | మెట్ట | 0.18 | సంకేపల్లిరఘునంధన్ రెడ్డి తండ్రి పద్మనాభ రెడ్డి (ప&అ) | VB | 47 | 48 | 48 | |
| | | | | 0.19 | గంట మారయ్య తండ్రి సోమయ్య (ప&అ) గంట వసంత తండ్రి పేరు పాపయ్య (అ) | | | | | |
| | | | | 0.12 | గంటా సుందరయ్య తండ్రి లక్ష్మ య్య (అ) | | | | | |
| | | | | 0.065 | వేల్పుల లింగయ్య తండ్రి చెయ్యలు (అ) వెల్పుల రేణుక తండ్రి లింగయ్య(ప) గంటా సామేలు తండ్రి వెంకటేష్ (ప) గంట జాన్ తండ్రి లక్ష్మ య్య (ప) గంట సోల్మన్ తండ్రి కృపానందం (ప) గండమల్ల మధుర భర్త శేఖర్ (ప) | | | | | |
| 4 | 835 | పట్టా | మెట్ట | 0.175 | కొత్తగట్టు లలిత భర్త మల్లయ్య (ప&అ) | 836 | 833 | 835 | 835 | |
| | | | | 0.185 | చెరివిరాల సుధాకర్ తండ్రి ఆనందం(ప&అ) | | | | | |
| 5 | 836 | పట్టా | మెట్ట | 0.12 | శీల కౌశమ్మ భర్త కొమురయ్య(ప &అ) | | | | | |
| | | | | 0.035 | కొత్తగట్టు లలిత భర్త మల్లయ్య(అ) శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య (ప) పులిగిల్ల లింగయ్య తండ్రి గురయ్య (ప) కన్నెబోయిన మల్లమ్మ తండ్రి సాయిలు (ప) | | | | | |
| 6 | 837 | పట్టా | మెట్ట | 0.015 | శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య(ప&అ) | 839 | 836 | 837 | 837 | |
| | | | | 0.07 | శీల వెంకన్న తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.06 | శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.03 | శీల మల్లేష్ తండ్రి సోమయ్య(అ) శీల కొమరయ్య తండ్రి అవిలయ్య (ప) బెతు ఎర్రయ్య తండ్రి బిక్షం (ప) | | | | | |
| | | | | 0.015 | బాట | | | | | |
| | | | | 0.09 | బేతు భద్రయ్య తండ్రి బిక్షపతి (ప&అ) | | | | | |
| | | | | 0.155 | బేతు సాంబయ్య తండ్రి బిక్షపతి (ప&అ) | | | | | |
| | | | | 0.10 | శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.035 | శీల కౌశమ్మ భర్త కొమురయ్య (ప&అ) | | | | | |
| 7 | 839 | పట్టా | మెట్ట | 0.09 | బేటి సోమయ్య తండ్రి కొండయ్య(అ) | 842 | 837 | 839 | 839 | |
| | | | | 0.14 | శీల మల్లేష్ తండ్రి సోమయ్య(అ) | | | | | |
| | | | | 0.145 | శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య (అ) | | | | | |
| | | | | 0.01 | శీల ప్రభాకర్ తండ్రి సోమయ్య (అ) ఎదునూరి సోమలక్ష్మ మ్మ భర్త అబ్బయ్య (ప) దామెర జల్లయ్య తండ్రి ఇష్టారి (అ) బేతు చంద్రకళ భర్త సోమయ్య (అ) శీల లింగయ్య తండ్రి పాపయ్య (ప) కొడిదల అంజయ్య తండ్రి ఇదయ్య (ప) గోపాలదాసు కొండమ్మ భర్త యాదయ్య(ప) ఇదునూరు స్వామి, తల్లి లక్ష్మ మ్మ (ప) ఇదునూరు లక్ష్మ మ్మ భర్త అబ్బయ్య (ప) | | | | | |
| | | | | 0.06 | శీల వెంకన్న తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.005 | శీల వెంకన్న తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| 8 | 841 | పట్టా | మెట్ట | 0.395 | గాదరబోయిన ఉప్పలయ్య తండ్రి మల్లయ్య (ప&అ) | 854 | 842 | 841 | 841 | |
| | | | | 0.035 | బేతు సోమయ్య తండ్రి కొండయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.09 | బేతు రాములు తండ్రి వెంకటయ్య(ప &అ) | | | | | |
| 9 | 842 | పట్టా | మెట్ట | 0.13 | బెతు ఎర్రయ్య తండ్రి బిక్షం(అ) బేతు వెంకటయ్య తండ్రి ఐద్రయ్య (ప) బేతు అవిలమల్లు తండ్రి మల్లయ్య (ప) చేతు రాములు తండ్రి వెంకటయ్య (ప) | 841 | 839 | 842 | 842 | 3 వేప చెట్లు |
| | | | | 0.01 | బాట | | | | | |
| 10 | 854 | పట్టా | మెట్ట | 0.065 | బేటి లింగయ్య తండ్రి స్వామి(అ) | 857 | 841 | 855 | 854 | |
| | | | | 0.065 | బేటి ఎర్రయ్య తండ్రి పేరు బిక్షం (ప&అ) | | | | | |
| | | | | 0.015 | బేటి జీదయ్య తండ్రి స్వామి(అ) | | | | | |
| | | | | 0.01 | గాదరబోయిన ఉప్పలయ్య తండ్రి మల్లయ్య (అ) బేతు నర్సింహ తండ్రి వెంకటయ్య (ప) చేత సాంబయ్య తండ్రి బిక్షం (ప) కటం నరేష్ తండ్రి రాములు(ప) కటం సురేష్ తండ్రి రాములు (ప) బతిని నగేష్ తండ్రి నర్సయ్య (ప) బేతు అవిలమల్లు తండ్రి మల్లయ్య (ప) బేతు చిన్న విరమల్లు తండ్రి మల్లయ్య (ప) బేతు రాములు తండ్రి వెంకటయ్య (ప) | | | | | |
| 11 | 855 | పట్టా | మెట్ట | 0.025 | బేటి ఎర్రయ్య తండ్రి బిక్షం (ప&అ) | 857 | 841 | 855 | 854 | |
| 12 | 857 | పట్టా | మెట్ట | 0.04 | బేటి లింగయ్య తండ్రి స్వామి (ప &అ) | 858 | 854 | 857 | 857 | 1 వేప చెట్టు |
| | | | | 0.09 | బేటి ఉదయ్య తండ్రి స్వామి (ప&అ) | | | | | |
| | | | | 0.135 | బేతి గంగులు తండ్రి కొండయ్య (ప&అ) | | | | | |
| | | | | 0.035 | బేతి సోమయ్య తండ్రి కొండయ్య (ప&అ) | | | | | 1 తుమ్మ, 1 వేప చెట్టు |
| | | | | 0.14 | కోట మహేష్ తండ్రి సోమయ్య (ప&అ) | | | | | |
| | | | | 0.14 | కోట లింగయ్య తండ్రి సోమయ్య (అ) బేతు సాంబయ్య తండ్రి బిక్షం (ప) బేతు ఐక్క య్య తండ్రి లింగయ్య(అ) బేతు బద్రయ్య తండ్రి బిక్షం (ప) బేతు ఎర్రయ్య తండ్రి బిక్షం (ప) కొత్త లింగమ్మ తండ్రి మహేష్ (ప) బేతు వెంకటయ్య తండ్రి భద్రయ్య (ప) కొత్త వెంకటమ్మ భర్త సోమయ్య (ప) | | | | | |
| | | | | 0.02 | బేటి పెద్దులు తండ్రి రాములు (ప &అ) | | | | | |
| | | | | 0.02 | బేటి బిక్షం తండ్రి అవిలయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.04 | కోట మహేష్ తండ్రి సోమయ్య(ప&అ) | | | | | |
| | | | | 0.06 | బేటి జీదయ్య తండ్రి స్వామి (ప&అ) | | | | | |
| 13 | 858 | పట్టా | మెట్ట | 0.325 | గాధరబోయిన నగేష్ తండ్రి పుల్లయ్య(ప&అ) | 858 | 857 | 857 | 858 | 28 తాటి చెట్లు |
| | | | | 0.145 | గాధరబోయిన సాంబయ్య తండ్రి వెంకయ్య(ప&అ) గాధరబోయిన కోటిలింగం తండ్రి వెంకయ్య(ప&అ) | | | | | |
| 14 | 861 | పట్టా | మెట్ట | 0.05 | గాధరబోయిన పెద్ద లింగయ్య తండ్రి కొండయ్య(ప&అ) | 870 | 858 | 861 | 861 | 1 వేప చెట్టు |
| | | | | 0.005 | పాలబిందెల ధనమ్మ భర్త రాములు(అ) | | | | | |
| | | | | 0.08 | బేటి పెద్దులు తండ్రి రామయ్య (ప&అ) | | | | | |
| | | | | 0.015 | బేటి బిక్షం తండ్రి అవిలయ్య (అ) | | | | | |
| | | | | | గాధరబోయిన నగేష్ తండ్రి పుల్లయ్య (అ) గాధరబోయిన సాంబయ్య తండ్రి వెంకయ్య (అ) గాధరబోయిన కోటిలింగం తండ్రి వెంకయ్య పాలబిందెల యాదగిరి తండ్రి హన్మంతు (ప) పాలబిందెల సోమయ్య తండ్రి హన్మంతు (ప) వేల్పుల అశోక్ తండ్రి రాజమల్లు (ప) పాలబిందెల పూలమ్మ తండ్రి లాలమ్మ (ప) పాలబిందెల అర్సపల్లి తండ్రి చంద్రయ్య (అ) పాలబిందెల బిక్షం తండ్రి మల్లయ్య (ప) పాలబిందెల యాదగిరి తండ్రి నర్సయ్య (ప) పాలబిందెల సైదమ్మ భర్త యాదగిరి (ప) పాలబిందెల నర్సయ్య తండ్రి చంద్రయ్య (ప) బేతు కనకమ్మ భర్త అవిలయ్య (అ) పాలబిందెల నర్సయ్య తండ్రి లింగయ్య (ప) పాలబిందెల వెంకటయ్య తండ్రి కాశయ్య (ప) పాలబిందెల రాములు తండ్రి కాశయ్య (ప) పాలబిందెల అనిత భర్త తిరుమలేష్ (ప) ఓర్సు ఇద్దయ్య తండ్రి మల్లయ్య (ప) గాధరబోయిన కోటిలింగం తండ్రి వెంకయ్య (అ) | | | | | |
| 15 | 862 | పట్టా | మెట్ట | 0.155 | పాలబిందెల వెంకన్న తండ్రి సోమయ్య(అ) | 865 | 870 | 862 | 862 | |
| | | | | 0.015 | బాట | | | | | |
| | | | | 0.115 | బుక్క వెంకటయ్య తండ్రి రామయ్య (అ) | | | | | |
| | | | | 0.010 | పాలబిందెల రాములు తండ్రి నారాయణ (అ) పాలబిందెల శేఖర్ తండ్రి సోమయ్య (ప) పాలబిందెల మనోజ్ తండ్రి ఆంజనేయులు (ప) పాలబిందెల రాములు తండ్రి కాశయ్య (అ) పాలబిందుల తిరుమలేష్ తండ్రి అంజయ్య (ప) కోటమర్తి మంజుల భర్త వెంకన్న (ప) | | | | | 1 వేప చెట్టు 1 తాటి చెట్టు |
| 16 | 865 | పట్టా | మెట్ట | 0.015 | చిర్రబోయిన సౌందర్య భర్త సైదులు (అ) | 866 | 862 | 865 | 865 | 2 వేప చెట్లు |
| | | | | 0.03 | వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య (అ) | | | | | |
| | | | | 0.05 | వేల్పుల అవిలయ్య తండ్రి లచ్చయ్య(అ) | | | | | |
| | | | | 0.15 | పాలబిందెల వెంకన్న తండ్రి సోమయ్య (అ) | | | | | 1 తాటి చెట్టు |
| | | | | 0.02 | పాలబిందెల కొండయ్య తండ్రి జావిద్ (అ) | | | | | |
| | | | | 0.065 | వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య (అ) | | | | | |
| | | | | 0.05 | పాలబిందెల కొండయ్య తండ్రి జావిద్ (అ) వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య(అ) పాలబిందెల వెంకన్న తండ్రి సోమయ్య (అ) | | | | | |
| | | | | 0.045 | వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య(అ) | | | | | |
| | | | | 0.065 | పాలబిందెల వెంకన్న తండ్రి సోమయ్య (అ) పాలబిందెల నర్సయ్య తండ్రి లింగయ్య (ప) పాలబిందెల రాములు తండ్రి బుచయ్య (ప) పాలబిందెల హన్మంతు తండ్రి దేవయ్య (ప) పాలబిందెల కొండయ్య తండ్రి జామాల్ (ప) పాలబిందెల వెంకన్న తండ్రి లాలయ్య (ప) వేల్పుల నాగమ్మ భర్త అవిలయ్య (ప) వేల్పుల సుజాత భర్త లింగయ్య (ప) పాలబిందెల పులమ్మ భర్త లాలయ్య (ప) పాల బిందెల వెంకటేశ్వర్లు తండ్రి కొండయ్య (ప) పాలబిందెల యాదగిరి తండ్రి లాలయ్య (ప) పాలబిందెల మనోజ్ తండ్రి ఆంజనేయులు (ప) పాలబిందెల లాలయ్య తండ్రి చంద్రయ్య (ప) పాలబిందెల బిక్షం తండ్రి మల్లయ్య (ప) పాలబిందెల శేఖర్ తండ్రి సోమయ్య (ప) పాలబిందెల యాదగిరి తండ్రి హన్మంతు (ప) పిలిగిల్ల అరుణ భర్త బిక్షపతి (ప) పాలబిందెల వెంకటేశ్వర్లు తండ్రి సోమలింగయ్య (ప) పాలబిందెల సోమయ్య తండ్రి హన్మంతు(ప) బుక్కా వీరయ్య తండ్రి రామయ్య (ప) వేల్పుల అశోక్ తండ్రి రాజమల్లు (ప) | | | | | |
| | | | | 0.01 | జక్కుల లింగయ్య తండ్రి సోమయ్య (ప) | | | | | |
| | | | | 0.015 | వేల్పుల రాజమల్లు తండ్రి కొండయ్య (ప&అ) | | | | | |
| | | | | | జక్కుల నాగలక్ష్మి భర్త కోటిలింగం (అ) | | | | | |
| 17 | 866 | పట్టా | మెట్ట | 0.12 | కోడెల కిరణ్ కుమార్ తండ్రి గోపయ్య (ప) వేల్పుల సులోచన భర్త రాజమల్లు (ప) జక్కుల కోటిలింగం తండ్రి సోమయ్య (ప) జక్కుల గట్టయ్య తండ్రి సోమయ్య (ప) పాలబిందెల బిక్షం తండ్రి మల్లయ్య (ప) పాలబిందెల రాములు తండ్రి కాశయ్య (ప) పాలబిందెల తిరుమలేష్ తండ్రి అంజయ్య (ప) | | | | | |
| | | | | 0.03 | నందాపురం - తిరుమలగిరి రోడ్డు | 42 | 865 | 866 | 866 | |
| | | | | 0.15 | చిరబోయిన సౌందర్య భర్త సైదులు (ప&అ) | | | | | |
| 18 | 869 | పట్టా | మెట్ట | 0.21 | పాలబిందెల రాములు తండ్రి నారాయణ (ప &అ) | 862 | 870 | 869 | 869 | 4 వేప చెట్లు |
| | | | | 0.21 | బుక్క వెంకయ్య తండ్రి రామయ్య (ప &అ) | | | | | |
| | | | | 0.115 | పాలబిందెల సుభాష్ తండ్రి వెంకటయ్య (అ) పాలబిందెల నర్సయ్య తండ్రి లింగయ్య (ప) పాలబిందెల మల్లయ్య తండ్రి కాశయ్య (ప) పాలబిందెల వెంకన్న తండ్రి లాలయ్య (ప) పాలబిందెల యాదగిరి తండ్రి లాలయ్య (ప) పాలబిందెల సోమయ్య తండ్రి నారాయణ (ప) పాలబిందెల శేఖర్ తండ్రి నారాయణ (ప) బుక్క వీరయ్య తండ్రి రామయ్య (ప) సలిగంటి మాదవి భర్త మల్సూర్ (ప) కోటమర్తి కవిత భర్త సుదాకర్ (ప) పోతుగంటి అనిత భర్త వీరయ్య (ప) | | | | | |
| | | | | 0.055 | పాలబిందెల బిక్షమమ్మ భర్త రాములు (ప &అ) | | | | | |
| 19 | 870 | పట్టా | మెట్ట | 0.035 | పాలబిందెల బిక్షమమ్మ భర్త రాములు (అ) | 869 | 861 | 870 | 870 | |
| | | | | 0.17 | బుక్క వెంకయ్య తండ్రి రామయ్య (ప &అ) బుక్క సోమాని తండ్రి రామయ్య(అ) బుక్క పానీ తండ్రి రామయ్య(అ) | | | | | |
| | | | | 0.04 | పాలబిందెల బిక్షమమ్మ భర్త రాములు (అ) | | | | | |
| | | | | 0.04 | బుక్క వెంకయ్య తండ్రి రామయ్య (ప & అ) బుక్క సోమాని తండ్రి రామయ్య(అ) బుక్క పానీ తండ్రి రామయ్య (అ) | | | | | |
| | | | | 0.12 | పాలబిందెల దనమ్మ భర్త రాములు(అ) పాలబిందెల బిక్షం తండ్రి మల్లయ్య (ప) దేశగాని శ్రీనివాస్ తండ్రి చెన్నయ్య (ప) పాలబిందెల వెంకటయ్య తండ్రి కాశయ్య (ప) పోతుగంటి అనిత భర్త వీరయ్య (ప) | | | | | |
| | మొత్తం | | | 16.26 | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 (నెం.30/2013) లోని నియమంలోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారము చెల్లించుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు భూ సేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/ జిల్లా కలెక్టరు, సూర్యాపేట గార్లు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.
భూ సేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టరు, సూర్యాపేట మరియు రాజస్వ మండలాధికారి, సూర్యాపేట గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసియున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టరు, సూర్యాపేట గారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలయును..

సం/- రాజస్వ మండలాధికారి సూర్యాపేట
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR RO NO. 1363/LA/PP/Advt/Pub/2026-27



## ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లాను వైద్యరంగంలో ముందంజలో నిలిపే దిశగా నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.లాభాపేక్ష లేకుండా మానవతా దృక్పథంతో ప్రజలకు వైద్యం అందించడం వైద్యుల ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.నల్లగొండ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి నైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.డబ్బు కోసం కాకుండా సేవా భావంతో వైద్యం చేయాలని వైద్యులకు మంత్రి పిలుపునిచ్చారు.అత్యవసర వైద్య సేవలు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా సేవలను విస్తరించాలని కోరారు.ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి పూర్తి మద్దతు అందిస్తుందని, ప్రజలకు అన్ని విధాలుగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని మంత్రి పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,సాయి నైసా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ రాపోలు దత్త గణేష్,నిర్వాహకులు డా. రాపోలు అనిల్ కుమార్, డా. దివ్య, ప్రమీల, రాపోలు ఆవంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ అబ్బగోని కవిత రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇందిరమ్మ రాజ్యం స్థాపించాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలంలోని గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి అధోగతి చేస్తే ప్రగతి వైపు పోతూ ప్రజాసంక్షేమాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలన్నిటిని గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామ సర్పంచ్ గట్టు జ్యోతి శ్రీనివాస్ అధ్యక్షన జరిగిన సభలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట ఆర్‌డిఓ వేణుమాధవ్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, ఎంపిడిఓ బాలకృష్ణ, రూరల్ ఎస్ఐ బాలు నాయక్ పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య రానివ్వొద్దు

### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం కొండభీమనపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో అన్ని శాఖల అధికారులతో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ పట్టణంలోని ఎంఎల్ఏ నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు రాకుండా పైప్‌లైన్‌లు, మోటార్ల మరమ్మతులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. గ్రామాలలో పైప్‌లైన్ల మరమ్మతుల నిర్వహణ పనులను తక్షణమే పూర్తి చేసి నీటి సరఫరా అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మోటార్ల సమస్యలు, లోపాలను కూడా వెంటనే గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. ఈకార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ నగేష్, ఆలంపల్లి నర్సింహా, దేవరకొండ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రాంసింగ్, ఏఈలు యువరాజ్, ధనంజయ్, మల్యాద్రి, శేఖర్ హుస్సేన్, వెంకటేష్, సాయి, వివేక్, లింగం, శ్రీలేఖ పాల్గొన్నారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

### ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.గురువారం నకిరేకల్ మండలంలోని చీమలగడ్డ,గోరెంకలపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తేమ శాతం పేరుతో ధాన్యాన్ని తిరస్కరించకుండా పారదర్శకంగా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వ కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు త్వరితగతిన రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జెడ్‌పిసీఈఓ ఎన్.ప్రేమ్ కరణ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత,మార్కెట్ చైర్మన్ గుత్తా మంజులమాధవ్ రెడ్డి,మున్సిపాలిటీ చైర్మన్ చెవుగోని రజితశ్రీనివాస్,ఎంపీడీవో వెంకటేశ్వరరావు,తహసీల్దార్ యశ్వంత్ రాజు,నాగుల వంచ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# ప్రగతిపథంలో తెలంగాణ

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో గురువారం జరిగిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జరిగిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 30న రాష్ట్ర బడ్జెట్‌ను ఆమోదించుకున్న విషయం తెలిసిందేనని, రాష్ట్రంలో కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే నియోజకవర్గానికి 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించిదన్నారు. గతంలో బేస్మెంట్, పిల్లర్లు వేసుకున్న వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమైన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో మార్చి 15 వరకు పెండింగ్‌లో ఉన్న పరిశుభ్రత, ఫైళ్ళ క్లియరెన్స్ జరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ పథకాల కింద లబ్ధిదారుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలుగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వివిధ రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ భానుశ్రీ అధ్యక్షత వహించగా గ్రామ ప్రముఖులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రణాళికతో వేగంగా గ్రామాభివృద్ధి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




**ప్రజాపక్షం/తిప్పర్తి :** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కింద 99 రోజుల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.రానున్న మూడేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు,సన్నబియ్యం వంటి పథకాలు అందజేసి గ్రామీణ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చిందని, రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించేలా ఇది రూపొందించామని తెలిపారు. మండల అభివృద్ధికి 60 లక్షలతో సీసీ రోడ్లు,6కోట్లతో జూనియర్ కాలేజ్, 26కోట్లతో పీహెచ్‌సీ మంజూరు చేసినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి త్వరలో గృహప్రవేశాలు జరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, జెడ్‌పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్.పాశం రామ్ రెడ్డి.బద్దం సుధీర్.తాహసిల్దార్ రామకృష్ణ.ఎంపీడీవో జానయ్య.గ్రామ సెక్రెటరీ నరసింహస్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్‌లను వెంటనే కన్వర్షన్ చేయాలి



### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్లను తక్షణమే కన్వర్షన్ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద టివిఏసి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాకు సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఆర్టిజన్‌లు గత 22 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు లభించలేదన్నారు. అర్హతలను బట్టి కన్వర్షన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.గత ప్రభుత్వం సమస్యను గుర్తించినప్పటికీ,పాత స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్‌ను అమలు చేస్తూ రెగ్యులర్ ఉద్యోగులు,ఆర్టిజన్‌ల మధ్య వ్యత్యాసం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్హతల ఆధారంగా ఆర్టిజన్‌లను జూనియర్ లైన్‌మెన్‌లు,సబ్ ఇంజనీర్లు, జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలని సూచించారు.చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న ఆర్టిజన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు కన్వర్షన్ అత్యవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని విజ్ఞప్తి చేశారు.నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పని చేస్తు న్న ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవట్లేదని .విద్యుత్ సంస్థ కు చెందిన ఆర్టిజన్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామన్న వారి హామీ ఇప్పటికి నెరవేర్చలేదని అన్నారు. మీ న్యాయమైన కోర్కెలు తీర్చే వరకు మీకు భాసటగా ఉంటామని ఐకమత్యంతో మీరంతా మీ కోర్కెల సాధనకు ప్రభుత్వంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున రెడ్డి,నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైది రెడ్డి,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి,టివిఏసి జేఏసీ స్టేట్ కో కన్వీనర్ సాయిలు,స్టేట్ వైస్ చైర్మన్ చింత ఎల్లయ్య,జిల్లా చైర్మన్ లింగస్వామి,జిల్లా జేఏసీ నాయకులు లింగారెడ్డి విజయ్ కుమార్ ప్రవీణ్ సతీష్ ఉమా నాగమణి రమ్య ట్రాన్స్కో కో కన్వీనర్ సహదేవ్, చైర్మన్ శ్రీనివాస్ యాదవ్,రమేష్,చంద్రశేఖర్ రెడ్డి,లతీఫ్,నగేష్,సైదులు,నాగరాజు,చాంద్ పాషా జానయ్య వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ పాలనలో అభివృద్ధి పరుగులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వార్డులతోపాటు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు చేరవేసేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆనతికాలంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లను రికార్డుల స్థాయిలో అందించామని, పట్టణంలోనూ ఇందిరమ్మ ఇండ్లను త్వరలో అందిస్తామని హామి ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని 25వ వార్డులో ఏర్పాటు చేసిన వార్డు సభలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పాల్గొని అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమీషనర్ గణవేణి శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష, కౌన్సిలర్ చక్రి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తాం




**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం భువనగిరి పరిధిలోని 31వ వార్డులో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక @99 కార్యచరణలో బాగంగా వార్డు సభలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. ముందుగా జాతీయ గీతాలపనతో వార్డు సభను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాల పై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పై రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రసంగాన్ని చదివి వినిపించారు. ఈ వార్డు సభలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తభసుమ్, సంబంధిత అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సెన్సస్ మ్యాపింగ్‌లో తప్పులు లేకుండా సక్రమంగా పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లాలో సెన్సస్ మ్యాపింగ్ పనులను తప్పులు లేకుండా సక్రమంగా పూర్తి చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో తహసీల్దారులు,మున్సిపల్ కమిషనర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు.శనివారం లోపు మ్యాపింగ్,డేటా ఎంట్రీ పనులు పూర్తి చేయాలని చెప్పారు.స్లమ్ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి జాగ్రత్తగా మ్యాపింగ్ చేయాలని చెప్పారు. ప్రతి 6 గురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్వైజర్ ను నియమించాలని తెలిపారు.ప్రతి హెచ్‌ఎల్‌బీకు ఒక ఎన్యూమరేటర్ ఉండాలని, హెచ్‌ఎల్‌బీ మ్యాప్‌ను యూనిట్లను నమోదు చేయాలని చెప్పారు. డోర్ టు డోర్ సర్వే నిర్వహించి ప్రతి ఇంటిని పరిశీలిస్తూ యూనిట్ వారీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.సేకరించిన సమాచారాన్ని సకాలంలో సీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ గ్రామాలను ప్రత్యేకంగా విభజించి మ్యాపింగ్ చేయాలని, ఎన్యూమరేటర్ల కొరత లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ జూమ్ మీటింగ్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,నల్లగొండ మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర,ఎలక్షన్ డిటి విజయ్,తదితరులు హాజరయ్యారు.

## 4నఎంజియులో మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం,టాస్క్ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో 15 కంపెనీలు పాల్గొననున్నట్లు ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డా హరీష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ,ఫార్మా,అగ్రికల్చర్ బ్యాంకింగ్ రంగాలలో సుమారు 1500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాలిటెక్నిక్ డిప్లమో,ఇంజనీరింగ్ బీఎస్సీ అగ్రికల్చర్,బీకాం, బీఫార్మ, ఎంబీఏ,ఎంసీఏ ఎం ఎస్సి,డిగ్రీ చివరి సంవత్సరం అభ్యర్థులు సైతం పోస్టర్లు పొందుపరిచిన క్యూఆర్ కోడ్ తో రిజిస్ట్రేషన్ చేసుకొని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావచ్చు అని ఆయన సూచించారు.

## కాంగ్రెస్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి

### ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** భువనగిరి మున్సిపాలిటీలోని 22వ వార్డులో కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ అధ్యక్షతన ప్రజా పాలనపట్టణ ప్రణాళిక, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వార్డు సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. గ తంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఎలాంటి సదుపాయాలు లేవని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే 60 మంది వైద్యులతో సూపర్ స్పెషాలిటీ వైద్యం రోగులకు అందుతుందని అన్నారు. రూ.25 కోట్లతో జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. రోగులకు ఐ సి యూ సేవలతో పాటు ఆక్సిజన్ సదుపాయాలు కూడా అందుతున్నాయని గుర్తు చేశారు. అడగగానే కమ్యూనిటీ హాలు మంజూరు చేస్తానని చెప్పినందుకు ఎమ్మెల్యేకు వార్డు ప్రజల తరపున కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మునిసిపల్ చైర్ పర్సన్, తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్ పర్సన్, పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బర్రె పూజిత జహంగీర్, బొంతల నర్సింహా పాల్గొన్నారు.




## ప్రజాపాలనతో పేదలందరికీ సంక్షేమ పథకాలు

### గ్రామసభల ద్వారానే అర్హులకు పథకాల లబ్ధి

### ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్‌పల్లి) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కృషి చేస్తున్నామని తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పల్లె పహాడ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఆసరా పెన్షన్లు,గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకాల లబ్ధి చేరేలా గ్రామసభల ద్వారా గుర్తింపు చేపడుతున్నామని, ఇంకా దరఖాస్తు చేయని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇస్తూ, ముత్యాలమ్మ దేవాలయం వద్ద సిసిరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.గ్రామ ప్రజలు వెల్లడించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను వెల్లడించగా అధికారులు వాటిని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సంగీశెట్టి రానమ్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభకులో స్పెషల్ ఆఫీసర్ అరుణ్ కుమార్,గ్రామ కార్యదర్శి వినోద్,జీపీఓ సాయికుమార్,ఉప సర్పంచ్ గంగుల దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/రామన్నపేట :** ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రి పరిధిలోని ఎమర్జెన్సీ, మెడికల్, లేబర్ రూమ్, ఇన్ పేషేంట్ వార్డులను తిరుగుతూ వార్డులో ఉన్న పేషంట్లతో మాట్లాడుతూ డాక్టర్, సిబ్బంది వైద్యం మంచిగా అందిస్తున్నారా, సమయానికి మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న వైద్యం గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఓపికి ఎంతమంది వస్తున్నారని ఆరా తీశారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సమయానికి వైద్య సేవలు అందించాలని అన్నారు. అవసరమైన మందులు అన్ని అందుబాటులో ఉంచుకోవాలని, కాల పరిమితి అయిపోయిన మందులను తొలగించాలని సూచించారు. ప్రతి నెల ఆసుపత్రిలో ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని ఆరా తీస్తూ, ఈ నెలలో ఎన్ని ఈడిడిలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలతో తరచూ మాట్లాడుతూ వారి ఆరోగ్యం ఎలా ఉందని ట్రాక్ చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులు చేస్తున్నారని గర్భిణీలకు ఆశ వర్కర్లు అవగాహన కల్పించి అందరూ కూడా 100 శాతం డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని అన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండాలని పరిసరాలలో మట్టి, చెత్త తొలగించి చెట్ల మొక్కలు నాటలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.మనోహర్, డిసిహెచ్ఎస్ డాక్టర్ చిన్నా నాయక్, ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ శ్వేతా ప్రియాంక, సివిల్ సర్జన్ డాక్టర్ వీరన్న, డాక్టర్ అశ్విన్ గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటే రమేష్, వార్డు నెంబర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## కేరళలో ఎల్‌డిఎఫ్, సిఎం విజయన్ ప్రధాని మోదీకి 'బి-టీమ్'

వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ ధ్వజం



**తిరువనంతపురం :** కేరళలో అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి బి టీమ్‌గా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. గురువారం ఆమె పుథన్‌థోపులో కేరళ అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ఎన్నికల ప్రచారం కోసం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాకు తలవంచారని మండిపడ్డారు. పశ్చిమాసియా సంఘర్షణతో దానికి ఉన్న సంబంధాన్ని కారణంగా చూపారని, ఫలితంగా ఇతర దేశాలతో పాటు భారతదేశం కూడా నష్టపోయే పరిస్థితిని సృష్టించారని ఆరోపించారు. @మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక పిరికివాడు. ఆయనకు వెన్నెముక లేదు. భారతదేశం ముందు నిలబడే ధైర్యం లేనందున, ఆయన ప్రతీరోజూ మూల్యం చెల్లించుకుంటున్నారు' అని ప్రియాంకగాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## రాఘవ్ చద్దాకు 'ఆప్' షాక్

**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) రాజ్యసభ సభ్యుడైన రాఘవ్ చద్దాపై ఆ పార్టీ చర్యలు చేపట్టింది. 2023 నుంచి రాజ్యసభలో ఉప నేతగా ఉన్న ఆయనను ఆ పదవి నుంచి తొలగించింది. పంజాబ్ ఎంపీ అశోక్ మిట్టల్‌ను రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఆ పార్టీ నియమించింది. ఈ మార్పునకు సంబంధించి అధికారిక లేఖను రాజ్యసభ సచివాలయానికి ఆప్ పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే సభలో మాట్లాడటానికి రాఘవ్ చద్దాకు సమయం కేటాయించకూడదని కూడా ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా, ఆప్ తీసుకున్న ఈ కీలక నిర్ణయంపై రాఘవ్ చద్దా మౌనం వహించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో చీలిక ఏర్పడిందనే వదంతులు మరింత తీవ్రమయ్యాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఇతర నేతలను నిర్దోషులుగా ఢిల్లీ కోర్టు ఫిబ్రవరిలో ప్రకటించింది. అయితే రాఘవ్ చద్దా దీనిపై స్పందించలేదు. అలాగే పార్టీ కార్యాలయంలో కేజ్రీవాల్ ప్రసంగించిన సమావేశంతో పాటు జంతర్ మంతర్ వద్ద జరిగిన 'జనసభ' వంటి కీలక పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాఘవ్ చద్దా పార్టీకి దూరంగా ఉంటున్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. తాజా చర్యతో ఆప్, ఆయన మధ్య విభేదాలు మరింత ముదిరినట్లు తెలిసింది.

## 'బిడ్డ మరణానికి నేనే బాధ్యురాలిని' మహిళా టెకీ ఆత్మహత్య

**బెంగళూరు :** కర్నాటక రాజధాని బెంగళూరులో 11 నెలల తన బిడ్డ ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో మునిగి మృతి చెందిన కొద్ది నిమిషాలకే, ఓ మహిళా టెకీ ఆత్మహత్యకు పాల్పడింది. సాఫ్ట్‌వేర్ నిపుణురాలైన ప్రతిభ (29) తన బిడ్డతో ఇంట్లో ఉండగా, ఆమె భర్త మహంతేష్ పనిమీద వెళ్లారు. ప్రతిభ తన బిడ్డ అగస్త్య బట్టలు తీసుకోవడానికి టెర్రస్‌పైకి వెళ్లింది. ఈ లోగా పాకుతూ వెళ్లిన బిడ్డ ప్రమాదవశాత్తు నీటితో నిండిన బకెట్‌లో పడిపోయింది. ఆమె ఇది గమనించేసరికి, తన బిడ్డ బకెట్‌లో ప్రాణాలు కోల్పోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె, మొదట మణికట్టు కోసుకుని, కొన్ని మాత్రలు మింగి, తరువాత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం మహంతేష్ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, తలుపు లోపలి నుంచి గడియ పెట్టి ఉండటాన్ని గమనించాడు. వారి వద్ద ఉన్న అదనపు తాళంచెవితో అతడు ఇంట్లోకి ప్రవేశించి చూడగా, తన భార్య, బిడ్డ ఇద్దరూ చనిపోయి ఉన్నారు. ప్రతిభ రాసిన ఆత్మహత్య లేఖను చూశాడు. తన తప్పిదం వల్లే బిడ్డ చనిపోయిందని ప్రతిభ తన సూసైడ్ లేఖలో పేర్కొంది. దీంతో 15 మాత్రల ఖాళీ స్ట్రిప్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తన బిడ్డ మరణానికి తానే 'బాధ్యురాలినని' సూసైడ్‌లో ఆమె పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు జరుగుతోందన్నారు. గత నాలుగేళ్లుగా ఆ కుటుంబం అద్దె ఫ్లాట్‌లో నివసిస్తోందని పోలీసులు తెలిపారు.

## ప్రొఫెసర్ వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య

**బెంగళూరు :** కాలేజీ ప్రొఫెసర్, తోటి విద్యార్థినుల వేధింపుల కారణంగా ఓ యువతి ప్రాణాలు తీసుకుంది. ప్రొఫెసర్‌తో సంబంధం ఉందంటూ తప్పుడు ప్రచారం చేయటంతో తట్టుకోలేకపోయిన ఆ యువతి ఈ దారుణమైన నిర్ణయం తీసుకుంది. ఈ ఘటన కర్నాటకలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... చిత్రదుర్గ జిల్లా హోలల్‌కెరె టౌన్‌కు చెందిన లిఖిత (23) మల్లాడిహళ్లిలోని ఆయుర్వేద కాలేజీలో బీఏఎంఎస్ చదువుతోంది. ప్రొఫెసర్ రాజు, ఆయన భార్య నిశా, కొంతమంది విద్యార్థినులు... లిఖితపై కక్షగట్టారు. ఆమె ప్రొఫెసర్ రాజుతో ఎఫైర్ పెట్టుకుందంటూ కళాశాలలో తప్పుడు ప్రచారం చేయటం మొదలెట్టారు. ఆమెను మానసికంగా, శారీరకంగా హింసించటం మొదలెట్టారు. వారి వేధింపులు లిఖత తట్టుకోలేకపోయింది. చనిపోవడానికి ముందు తన బాధను తెలియజేస్తూ ఓ సూసైడ్ నోట్ రాసింది. ఆ సూసైడ్ నోట్‌లో... 'ప్రొఫెసర్ రాజు, అతడి భార్య నిశా, విద్యార్థినులు నా చావుకు కారణం. వాళ్లు నాపై కాలేజీలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాకు ప్రొఫెసర్‌తో సంబంధం ఉందని అందరికీ చెబుతున్నారు. వారి వేధింపులు, తప్పుడు ప్రచారాల వల్లే నేను చనిపోతున్నా' అని రాసుకొచ్చింది. హోలల్‌కెరె టౌన్, బసవ లేఅవుట్‌లో ఉన్న ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లిఖిత శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలంలో దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రొఫెసర్ రాజు, అతడి భార్య నిశా, కొంతమంది విద్యార్థినులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## లక్ష్యం దాటిన పరోక్ష పన్ను వసూళ్లు

**న్యూఢిల్లీ :** దేశంలో పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని దాటాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల వసూళ్లు లక్ష్యంగా పెట్టుకోగా... వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయని ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52లక్షల కోట్లు దాటినట్లు పేర్కొన్నాయి. వాస్తవంగా ఎంత మొత్తం వచ్చిందనే వివరాలు వెల్లడించకుండానే... ఏ పన్ను రూపంలో ఎంత శాతం పన్ను వసూలైందనే వివరాలను అధికారులు వెల్లడించారు. కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం వసూలైందని, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సిజిఎస్టీ 100.8 శాతం వసూలైందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు తెలిపాయి. మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యం చేరుకున్నప్పటికీ... పాన్ మసాలాపై విధించిన ఆరోగ్య, జాతీయ భద్రత సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా... కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు...

# 'వివక్షాపూరిత' సిఎపిఎఫ్ చట్టాన్ని రద్దు చేస్తుంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ హామీ
పారామిలిటరీ దళాల పక్షాన కాంగ్రెస్ నిలబడుతుందని, వారిని కాపాడుతుందని భరోసా



**న్యూఢిల్లీ :** కేంద్ర సాయుధ బలగాల (సిఎపిఎఫ్) జవాన్లపై వివక్ష అనే అన్యాయాన్ని ఒక బిల్లు ద్వారా చట్టబద్ధంగా కొనసాగించాలని ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు అలాంటి వివక్షాపూరిత చట్టాన్ని రద్దు చేస్తుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ తాను బిల్లుపై లోక్‌సభలో మాట్లాడాలని అనుకుంటున్నానని, అసోం పర్యటనలో ఉన్నందున సర్దుబాటు చేయాలని తాను ప్రభుత్వాన్ని కోరానని, అయితే పార్లమెంట్‌లో తాను మాట్లాడటం ప్రభుత్వానికి ఇష్టంలేనందున తన అభ్యర్థనను తిరస్కరించిందని చెప్పారు. అయితే తాను అన్ని పారామిలిటరీ దళాలకు... సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్, సిఐఎస్‌ఎఫ్, ఐటిబిపిలకు చెప్పదలచుకున్నదేమిటంటే కాంగ్రెస్‌వారి పక్షాన నిలబడుతుందని, వారిని కాపాడుతుందని గురువారం ఇక్కడ ఒక వీడియో స్టేట్‌మెంట్‌లో తెలియజేశారు. ప్రతిపక్షాలు వాకౌట్ చేసిన నేపథ్యంలో రాజ్యసభ వాయిస్ ఓటుతో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) బిల్లు 2026ను ఆమోదించిన ఒక రోజు అనంతరం రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.
ఈ బిల్లు గురువారం లోక్‌సభలో చర్చకు వచ్చేలా జాబితా చేయబడిన నేపథ్యంలో రాహుల్‌గాంధీ విడుదల చేసిన వీడియో ప్రకటనలో నక్సలైట్ ఎన్‌కౌంటర్‌లో ఐఇడి దాడిలో ఒక కాలు కోల్పోయిన అసిస్టెంట్ కమాండర్ అజయ్ మాలిక్‌ను తాను ఇటీవల కలిసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు.
దేశ రక్షణ కోసం అజయ్ మాలిక్ తన సర్వస్వాన్ని పణంగా పెట్టారని, ఈ త్యాగానికి ప్రతిఫలంగా ఆయనకు ఏమి లభించిందని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. 15ఏళ్లుగా విధేయతతో సేవచేసినప్పటికీ అజయ్‌మాలిక్‌కు లేదని, కనీసం తన సొంత దళానికి కూడా నాయకత్వం వహించే హక్కు కూడా లేకపోవడానికి వెనక ఉన్న కారణం ఉన్నత పదవులన్నీ ఐపిఎస్ అధికారులకే కేటాయించడమేనని, ఇది ఒక అధికారి బాధ మాత్రమే కాదని, లక్షలాది మంది సిఎపిఎఫ్ సిబ్బందికి జరుగుతోన్న వ్యవస్థాగత అన్యాయమని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. తాను 20ఏళ్లుగా పారామిలిటరీ దళాలలో కలిసి పనిచేశానని, వారు తన భద్రతను చూసుకుంటారని, వారికి నిర్దిష్ట నైపుణ్యాలు ఉన్నాయని, ఆ నైపుణ్యాలు ఉన్న వ్యక్తికే నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని రాహుల్ గాంధీ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.
ఈ విషయంలో ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును అధిగమించిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసింది ఏ మాత్రం సహేతుకం కాదని అన్నారు. ఈ బిల్లు కేవలం ఒకరి కేరీర్‌ను అడ్డుకునే ప్రయత్నం మాత్రమే కాదని, దేశానికి ప్రథమ శ్రేణి రక్షణగా నిలిచేవారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసే కుటిల యత్నమని గాంధీ ఆరోపించారు.సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) బిల్లు 2026 ప్రకారం ఇండియన్ పోలీస్ సర్వీస్ (సిఏపిఎఫ్) నుండి అదాఇకారులను నియమించడానికి 50శాతం పోస్టులను ఇన్‌స్పెక్టర్ జనరల్ హోదాలో డిప్యుటేషన్ ద్వారా, కనీసం 67శబూతం పోస్టులను అదనపు డైరెక్టర్ జనరల్ హోదాలో భర్తీ చేయాలి.

## 'జననాయగన్' విడుదలపై కుట్ర

టివికె పార్టీ అధినేత విజయ్



**తిరుచ్చి:** కోలీవుడ్ నటుడు విజయ్ నటించిన సరికొత్త చిత్రం 'జన నాయగన్' విడుదల విషయంలో కొంతకాలంగా సందిగ్ధత నెలకొన్నది. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ సినిమా విడుదలను ఉద్దేశించి విజయ్ కీలక ఆరోపణలు చేశారు. తన చిత్రం విడుదల విషయంలో కుట్ర జరుగుతుందన్నారు. తనకు న్యాయం కావాలని డిమాండ్ చేశారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గంలో గురువారం విజయ్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడారు. 'కరూర్ ఘటన ఒక ఉమ్మడి కుట్ర అని చాలామంది చెబుతున్నారు. మీకు న్యాయం జరగాలని నేను ఎలా అయితే కోరుతున్నానో... నాకు కూడా న్యాయం కావాలని కోరుతున్నా' అని విజయ్ అన్నారు. తన సినిమా 'జననాయగన్' విడుదల విషయంలో కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఎల్పీజీ సిలిండర్ల కొరతపై స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. 'తన కుటుంబానికి ఏదైనా సమస్య వస్తే ముఖ్యమంత్రి స్టాలిన్ వెంటనే ఢిల్లీ విమానం ఎక్కేస్తారు. ఎల్పీజీ సిలిండర్ల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన దేశ రాజధానికి వెళ్లరా' అని ప్రశ్నించారు. నటుడిగా ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న విజయ్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని స్థాపించి... తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన బరిలోకి దిగారు.

## రూ.167 కోట్లు పలికిన రవివర్మ పెయింటింగ్

**ముంబై :** ప్రఖ్యాత చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన బొమ్మ భారీ ధర పలికింది. యశోద, కృష్ణుడు ఉన్న ఫొటో సుమారు రూ.167 కోట్లకు అమ్ముడుపోయింది. భారతీయ ఆర్ట్‌వర్క్ ఆ ధరకు అమ్ముడుపోవడం ఇదే మొదటిసారి. వేలంలో కొత్త వరల్డ్ రికార్డు స్థాపించినట్లు చెబుతున్నారు. రవివర్మ గీసిన ఆయిల్ పెయింటింగ్‌ను సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా స్థాపకుడు డాక్టర్ సైరస్ ఎస్ పూనావాలా సొంతం చేసుకున్నారు. ఈనెల ఒకటో తేదీన జరిగిన ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్‌లో ఆ బొమ్మ అమ్ముడుపోయింది. 1890 దశకంలో రవివర్మ ఆ పెయింటింగ్ వేసినట్లు భావిస్తున్నారు. రవివర్మ ఆ సమయంలో తన కెరీర్‌లో అగ్రస్థానంలో ఉన్నారు. తల్లి యశోదమ్మతో కన్నయ్య ఉన్న ఆ ఫొటో ఆర్ట్స్ లవర్స్‌ను విశేషంగా ఆకర్షిస్తోంది. రవివర్మ వేసిన యశోద, కృష్ణుల ఫొటోను సొంతం చేసుకోవడం అద్భుతంగా భావిస్తున్నట్లు డాక్టర్ పూనావాలా తెలిపారు. ఇది జాతీయ సంపద అన్నారు. గతంలో భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుస్సేన్ వేసిన గ్రామ్ యాత్ర పెయింటింగ్ రూ.118 కోట్లకు వేలంలో అమ్ముడుపోయింది.



## దేశంలో ఇంధనం లేదా గ్యాస్‌కు ఎలాంటి కొరతలేదు

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టీకరణ



**తిరువనంతపురం :** దేశంలో ఇంధనం లేదా గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. కొనసాగుతోన్న పశ్చిమాసియా సంఘర్షణ ఫలితంగా తలెత్తే ఎలాంటి ఇంధన సంక్షోభాన్ని అయినా ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. గురువారం ఆయన ఎన్నికలు జరగనున్న కేరళలో సైనిక్ సమ్మేళనంలో మాట్లాడుతూ సముద్ర రవాణాకు కీలకమైన మార్గమైన చోక్ పాయింట్, ఇరాన్ భూభాగమైన హోర్ముజ్ జల సంధి గుండా భారత నావికాదళ నౌకలు దేశ ట్యాంకర్లకు సురక్షితంగా రక్షణ కల్పిస్తున్నాయని వెల్లడించారు. పశ్చిమాసియా ప్రాంతంలో భారత ప్రయోజనాలను కాపాడటానికి నరేంద్రమోదీ తన దౌత్య నైపుణ్యాలను ఉపయోగిస్తున్నారని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ప్రభుత్వం పశ్చిమాసియాలోని పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నదని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నదని రక్షణ శాఖ మంత్రి చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలో నివసిస్తున్న భారతదేశ పౌరులకు సహాయం చేయడానికి భారతదేశం ఏదైనా చేస్తుందని నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా ఆయన సరిహద్దు ఉగ్రవాద సమస్యను ప్రస్తావించారు. పొరుగుదేశం నుంచి ఏదైనా దుస్సాహసం జరిగితే భారతదేశ ప్రతిస్పందన 'అపూర్వమైనది', 'నిర్ణయాత్మకమైనది'గా ఉంటుందని సింగ్ హెచ్చరించారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సున్నా సహనం (జీరో టోలరెన్స్) పాటిస్తున్నామని ఆయన చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో జాతీయత బలోపేతమైందని, ప్రభుత్వ వైఖరి విధానం మారిందని వివరించారు. 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఇది స్పష్టమవుతోందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వాల హయాంలో దేశంలో ఉగ్రదాడులు విచ్చలవిడిగా జరిగాయని, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. అయితే ఎన్‌డిఏ ప్రభుత్వం ఉగ్రవాదం దాడులను అరికట్టి ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు తీసుకుందని తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ తన ప్రసంగంలో సముద్ర రంగానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. సముద్రరంగం ఇకపై మార్గాలు, నౌకదళ బలానికి మాత్రమే పరిమితం కాదని, జాతీయ స్థితిస్థాపకత, ఆర్థికవృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిలో కూడా దీనికి పాత్ర ఉందని ఉద్ఘాటించారు.2047నాటికి భారత నౌకాదళానికి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనదిగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రక్షణ మంత్రి చెప్పారు.రక్షణ విషయాల్లో భారతదేశం వేగంగా స్వయం సమృద్ధిని సాధిస్తోందని వివరించారు. గతంలో రక్షణ దిగుమతులపై ఆధారపడిన భారతదేశం ఈ రంగంలో ముందుకు సాగుతోందన్నారు. 2014లో భారతదేశ రక్షణ ఎగుమతులు రూ.600 కోట్లు ఉండగా, ప్రస్తుతం అవి రూ.38,500 కోట్లకు పెరిగాయన్నారు. 2024తో పోలిస్తే 202526లో భారతదేశ రక్షణ ఎగుమతుల్లో 62.66 శాతం పెరుగుదల నమోదైందని ఆయన చెప్పారు. రక్షణ ఉత్పత్తుల్లో ప్రభుత్వం ఇప్పటికే రూ.1.5లక్షల కోట్ల మార్కును దాటిందన్నారు. 2029 నాటికి దానిని రూ. 3లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఆ లక్ష్యాన్ని తప్పకుండా సాధిస్తామని తాను హామీ ఇస్తున్నానని ఆయన తెలియజేశారు. కేరళం రాష్ట్రంలో మార్పులు తీసుకురావడానికి బిజెపియే సరైన రాజకీయ పార్టీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వం 24క్యారెట్ల బంగారం లాంటిదని రాజ్‌నాథ్‌సింగ్ కితాబు ఇచ్చారు. 140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఎన్నికలు జరుగనున్నాయి.

# ఆర్థిక ఆధిపత్యం కోసమే యుద్ధం

ఆర్థిక వనరులను వశపర్చుకునే యత్నంలో అమెరికా
ప్రొ.బుడ్డిగ జమీందార్




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్థిక ఆధిపత్యం కోసమే అమెరికా ఇరాన్‌తో యుద్ధం చేస్తుందని ప్రొ॥ బుడ్డిగ జమీందార్ తెలిపారు. ప్రపంచంలోని ఆర్థిక వనరులను వశపర్చుకునేందుకు అమెరికా ఇటువంటి ఘాతుకాలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జెడ్పి మీటింగ్ హాల్‌లో అమెరికా ఇరాన్ యుద్ధంపై సెమినార్ నిర్వహించారు. ఆవుల అశోక్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో బుడ్డిగ జమీందార్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద లక్షణాలలో ప్రధానమైంది ఆర్థికంగా బలపడటం రెండవది మిలటరీలు బలపర్చుకోవడం, మూడవది ఆధిపత్య వ్యాపారమని అందులో భాగంగానే అపారమైన ఆయిల్ సంపద కలిగిన ఇరాన్‌పై అమెరికా దాడికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రపంచ దేశాల్లో మిలటరీపై ఖర్చు చేస్తున్న మొత్తంలో 40 శాతం ఒక అమెరికానే ఖర్చు చేస్తుందని 80 దేశాల్లో 800 చోట్ల తన స్థావరాలను ఏర్పాటు చేసుకుందన్నారు. వివిధ రకాల బెదిరింపులతో ప్రధానమైన దేశాలని తన చెప్పు చేతల్లో ఉంచుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తొలుత ఇరాన్‌లో విపక్షానికి సాయం అందించి అశాంతిని లేపేందుకు ప్రయత్నించిందని అది సాధ్యం కాకపోవడంతో ఇజ్రాయిల్ సహాయంతో నేరుగా యుద్ధానికి దిగిందన్నారు. ఇజ్రాయిల్ అమెరికాకు 51వ రాష్ట్రంగా పని చేస్తుందని జమీందార్ ఆరోపించారు. ఇరాన్ ద్వారా చైనా సహా పలు అభివృద్ధి చెందిన దేశాలు ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నాయని దీనిని గమనించిన అమెరికా ఇరాన్‌ను ఆక్రమించడం ద్వారా ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న దేశాలను నియంత్రించవచ్చునన్న ఆలోచనతోనే యుద్ధానికి దిగిందని కాకపోతే ఇరాన్ బలాన్ని చాలా తక్కువగా అంచనా వేసిందన్నారు. రోజు రోజుకు ప్రపంచ దేశాలలో అమెరికా పట్ల వ్యతిరేకత పెరుగుతుందని ఒక అమెరికాలోనే లక్షలాది మంది యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు చేశారని యుద్ధం ఎవరి కోసమంటూ అమెరికా ప్రజలు ప్రశ్నిస్తున్నారని జమీందార్ తెలిపారు. చైనా బలపడుతుండటం పోటీ దేశంగా ఎదుగుతుండటం అమెరికాకు నచ్చడం లేదన్నారు. ఇరాన్ ఆయిల్ సంపదను వశపర్చుకోవడం ద్వారా ప్రపంచ దేశాలను శాసించవచ్చునన్న ఆలోచన ట్రంప్‌కు కలగడం వల్లే ఇరాన్, అమెరికాల మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. ఇరాన్ పశ్చిమాసియాలోని కొన్ని దేశాల మీద యుద్ధం చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారని కానీ పశ్చిమాసియా దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపైన మాత్రమే ఇరాన్ యుద్ధం చేస్తుందని జమీందార్ తెలిపారు. యుద్ధాల వల్ల సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని ఆయన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాన్ని అలీన దేశంగా పేరొందిన భారత్ ఖండించకపోవడం దారుణమన్నారు. మోడీ ట్రంప్‌కు సాగిల పడుతున్నారని ఆయన తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని జమీందార్ తెలిపారు.ఈ సెమినార్‌లో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, టిపిటిఎఫ్ మాజీ కార్యదర్శి వి. మనోహర్‌రాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామయ్య, సివై పుల్లయ్య, బందెల వెంకయ్య, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా స్టాక్స్ కుదేలు

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన టారిఫ్ వార్‌ను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. ఫార్మా దిగుమతులపై నూరు శాతం సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో దేశీయ ఫార్మా కంపెనీ స్టాక్స్ కుదేలయ్యాయి. గతేడాది కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదన తీసుకొచ్చారు అప్పట్లోనూ ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఇతర దేశాల నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులపై నూరుశాతం సుంకం విధించేందుకు వైట్ హౌస్ సిద్ధమవుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. అమెరికాలో తయారీ కోసం ఏ కంపెనీలైతే ఒప్పందానికి ముందుకురాలేదో... వాటిపై సుంకాలు విధించబోతున్నట్లు వైట్‌హౌస్ తెలిపింది. అమెరికాలో తయారీకి ముందుకొస్తే సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ట్రంప్ గతంలోనే ప్రకటించారు. అయితే, సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోకి రాకుండా సెక్షన్ 232 కింద సుంకాలు వేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు సమాచారం.

## నిర్మలా సీతారామన్‌పై పరువునష్టం కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ :** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఉపయోగించిన ఓ ఇంగ్లిష్ పదం ఇప్పుడు వైరల్ అవుతోంది. అదే 29 అక్షరాల ఫ్లాక్సినాసినిహిలపిలిఫికేషన్. ఈ పదాన్ని చూసి ఆశ్చర్యపోయిన నెటిజన్లు... దాని అర్థం కోసం నెట్టింట అన్వేషణ చేపట్టారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సోమనాథ్ భారతి భార్య లిపికా మిశ్రా గతంలో పరువు నష్టం దావా వేశారు. 2024 ఎన్నికల సమయంలో ఓ మీడియా సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. తమ వైవాహిక విభేదాలను ప్రస్తావిస్తూ పరువుకు భంగం కలిగేలా మాట్లాడారని దావాలో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ 'ఫ్లాక్సినాసినిహిలపిలిఫికేషన్' అనే పదాన్ని ప్రయోగించారు. లిపికా మిశ్రా ఆరోపణల్లో నిజం లేదని, ఈ పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

### కుమారుడి ఆరోగ్యం కోసం కుమార్తె బలి

# ప్రియుడు, మంత్రగత్తెతో కలిసి కూతురుని చంపిన తల్లి

**రాంచీ :** జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో ఒక తల్లి కుమారుడి ఆరోగ్యం కోసం కన్న కుమార్తెను నరబలి ఇచ్చింది. ప్రియుడు, మంత్రగత్తెతో కలిసి కూతుర్ని చంపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్చి 24న కుసుంభ గ్రామానికి చెందిన బాలిక (12) అదృశ్యమైంది. మరునాడు స్థానిక స్కూల్ వెనుక ఉన్న వెదురు తోటలో ఆమె మృతదేహం లభించింది. కాగా, శ్రీరామనవమి ఊరేగింపు తర్వాత తన కుమార్తె కనిపించలేదని బాలిక తల్లి రేష్మి దేవి (35) పోలీసులకు చెప్పింది. ధనేశ్వర్ పాశ్వాన్, అతడి స్నేహితులు తన కూతురిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు తొలుత వారిపై పోక్సో చట్టంతో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు 26వ తేదీన జార్ఖండ్ డీజీపీ, హజారీబాగ్ ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు పరిశీలించిన పోలీసులు, మూఢనమ్మకం కారణంగా తల్లి తన కుమార్తెను నరబలి ఇచ్చినట్లు దర్యాప్తులో తెలుసుకుని షాక్ అయ్యారు. కాగా, ఆ గ్రామానికి చెందిన శాంతి దేవి (55), క్షుద్రపూజలు చేసే మంత్రగత్తెగా పేరుపొందింది. మానసిక, శారీరక అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడి బాగు కోసం ఆ తాంత్రికురాలిని మూడు నెలలుగా రేష్మి దేవి సంప్రదిస్తోంది. దుర్గాష్టమి రోజున కన్యను నరబలి ఇస్తే ఆమె కుమారుడి అనారోగ్యం నయమవుతుందని శాంతి దేవి నమ్మించింది. నరబలి కోసం సొంత కుమార్తెను తీసుకురావాలని రేష్మి దేవిని ఆమె ప్రేరేపించింది. 24న రాత్రివేళ రేష్మి దేవి తన ప్రియుడైన భీమ్ రామ్ (40)తో కలిసి పూజ నెపంతో కుమార్తె (12)ను తాంత్రికురాలి ఇంటికి తీసుకువెళ్లింది. క్షుద్రపూజల తర్వాత ఆ బాలికను సమీపంలోని వెదురు తోటలోకి తీసుకెళ్లారు. కుమార్తె కాళ్లను తల్లి పట్టుకోగా, భీమ్ రామ్ ఆమె గొంతు నొక్కి చంపాడు. ఆచారం కోసం కన్య రక్తం కావాలన్న మంత్రగత్తె శాంతి దేవి, ఆ బాలిక మర్మాంగంలో కర్రను చొప్పించింది. దీంతో భీమ్ రామ్ ఆ బాలిక తలపై రాయితో కొట్టాడు.
ఈ విషయాన్ని దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. కుమారుడి అనారోగ్యం నయమవుతుందన్న మూఢనమ్మకం వల్ల కుమార్తెను నరబలి ఇచ్చిన తల్లి రేష్మి దేవి, ఆమె ప్రియుడు భీమ్ రామ్, తాంత్రికురాలు శాంతి దేవిని అరెస్ట్ చేశారు. నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. వదిన, మరో వ్యక్తిని హత్య చేసిన ఆరోపణలు కూడా భీమ్ రామ్‌పై ఉన్నాయని చెప్పారు. రేష్మి దేవి భర్త మహారాష్ట్రలో పనిచేస్తాడని, ఇంటికి వచ్చేవాడు కాదని పోలీస్ అధికారి వెల్లడించారు.

# మహిళా కోటా కోసం ప్రత్యేక సమావేశం

రాజుకు కోపమొచ్చినా కష్టమే, సంతోషమొచ్చినా కష్టమే అంటారు. అలావుంది మన 'అభినవ చక్రవర్తి' ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యవహారం. లోక్‌సభ, అసెంబ్లీల్లో 33 శాతం సీట్లు రిజర్వేషన్ కోసం మహిళాలోకం కలను నిజం చేయటానికి ఆయన ఇప్పుడు ఆతృతపడుతున్నారు. 2023లో పార్లమెంటు 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ బిల్లు అని అర్థం) ఆమోదించిన సందర్భంలో, 2024లోక్‌సభ ఎన్నికలనుంచే మహిళలకు రిజర్వేషన్ అమలు చేయాలని కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పుడు, కుదరదంటూ రాజ్యాంగ అవరోధాలను ముందుకు తెచ్చారు. వాజ్‌పేయి ప్రభుత్వం ఆమోదించిన రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 వరకు నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం లేదని, తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై ఆ తదుపరి డీ లిమిటేషన్ చేపట్టాల్సి ఉంటుందని అప్పుడు ప్రభుత్వం ఆ డిమాండ్‌ను త్రోసిపుచ్చింది. 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) కోవిడ్ మహమ్మారి కారణంగా వాయిదాపడింది. కోవిడ్ పూర్తిగా అంతరించి మూడేళ్లు గడిచినా సెన్సెస్‌ను ప్రభుత్వం దాటవేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఈ సంవత్సరం (2026)లో చేపడుతున్నది. తొలిసారి డిజిటల్‌గా నమోదు చేస్తున్న వివరాలు క్రోడీకరించి గెజిట్ ప్రకటన చేయటానికి సమయం తక్కువే పట్టినా కనీసం సంవత్సరకాలం అవసరం. ఆ తదుపరి నియోజకవర్గాల పునర్విభజనకు కనీసం మరో సంవత్సరంపైగా పడుతుంది. అందువల్ల 2029 సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు పరిచే అవకాశం రావచ్చు, రాకపోవచ్చు. ఈలోపు 'ఒకదేశం – ఒకేసారి ఎన్నికల' కోసం రాజ్యాంగ సవరణ జరిగి దాని అమలు క్రమం ప్రారంభం కావచ్చు. అది పూర్తిగా అమలులోకి రావటానికి 1934 వరకు సమయం అవసరం కావచ్చు. ఆ బిల్లు ప్రస్తుతం జాయింట్ సెలెక్టు కమిటీ పరిశీలనలో ఉంది.

ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఉన్న సీట్లలో మూడవవంతు మహిళలకు రిజర్వు చేసి చట్టాన్ని అమలు చేయటం ఉద్దేశ్యమైతే – లాటరీ పద్ధతిలో నియోజకవర్గాలను నిర్ణయించి 2024 నుంచే అమలు చేసి ఉండేవారు. ఉన్న సీట్లలో మహిళా కోటా నిర్ణయిస్తే పురుష ఆధిపత్య రాజకీయ వ్యవస్థ తిరుగుబాటు చేయదూ! కాబట్టి సీట్లు పెంచి కోటా అమలు చేయాలన్న ముందుచూపు మోదీ ప్రభుత్వానికి, పాలక పార్టీకి ఆ బిల్లు తెచ్చిన నాటినుంచే ఉండి ఉంటుంది. సీటింగ్ పెంచుతూ పార్లమెంటు కొత్త భవనం నిర్మాణం అందులో భాగమే. ఈ సాంకేతిక, వ్యూహాత్మక ఊహాగానాలను అలా ప్రక్కన పెడితే 2024 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలుకు నిరాకరించిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఆకస్మికంగా ఆ అంశాన్ని ఎజండాలోకి ఎందుకు తెచ్చినట్లు? నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ పోలింగ్ (ఏప్రిల్ 23, 29) మిగిలిఉండగానే – మహిళా రిజర్వేషన్‌ను ముందుకు తెచ్చి అమలు జరిపేందుకు రాజ్యాంగ, చట్ట సవరణ బిల్లుల ఆమోదానికై వచ్చే 2–3 వారాల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని పిలవటంలో స్వప్రయోజనమేమిటి? పశ్చిమ బెంగాల్, తమిళనాడులో అధికారం చేజిక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బిజెపి, తాజా చట్ట సవరణలతో మహిళా ఉద్ధారకురాలిగా ప్రజల ముందుకు దూసుకెళ్లి మహిళల ఓట్లను అత్యధికంగా తమ (బిజెపి+ఎన్‌డిఎ) వైపు రాబట్టుకుని పాలక పక్షాలను ఓడించే రాజకీయ ఉద్దేశంతోనే పార్లమెంటు ప్రత్యేక సమావేశం అని ప్రతిపక్షాలు భావించటాన్ని, విమర్శించటాన్ని తప్పు పట్టలేము.

మహిళా కోటా అమలుకు ఏమిటి ప్రభుత్వ పథకం? ప్రచారంలో ఉన్న దాని ప్రకారం 543 లోక్‌సభ సీట్లలో రాష్ట్రాలవారీ సీట్లను 50 శాతం (273) పెంచుతారు. దాంతో మొత్తం సీట్ల సంఖ్య 816కు పెరుగుతుంది. అందులో 33శాతం (273) మహిళలకు రిజర్వు చేస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపడతారు. ఇది సింపుల్‌గా కనిపించినా, లోతైన సమస్య ఉంది. జనాభా నియంత్రణను పాటించి జాతీయ లక్ష్యాలను పరిపూర్తి చేసిన దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ సీట్లు 66 (129 నుంచి 195)పెరిగితే జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాల సీట్లు 200 పెరుగుతాయి. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోతాయని, ఐదారు పెద్ద ఉత్తరాది రాష్ట్రాలు కలిసి ప్రభుత్వాన్ని నిర్ణయిస్తాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా ఈ అంశం లేవనెత్తారు. ఇదిలావుండగా గత పక్షం రోజుల్లో అమిత్ షా తదితర కొందరు మంత్రులు మహిళా రిజర్వేషన్ అమలు ఆలోచనపై కొన్ని ప్రతిపక్ష పార్టీలతో చర్చించటంతో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గెకు ప్రభుత్వ పక్షాన రాసిన లేఖకు జవాబుగా ఆయన మహిళా రిజర్వేషన్‌కు ఆదినుంచీ ప్రయత్నించింది కాంగ్రెస్ అని పునరుద్ఘాటిస్తూ, దీని అమలులో ఉన్న సమస్యలు చర్చించి ఏకాభిప్రాయంతో ముందుకు సాగేందుకు అఖిలపక్ష సమావేశం పిలవాలని సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున పోలింగ్ ముగిశాక ఆ సమావేశం పిలవాలని కోరారు. అయితే ప్రభుత్వం స్పందించకుండా ఏకపక్ష ధోరణి ప్రదర్శించింది.

అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉన్నప్పుడు, ఖ్యాతినంతా తమ ఖాతాలో వేసుకోవాలన్న దురాలోచన తప్పితే, ఎందుకీ ఏకపక్ష ఆధిపత్య ధోరణి. ప్రధాని నరేంద్రమోదీ నిత్యం ఎన్నికలు – అధికారాన్ని శ్వాసిస్తూ ఉంటారని అంటారు. దాన్ని తాజా నిర్ణయం ధృవీకరిస్తున్నది. అయితే ప్రజలు అమాయకులనుకుంటే భ్రమ. 1996 లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో సిపిఐ సభ్యురాలు గీతా ముఖర్జీ పార్లమెంటరీ కమిటీ సిఫారసులు మొదలు యుపిఎ ప్రభుత్వంలో సోనియాగాంధి రాజ్యసభలో మహిళా బిల్లును ఆమోదింపజేయటం, గతంలో బిజెపి అనుసరించిన వ్యతిరేక వైఖరులు – అన్నీ దేశ ప్రజలకు తెలుసు. ఇప్పుడు సమస్యల్లా ఉత్తరాది, దక్షిణాది మధ్య పార్లమెంటు ప్రాతినిధ్యంలో పెరుగుతున్న వ్యత్యాసాన్ని తగ్గించటం, కనీసం ఇప్పుడున్న దామాషాను కొనసాగించటం ఎలా అన్నదే. జనాభా దామాషాతో కేంద్ర నిధుల్లో వాటా తగ్గిన దక్షిణాది రాష్ట్రాలు, రాజకీయంగాకుండా తగు ప్రాధాన్యత కోల్పోతే సమైక్యత భావనను సన్నగిల్ల జేస్తుంది. ప్రతిపక్షాలతో చర్చించి మార్గాన్వేషణ చేయటం ప్రభుత్వ బాధ్యత. ●



## వామపక్ష ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తుంది

ఆకలి సమస్య లేని ఏకైక రాష్ట్రం కేరళ. భారతదేశంలో ఆకలి సమస్య లేని ఏకైక రాష్ట్రం కేరళ మాత్రమే. అంతర్జాతీయ పేదరిక సూచికలో భారతదేశం ఇప్పటికీ ఒక అవమానకరమైన స్థానంలో కొనసాగుతోంది. గత పదేళ్లకాలంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కేరళను తీవ్ర పేదరికం నుండి విముక్తం చేసింది. ఈ గర్వించదగ్గ విజయం. యావత్ దేశానికి ఆదర్శం. అత్యల్ప శిశు మరణాల రేటు కలిగిన రాష్ట్రం కేరళనే. విద్య, ఆరోగ్య రంగాలలో కూడా ఈ రాష్ట్రం దేశానికి ఒక ఆదర్శంగా నిలుస్తోంది. తోటల కార్మికుల వేతనాలను రూ.48 మేర పెంచారు. పెన్షన్లను కూడా పెంచారు. కార్మికులందరినీ ఏకతాటిపై నడిపించింది వామపక్ష ప్రభుత్వమే. వామపక్ష ప్రభుత్వం కార్మికులకు అండగా నిలుస్తుందని చెప్పడానికి మరే ఇతర విశేషణాలూ అవసరం లేదని, ఈ విషయాలన్నీ ప్రజలకు ఇప్పటికే తెలుసు.

– కేరళ ఎన్నికల ప్రచారంలో డి.రాజా



## ఛత్రపతి శివాజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

భారతమాత ముద్దు బిడ్డ, పశ్చిమ భారతదేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు ఛత్రపతి శివాజీ. గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయన పేరు ఉంటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్నతనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని,వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూమతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

క్రీస్తు శకం 1630లో ఫిబ్రవరి 19వ తేదీన మహారాష్ట్ర పూణే జిల్లాలో ఉన్న జనార్‌లోని శివనీర్ కోటలో జిజియాబాయ్, షహాజీ దంపతులకు శివాజీ జన్మించారు. ఆయన తల్లి క్షత్రియ వంశీయురాలు. శివాజీ పుట్టకముందే పుట్టిన వారంతా చనిపోవడంతో, ఆమె శివపార్వతులను పూజించగా శివాజీ క్షేమంగా ఉన్నాడు. దీంతో ఆయనకు శివాజీ అనే పేరు పెట్టారు. శివాజీ మహారాజ్ కన్న తల్లి దగ్గరే పరమత సహనం, మహిళల పట్ల గౌరవంగా ఉండటం నేర్చుకున్నాడు. అతి చిన్న వయసులోనే తను పుట్టిన భూమికి మేలు చేయాలని, ప్రజలతో ఎలా నడుచుకోవాలో శివాజీకి జిజియబాయి పూస గుచ్చినట్టు వివరించారు. మరోవైపు తన తండ్రి పూణేలో జాగీరుగా ఉండేవారు. తన తండ్రి దగ్గర నుంచి యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు. రాజనీతి మెళకువలు నేర్చుకుంటూ.. తన తండ్రి ఓటముల గురించి అధ్యయనం చేసేవాడు. అప్పుడే సరికొత్త యుద్ధ తంత్రాలను నేర్చుకున్నాడు.

శివాజీ 17వ ఏటలోనే కత్తి పట్టాడు. అంతేకాదు వెయ్యి మంది సైన్యంతో వెళ్లి బీజాపూర్‌కు చెందిన తోర్నా కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత మూడేళ్లలోపే రాజ్‌ఘడ కొండన ప్రాంతాలను ఛేజిక్కించుకుని పూణే ప్రాంతాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ''ఓటమి తప్పదు అనిపిస్తే యుద్ధం నుంచి తప్పుకోవాలి.. అనుకూల సమయాన్ని చూసి దాడి చేసి గెలవాలి'' ఈ సూత్రాన్ని శివాజీ ఎక్కువగా నమ్మేవారట. ఇదే శివాజీ పాటించే యుద్ధ తంత్రం. దీన్నే గెరిల్లా యుద్ధం అంటారు.

శివాజీ మహారాజు ముస్లిముల దురాక్రమణను వ్యతిరేకించినప్పటికీ,తన రాజ్యం లో లౌకికవాదాన్ని పాటించారు. అన్ని మతాల వారినీ సమానంగా ఆదరించారు. ఇతర మతాల వారిని కూడా గౌరవించారు. 1674న రాయఘ్‌ఢ కోటలో వేద పఠనాల మధ్య శివాజీని క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ 'ఛత్రపతి ' అని బిరుదును ప్రదానం చేసారు. కొన్నాళ్ళకు 50,000 బలగంతో దక్షిణ రాష్ట్రాల దండయాత్రచేసి వెల్లూరు, గింగీలను సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్ళపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మూడు వారాలు తీవ్ర జ్వరంతో బాధపడి ఏప్రిల్ 3,1680 న రాయఘ్‌ఢ కోటలో మరణించాడు. శివాజీ పెద్దకొడుకయిన శంభాజీ తర్వాత రాజ్యాన్ని చేపట్టి మొఘలులను సమర్థవంతంగా ఎదుర్కొని పరిపాలించాడు.

**(ఏప్రిల్ 3 ఛత్రపతి శివాజీ వర్ధంతి)**

సుధాకర్ ఎవి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# అస్సోం ప్రభుత్వ మార్పును కోరుకుంటున్న పౌర సమాజం

రవీంద్ర నాథ్ సిన్హా

ఏప్రిల్ 9న జరగబోయే అస్సోం శాసనసభ ఎన్నికలలో ఒక్క ముస్లిం అభ్యర్థినీ నిలబెట్టని బిజెపి తమ బలమైన మిత్రపక్షమైన అసోం గణ పరిషత్ (ఎజిపి)ని ఒప్పించి, వారి అభ్యర్థులలో 50 శాతం మైనారిటీ వర్గానికి చెందిన వారిని బరిలోకి దించడం లో ఎన్‌డిఎకు నేతృత్వం వహిస్తున్న అస్సోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ విజయం సాధించి ఉండవచ్చు. ఆ సీట్ల లో చాలావరకు నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా ఏర్పడినవే. వాటిలో ముస్లిం జనాభా గణనీయంగా ఉంది. అంతేకాకుండా తమ అనుచరులతో పాటు పార్టీ మారిన కొందరు ప్రముఖులను కాంగ్రెస్ నుండి ఫిరాయించేలా చేయడంలో కూడా హిమంత విజయం సాధించారు.

అయితే, తన రాజకీయ పలుకుబడికి, పార్టీలోని అంతర్గత విభేదాలను అణచివేసే సామర్థ్యానికి పేరుగాంచిన ముఖ్యమంత్రి, 'అస్సాం నాగరిక్ సన్మిలాని' అనే పేరుతో పనిచేస్తున్న ఒక గౌరవప్రద పౌర సమాజ సంస్థ నుండి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఈ సంస్థ విశ్వసనీయతను పెంచుతున్న వారిలో ప్రముఖ విద్యావేత్త హిరెన్ గోహైన్, మాజీ ఐసిఎస్ అధికారి హరేకృష్ణ దేకా వంటి వారు ఉన్నారు. అంతేకాకుండా, అఖిల భారత స్థాయిలో ఆదరణ పొందిన అస్సోం సంగీత దిగ్గజం జుబిన్ గార్గ్ మరణం అంశం కూడా ఉంది. 2025 సెప్టెంబర్ 19న సింగపూర్‌లో ఆయన మరణంపై వివాదం సద్దుమణగడం లేదు. ఇది హిమంతకు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తోంది.

ఎజిపి అధ్యక్షుడు అతుల్ బోరాపై బలవంతంగా రుద్దిన సీట్ల పంపకం ఒప్పందం ప్రకారం, ఈ ప్రాంతీయ పార్టీ 26 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. రాష్ట్రంలో 126 మంది సభ్యుల శాసనసభలో 89 సీట్లను సొంతానికి కేటాయించుకున్న బిజెపి తర్వాత, ఎన్‌డిఎ కూటమిలో ఎజిపి అత్యధిక సీట్లలో పోటీ చేసే రెండవ పార్టీగా ఉంది. ఆ పార్టీ పోటీ చేస్తున్న 26 నియోజకవర్గాలలో 13 చోట్ల మైనారిటీ అభ్యర్థులను పోటీలో పెట్టేందుకు అంగీకరించేలా బోరాను బలవంతంగా ఒప్పించారు. నియోజకవర్గాల పునఃపొందిక కు దారితీసిన డీలిమిటేషన్ ఫలితాన్ని హిమంత చాకచక్యంగా ఉపయోగించుకున్నారు. ఈ 13 నియోజకవర్గాలలో దాదాపు అన్నింటిలోనూ మైనారిటీ వర్గాల జనాభా అధికంగానే ఉంది. 2021 అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఎజిపి 26 నియోజకవర్గాలలో పోటీ చేసి తొమ్మిది సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. అస్సోం రాజకీయ పరిశీలకుల ప్రకారం ఇది ఆ పార్టీ ప్రభావం క్షీణిస్తోందని చెప్పేందుకు ఒక సూచన.

ముఖ్యమంత్రి మరో లక్ష్యాన్ని కూడా గ్రహించినట్లు కనిపిస్తోం ది. ఎప్పటిలాగే బిజెపి జాబితాలో ఒక్క ముస్లిం ముఖమూ లేదు. ఈ విషయాన్ని జాతీయ ప్రతిపక్షం చాలా కాలంగా గట్టిగా ఎత్తి చూపుతోంది. బిజెపి నేరుగా కాకపోయినా, ఎన్‌డిఎ పక్షాల మధ్య సీట్ల పంపకంలో భాగంగా మైనారిటీ అభ్యర్థులకు అవకాశం కల్పించినట్లు ఆయన ఇప్పుడు చెప్పుకోగలరు. గోలాఘాట్ జిల్లాలోని తన పాత బోకాఖత్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు బోరాకు సమ్మతి లభించింది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల ప్రభావితం కాని తమ పాత సీట్ల నుంచి మరికొందరు ఎజిపి నాయకులను తిరిగి నామినేట్ చేశారు. ముఖ్యమంత్రి తన చేత బలవంతంగా అంగీకరింప చేసిన కారణంగా మామూలు పరిస్థితుల్లో టిక్కెట్లకు అర్హత కలిగిన ముఖ్యమైన ఎజిపి రాజకీయ నాయకులను కూడా పక్కన పెట్టాల్సి రావడంతో ఎజిపి అధినేత సహజంగానే పార్టీ కార్యకర్తల అసంతృప్తిని ఎదుర్కొన్నారు.

గమనించదగ్గ మరో విషయం ఏమిటంటే ఎజిపి జాబితాలో ముస్లిం ముఖాలు అధిక వాటా కలిగి ఉన్నాయి. ప్రధానంగా మతతత్వ, ముస్లిం ఆధిపత్య కూటమి అయిన ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎఐయుడిఎఫ్) టిక్కెట్లపై బరిలో నిలిచిన అభ్యర్థుల తర్వాత అది రెండవ స్థానంలో ఉంది. ఎఐయుడిఎఫ్‌కు మాజీ లోక్‌సభ సభ్యుడు, సుగంధ ద్రవ్యాల వ్యాపారవేత్త బద్రుద్దీన్ అజ్మల్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన మధ్య అస్సాంలోని కచార్ జిల్లాలో ఉన్న బిన్నకండి సీటు నుంచి ఏప్రిల్ 9న జరగనున్న పోటీలో



హిమంత బిశ్వ శర్మ
ముఖ్యమంత్రి



గౌరవ్ గొగోయ్
కాంగ్రెస్ నేత



అతుల్ బోరా
ఎజిపి నేత



బద్రుద్దీన్ అజ్మల్
ఎఐయుడిఎఫ్ నేత

అభ్యర్థిగా ఉన్నారు. 2021లో 20 స్థానాల్లో పోటీ చేసి, వాటిలో 16 స్థానాల్లో విజయం సాధించిన ఎఐయుడిఎఫ్, ఈసారి 27 స్థానాల్లో అభ్యర్థులను నిలబెడుతోంది. సహజంగానే ఆ పార్టీ అభ్యర్థులందరూ దాదాపుగా మైనారిటీ వర్గానికి చెందినవారే.

ఈ విషయంలో వైరుధ్యం గమనించకుండా ఉండలేనంత స్పష్టంగా ఉంది. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు), అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ (ఎజిఎస్‌పి) నేతృత్వంలో జరిగిన ఆరేళ్ల తీవ్రమైన అస్సాం ఉద్యమం ఫలితంగా ఏర్పడి, 1985 ఆగస్టు 15న సంతకం చేసిన సుప్రసిద్ధ అస్సాం ఒప్పందాన్ని అనుసరించి, 1985 అక్టోబర్ మధ్యలో గోలాఘాట్ సమావేశంలో లాంఛనంగా ప్రారంభించబడిన ఆ ప్రాంతీయ పార్టీ, ఇప్పటికీ అక్రమ వలసదారులను గుర్తించి, బహిష్కరించడం ద్వారా అస్సామీ ప్రజల సామాజిక–సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపును పరిరక్షించడాన్ని తన ప్రధాన అజెండాగా పెట్టుకుంది. బంగ్లాదేశీ ముస్లింలను ఉద్దేశించి ఫిబ్రవరి 12 నుండి హిమంత పదేపదే 'మియా ముస్లింలు'గా అభివర్ణిస్తున్న విషయం గురించి చెప్పనవసరం లేదు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటివరకు అస్సాంలో తాను ప్రసంగించిన ప్రతి సభలో అస్సోం నుండి 'ఘుస్‌పేటియాల(చొరబాటుదారుల)'ందరినీ తరిమికొట్టడానికి బిజెపికి మరో అవకాశం ఇవ్వాలని గట్టిగా అభ్యర్థించారు. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే ఇప్పుడు ఎజిపి తన అసలు అవతారం(స్వరూపం) నుంచి పూర్తిగా దూరమైందని స్పష్టంగా సూచిస్తున్నాయి.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రి నైపుణ్యం అందరికీ తెలిసిందే. ఇందుకు కాంగ్రెస్ కంటే మెరుగైన లక్ష్యం ఏముంటుంది? ఫిరాయించిన వారిలో లోక్‌సభ సభ్యుడు ప్రద్యోత్ బోర్దోలోయ్ (ఆయన మార్చి 25న రాజీనామా చేశారు), పిసిపి మాజీ అధ్యక్షుడు భూపేన్ బోరా పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ఇంకా చాలా మంది ఉన్నారు. ఈసారి కాంగ్రెస్‌ను బలహీనపరచాలన్న కోరిక హిమంతకు చాలా బలంగా ఉంది. ఎందుకంటే, కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణానికి సారథ్యం వహిస్తున్నది జోర్హాట్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గౌరవ్ గోగోయ్. ఆయన లోక్‌సభలో ప్రతిపక్ష ఉపనాయకుడు. ఆయన కొద్ది నెలల క్రితమే పిసిసి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు మంచి ఇమేజ్ ఉంది. 2026 అస్సోం అసెంబ్లీ ఎన్నికలు హిమంత, గౌరవ్‌ల మధ్య పోరుగా మారాయి. ఇందులో గౌరవ్ పార్టీ కార్యకర్తలను చాలా వరకు ఉత్తేజపరచగలిగారు. తన పోరాటం కేవలం ముఖ్యమంత్రితోనే కాదని, సొంత పార్టీలో సైతం ఉందని, అక్కడ సందేహాస్పద రాజకీయ నిబద్ధత కలిగిన వారు ఉన్నారని, వారు పార్టీ మారడానికి సుముఖంగా ఉన్నారని గౌరవ్ అన్నారు. 'కానీ, నేను బెదిరిపోను. బిజెపి నేతృత్వంలోని మంత్రివర్గాన్ని గద్దె దించడానికి మా కూటమి గట్టి పోరాటం చేస్తుంది' అని ఆయన అన్నారు.

కాంగ్రెస్ నేతృత్వంలోని సంకీర్ణం సవాలు విసురుతుండగా, ప్రతిపక్షాల ఐక్యత 'బిజెపి వ్యతిరేక తీర్పు'ను సాధించాలని అస్సాం నాగరిక్ సన్మిలాని ఇటీవల చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి ఆందోళనలను మరింత పెంచుతున్నాయి. బిజెపి విభజన రాజకీయాలు 'అస్సామీ గుర్తింపును లోపలి నుండి గుల్లగా మార్చాయి'. ప్రచురితమైన నివేదికల ప్రకారం బిజెపి నేతృత్వంలోని మంత్రివర్గం గత 10 సంవత్సరాలుగా కీలకమైన సహజ వనరులను బహుళజాతి సంస్థలకు అప్పగించింది. ఇప్పటివరకు బిజెపి గానీ, ముఖ్యమంత్రి గానీ దీనిపై స్పందించలేదు. మార్చి 25, బుధవారం నాటి తీర్పులో, సింగపూర్ దేశ విచారణాధికారి ఆడమ్ నఖోదా, జుబిన్ గార్గ్ 'ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించాడని, అతని మరణానికి గల కారణంపై పోలీస్ కోస్ట్ గార్డ్ నిర్ధారణలతో విభేదించడానికి తనకు ఎటువంటి కారణం కనిపించడం లేదని' పేర్కొన్నారు. దీనికి ముందు, గత సంవత్సరం సెప్టెంబర్ 19న జుబిన్ మరణానికి నీటిలో మునిగిపోవడమే కారణమని సింగపూర్ జనరల్ హాస్పిటల్ పేర్కొంది.

ఈ విషయంలో హిమంత స్వయంగా చిక్కుల్లో పడినట్లు కనిపిస్తోంది. సింగపూర్ విచారణాధికారి నివేదికను ప్రస్తావిస్తూ, అస్సోం పోలీసుల అంచనా, సిట్ దాఖలు చేసిన ఛార్జిషీట్ కూడా అలాగే ఉన్నాయని చెబుతూ ఆయన ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారు. కానీ 2025 నవంబర్‌లో జుబిన్ హత్యకు గురయ్యారని ఆయన అన్నారు. విచారణాధికారి తీర్పు ముఖ్యమంత్రి హత్య సిద్ధాంతాన్ని సవాలు చేసిందని, ఆ సంగీత దిగ్గజాన్ని 'హత్య చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఈ తీర్పు ఒక బహుమతి' అని చెబుతూ గౌరవ్ వెంటనే ఆయనపై విమర్శలు గుప్పించారు.

*(ఐపిఎ సర్వీస్)*

# ప్లాస్టిక్ నిషిద్ధం.. కానీ ఎందుకు అనుమతిస్తున్నారు?

ప్లాస్టిక్ వద్దు అంటూ ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు నడుపుతున్నా, మార్కెట్లలో ప్లాస్టిక్ సంచులు, కప్పులు, స్ట్రాలు నిండి ఉంటాయి. కర్మాగారాలకు అనుమతులు ఇచ్చి, బయట దేశాల నుంచి వస్తువులు దిగుమతి చేస్తున్నారంటే ఇది ఎలా సరైనది? ప్రజలు అనారోగ్యాలకు, పర్యావరణం దెబ్బతినడానికి, ప్రాణాలు కోల్పోవడానికి కారణం ఇదేనా? ఈ ప్రశ్నలు చాలామంది మనసుల్లో తిరుగుతున్నాయి. కానీ వాస్తవం చాలా సంక్లిష్టం. ఇది పూర్తి వైరుధ్యం కాదు; దశలవారీగా అమలు చేస్తున్న సమగ్ర వ్యూహం. దాని లోపాలు, సవాళ్లు, ప్రభావాలు ఏమిటో లోతుగా చూద్దాం.

**ప్రభుత్వ విధానం: పూర్తి నిషేధం కాదు**

2022 జూలై 1 నుంచి భారతదేశం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (SUP) నిషేధాన్ని అమలు చేసింది. ఇది ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (అమెండ్‌మెంట్) రూల్స్, 2021 ఆధారంగా వచ్చింది.

**నిషేధించిన వస్తువులు ఏవి?**

'ఇయర్ బడ్స్ (ప్లాస్టిక్ స్టిక్స్‌తో), బెలూన్ స్టిక్స్, ప్లాస్టిక్ ఫ్లాగ్స్, క్యాండీ స్టిక్స్, ఐస్‌క్రీమ్ స్టిక్స్ 'ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసెస్, కట్లరీ (ఫోర్క్, స్పూన్, నైఫ్), స్ట్రాలు, స్టిరర్స్, ట్రేస్ 'స్వీట్ బాక్స్‌లు, ఇన్విటేషన్ కార్డులు, సిగరెట్ ప్యాకెట్ల చుట్టూ ర్యాపింగ్ ఫిల్మ్‌లు 'పాలిస్టైరిన్ (థర్మోకోల్) డెకరేషన్స్, PVC బ్యానర్లు (100 మైక్రాన్ కంటే తక్కువ) '

**ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్:** 75 మైక్రాన్ కంటే తక్కువ (2021 సెప్టెంబర్ 30 నుంచి), 120 మైక్రాన్ కంటే తక్కువ (2022 డిసెంబర్ 31 నుంచి)

ముఖ్యం: ఈ వస్తువుల తయారీ, దిగుమతి, స్టాకింగ్, పంపిణీ, అమ్మకం, ఉపయోగం అన్నీ నిషేధం. కేంద్ర ప్రదూషణ నియంత్రణ బోర్డు (CPCB), రాష్ట్ర ప్రదూషణ నియంత్రణ బోర్డులు (SPCB) కర్మాగారాల అనుమతులు మార్చి లేదా రద్దు చేస్తాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూములు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు ఏర్పాటు చేశారు. ఇల్లీగల్ యూనిట్లకు జరిమానాలు, పవర్ సప్లై డిస్కనెక్ట్, క్లోజర్ ఆర్డర్లు ఇస్తారు.

తెలంగాణలో టిజిపిసిబి (Telangana State Pollution Control Board) గత మూడు సంవత్సరాల్లో 1,858 ఇండస్ట్రీలను శిక్షించింది. 2025 –26లో కూడా 290+ ఇల్లీగల్ యూనిట్లకు పవర్ కట్ చేసి, క్లోజ్ చేశారు. అనుమతి లేని తయారీకి రూ.1లక్ష జరిమానా విధిస్తారు. ఇక్కడ ప్రభుత్వమే అనుమతి ఇస్తుంది అనేది తప్పు – నిషేధిత వస్తువులకు అనుమతులు



ఇవ్వడం లేదు; ఉన్నవి రద్దు చేస్తున్నారు.

**ఎందుకు పూర్తి నిషేధం కాదు?**

ప్లాస్టిక్ ఇండస్ట్రీ భారతదేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. 2024లో మార్కెట్ సైజు USD 46.48 బిలియన్, 2029 నాటికి USD 52.72 బిలియన్ కు పెరుగుతుందని అంచనా. మిలియన్ల మందికి ఉద్యోగాలు (ప్రధానంగా MSMEలు), ప్యాకేజింగ్, నిర్మాణం, ఆటోమోటివ్, వ్యవసాయం, మెడికల్ రంగాల్లో అవసరం. సాచెట్లు, ఫ్లెక్సిబుల్ పౌచెస్ (FMCG ప్యాకేజింగ్‌లో సగం) నిషేధంలో లేవు – ఇవి మొత్తం ప్లాస్టిక్‌లో 23% మాత్రమే కవర్ అవుతాయి.

ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (EPR) ద్వారా తయారీదారులు తమ ప్యాకేజింగ్ వేస్ట్‌ను సేకరించి, రీసైకిల్ చేయాలి. కంపోస్టబుల్ ప్లాస్టిక్‌లు, 120 మైక్రాన్+ బ్యాగులు (రీయూజ్ కోసం) అనుమతించారు.

లక్ష్యం:లిట్టర్ తగ్గించడం, ఆల్టర్నేటివ్స్ (బాంబూ, ప్లాంటైన్, కలప) ప్రోత్సహించడం. ప్రధాని మోదీ 2019లో 2022 నాటికి SUP ఫేజ్ అవుట్ అని ప్రకటించారు – ఇది దశలవారీగా జరుగుతోంది.

దిగుమతి: నిషేధిత వస్తువుల దిగుమతి నిషేధం. కానీ రా మెటీరియల్ (పాలిమర్లు), అనుమతించిన ప్లాస్టిక్ వస్తువులు దిగుమతి అవుతాయి. ఇల్లీగల్ దిగుమతులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ గ్యాప్స్ వల్ల మార్కెట్లో కనిపిస్తాయి.

పర్యావరణం & ఆరోగ్యం:

ప్లాస్టిక్ కాలుష్యం నుంచి మైక్రోప్లాస్టిక్స్ గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయి.

లోపాలు:'ఎన్‌ఫోర్స్‌మెంట్ గ్యాప్ (తెలంగాణలో 1,800+ పెనాల్టీలు ఉన్నా ఉల్లంఘనలు కొనసాగుతున్నాయి

*చిన్న యూనిట్లు మూసివేతలు, ఉద్యోగ నష్టాలు.
*సాచెట్లు, పెద్ద ప్యాకేజింగ్ మినహాయింపు.
*మైక్రోప్లాస్టిక్స్‌పై స్పెషల్ రూల్స్ లేవు.

పరిష్కారాలు:

*బయోడీగ్రేడబుల్ ఆల్టర్నేటివ్స్‌కు సబ్సిడీలు, MSME సపోర్ట్ పెంచాలి.
*సాచెట్లు కూడా నిషేధం లేదా రీసైక్లింగ్ బలపరచాలి.

ప్రజలు: రీయూజబుల్ బ్యాగులు, కట్లరీ ఉపయోగించాలి; గ్రీవెన్స్ యాప్‌లో రిపోర్ట్ చేయాలి. 'గ్లోబల్ ప్లాస్టిక్ ట్రీటీలో భారత్ నాయకత్వం తీసుకోవాలి.

ప్లాస్టిక్ ఒక ఆవిష్కరణ – కానీ దుర్వినియోగం సమస్య. ప్రభుత్వం అవగాహన + నియంత్రణ + ఆర్థిక సమతుల్యం చేస్తోంది. పూర్తి సక్సెస్‌కు ప్రజలు, ఇండస్ట్రీ, ప్రభుత్వం కలిసి పని చేయాలి. ప్లాస్టిక్ వద్దు అని మాత్రమే చెప్పకుండా, సస్టైనబుల్ ఆల్టర్నేటివ్స్‌ను స్వీకరించండి అని చర్య తీసుకోవాలి. ఇది మన భవిష్యత్ పర్యావరణం, ఆరోగ్యం కోసం అవసరం. మీరు ఏమైనా చేయగలరు – ఒక రీయూజబుల్ బ్యాగ్‌తో మొదలుపెట్టండి.

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,జర్నలిస్ట్

## ప్రార్థన, ఉపవాసం, మౌనం, ధ్యానాలతో నిండిందే 'గుడ్ ఫ్రైడే'

05, ఏప్రిల్ 2026 నాడు ఈస్టర్ జరుపుకోవడం, ఆ పండుగకు ముందు వచ్చే శుక్రవారం, అనగా 03 ఏప్రిల్ రోజున ప్రపంచవ్యాప్తంగా 'గుడ్ ఫ్రైడే'ను జరుపుకుంటారు. క్రైస్తవ మతంలో గుడ్ ఫ్రైడేకు ప్రత్యేక స్థానం ఉంది. యేసు క్రీస్తు శిలువ వేయబడడం, మరణాన్ని స్మరించుకోవడం క్రైస్తవ మతంలో అత్యంత ముఖ్యమైన గడియలుగా గుడ్ ఫ్రైడేను జరుపుకొంటారు. శిలువపై ఏసు పడిన బాధలకు, ఆయన మరణానికి ప్రతీకగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాసాలు, మౌన వ్రతాలు, ధ్యానాల ద్వారా ప్రభువును స్మరించుకుంటారు. యేసు క్రీస్తు త్యాగం, విమోచన, క్షమాపణ, నిరీక్షణలను గుడ్ ఫ్రైడే తెస్తుందని క్రైస్తవ మతస్థులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. దీనినే దుఃఖకరమైన శుక్రవారంగా కూడా భావిస్తారు. గుడ్ ఫ్రైడే అనేది దుఃఖం, ప్రార్థనల రోజు కాగా, ఈస్టర్ అనేది ఆనందం, ఆశల పండుగ. గుడ్ ఫ్రైడే రోజున క్రీస్తు శ్రమల వృత్తాంతాన్ని చదవడం, శిలువను ఆరాధించడం, దివ్య సత్ప్రసాదం స్వీకరించడం, ప్రత్యేక చర్చి సేవలు,మూడుగంటల పాటు ప్రత్యేక నిశ్శబ్ద ప్రార్థనలు, ధ్యానాలు, విషాద గీతాల ఆరాధనలు, సాదా బలిపీఠ అమరికలు వంటివి చేర్చబడతాయి. మానవాళి జీవితాల్లో శాంతి, ఆశ, విశ్వాసం, కృప, త్యాగం, వినయం నిండాలని ప్రార్థిస్తూ జరుపుకునే గుడ్ ఫ్రైడే మనందరికీ శుభా న్ని కలిగించాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేద్దాం.

*(03 ఏప్రిల్ గుడ్ ఫ్రైడే సందర్భంగా)*

## మున్సిపల్ బడ్జెట్ రూ.34 కోట్ల 70 లక్షలు.. పాలకవర్గం ఆమోదం



**ప్రజాపక్షం/జమ్మికుంట:** మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన 34 కోట్ల 70 లక్షల బడ్జెట్ ను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో 2026– 27 ఆర్థిక సంవత్సరం క్యాపిటల్ గ్రాండ్ 24 కోట్ల 69 లక్షలు, 2026–27 ఆర్థిక సంవత్సరం జనరల్ ఫండ్ ఆదాయం 9 కోట్ల 64 లక్షలు, మున్సిపల్ కార్మికుల, ఉద్యోగుల జీతాలు ఆదాయ, వ్యయాలు వంటి పలు అంశాలను పొందుపరచగా పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ, మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి,ఎఇ వికాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, రాజ్ కుమార్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్ లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు పలువురు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు అందజేశారు. 54 మంది లబ్ధిదారులకు గాను రూ.15,11500( పదిహేను లక్షల పదకొండు వేల 500 రూపాయల) విలువైన చెక్కులను నేరుగా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, కుస్తాపూర్ సర్పంచ్ జేల్లా రాజు,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి పరీక్షకు 7,485 మంది హాజరు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో పదో తరగతి భౌతిక రసాయన శాస్త్రం పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (7495) మంది హాజరు కావాల్సి ఉండగా, (7485) మంది హాజరు కాగా,(10) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, 99.9 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇట్టి పరీక్షకు సంబంధించి ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆన్‌లైన్‌లోనే ఇసుక అనుమతులు

**ప్రజాపక్షం/కోహెడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మన ఇసుక వాహనం అనే ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తహసీల్దార్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలందరు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు,ప్రభుత్వ అభివృద్ధిపనులకు ఆన్లైన్ విధానంలోనే ప్రభుత్వం నిర్దేశించిన ధరకు ఇసుక బుకింగ్ చేసుకొని తరలించుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా అక్రమంగాఇసుకనుతరలిస్తేవారిపైచట్టపరమైనచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బహుజన వీరుడు సర్దార్ సర్వాయి
## అడిషనల్ కలెక్టర్ వేణునివాళి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మొగల్ చక్రవర్తులను ఎదిరించి పోరాడిన గొప్ప్య బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. పెద్దపల్లి జిల్లా సమీకృత భవనం లో జరిగిన సర్వాయి పాపన్న 316 వ వర్ధంతి కార్యక్రమం లో పాల్గొని ప్రశాంగించారు. ముందుగా సర్వయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా వెనకబడి తరగతుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపిపి గోపగాని సారయ్య గౌడ్, పెద్దపల్లి జిల్లా గోపా మాజీ అధ్యక్షులు బాలసాని వెంకటేశం గౌడ్, గౌడ సంఘాల నాయకులు పడాల కొమురయ్య గౌడ్, బొబ్బిలి రాజమౌళి గౌడ్, పడాల సతీష్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మాయి దేవి ఆలయంలో
## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సుల్తానా-బాద్:** సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ మహమ్మాయి దేవి అమ్మవారి బ్రహ్మోత్సవముల సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆలయంలో ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ప్రత్యేక పూజలు నిర్వహించరు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణా రావు ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్లు మరియు మార్కెట్ చైర్మన్, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి
అడ్లూరి లక్ష్మణ్ కుమార్






**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్రంలో 27 నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ పౌరుడికి సంక్షేమ పథకాలు అందిస్తామని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు .ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని నేరేళ్ల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో మంత్రి అడ్లూరి పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడ్డాక నేరేళ్ల గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.134.90 కోట్లు ప్రభుత్వం అందించిందని తెలిపారు. రైతు భీమా,రైతు భరోసా,ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి గ్యాస్ సబ్సిడీ,చేయూత పెన్షన్,కళ్యాణ లక్ష్మి, మహిళా శక్తి, వడ్డీలేని రుణాలు,రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని మంత్రి వివరించారు. వీటితోపాటు పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచితవిద్యను అందిస్తూ గ్రామీణ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని మంత్రి తెలిపారు. అంతకుముందు కోరందలపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలాఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేస్తామన్నారు.ఈ కార్యక్రమాలలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజాగౌడ్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, గ్రంథాలయ చైర్మన్ ఎస్.దినేష్ , పాల్గొన్నారు.

**హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి**

హనుమాన్ జయంతి సందర్భంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామంలో గుండు ఆంజనేయస్వామి విజయోత్సవ వేడుకల సందర్భంగా గురువారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో రూ. 10 లక్షలు నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు.అలాగే మండలం లోని గంగాదేవి పల్లి గ్రామంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని గ్రామంలోని మహిళలు వినియోగించుకోలేక పోతున్నారు. అందుకొరకు మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని మహిళలు మంత్రిని కోరగా వెంటనే జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడి గ్రామానికి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని మంత్రి ఆదేశించారు.ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు సింగిరెడ్డి మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కోలకాని వినోద్, ఉపాధ్యక్షులు కాసాని గంగాధర్, కోశాధికారి బుర్ర అనిల్ గౌడ్, హనుమాన్ దీక్ష పరులు,జగిత్యాల జిల్లా గ్రంథాలయం చైర్మన్ దినేష్, గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, రాఘవపట్నం సర్పంచ్ కసారపు భవానిఅరవింద్ గౌడ్, గంగదేవిపల్లి సర్పంచ్ కొలకని జేలందేర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వి.సురేందర్ రెడ్డి సర్పంచ్ లు , డి.తిరుపతి గౌడ్, తిరుపతి, స్వామి, యస్ మోహనరెడ్డి ఉప సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, రాఘవపట్నం గంగదేవిపల్లి గ్రామాలతో పాటు జగిత్యాల జిల్లాలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కలెక్టర్ చిత్రా మిశ్రా




**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని సమస్యల పరిష్కారానికే గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం, రైతు భరోసా సన్న బియ్యం, పింఛన్లతో పాటు ఇతరత్రా పథకాలు లబ్ధి పొందుతున్న వారి వివరాలను గ్రామసభల్లో అధికారులు వెల్లడిస్తారని తెలిపారు. పథకాల అమలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావచ్చని జిల్లా సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజలంతా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. గ్రామసభ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే మహేశ్వర్ కరీంనగర్ రూరల్ తహసిల్దార్ నర్సింగరావు, స్థానిక సర్పంచ్ సాయిళ్ళ శ్రావణి, పలువురు అధికారులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో సరిపడేంత కూరలు వండకపోవటంపై కలెక్టర్ సీరియస్



**ప్రజాపక్షం/ సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ హైమావతి అకస్మీకంగా సందర్శించి, మధ్యాహ్న భోజనప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అన్నం. పప్పు, బెండకాయ, రసం, పెరుగులను పరిశీలించారు. కూరల నాణ్యతను మెరుగపర్చాలని. చేసిన కూరలు దాదాపు 40 మంది విద్యార్థులు సరిపోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కొలత ప్రకారం ఆహార సరుకులను అందిస్తూ ఆహార పదార్థాలను విద్యార్థులకు సరిపడేంత.రుచికరంగా వండాలని మీ ఇష్టానుసారంగా ఏదో ఒక కూరతో సరిపెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూర సరిపడ వండటం లేదని,హాస్టల్ వార్డెన్ పైన యాక్షన్ తీసుకోవాలని డిసిఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యార్థులకు,భోజనం, వసతి. చదువు విషయంలో రాజిపడవద్దన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హాస్టల్ వార్డెన్ నుండి ఉపాధ్యాయులకు తమ విధులకు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇసుక పర్మిషన్ కోసం తీసిన డిడి లు సైతం వాపస్ ఇస్తున్నారని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. గురువారం సుభాష్ నగర్ ఎఐటియుసి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, నిర్మానాలు ప్రారంభం అయిన తరువాత ఒక్క సారిగా ఇసుక, మొరం, కట్టు రౌతుకు రెండింతలు ధరలు పెరగడంతో గృహ నిర్మాణ దారులపై భారం పెరుగుతుందని మండిపడ్డారు. ఈ ధరలను అధికారులు నియంత్రించాలన్నారు. ఇసుక వారంలో ఒక రోజు రావడంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, దీంతో పని లేక నిత్యవసర వస్తువులు కొనలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక ట్రాక్టర్లు, టిప్పర్లు కొన్న వారు ఉపాధి లేక ఫైనాన్స్‌లు సైతం కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తక్షణమే ప్రతిరోజూ ఇసుకకు పెర్మిషన్ ఇచ్చి కార్మికులపై గృహ యజమానులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, నాయకులు వడ్డెపెల్లి లక్ష్మన్ పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు..

రైతులకు మాజీ మంత్రి హరీష్ రావు హితవు



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని మాజీ మంత్రి ఎంఎల్ఏహరీష్ రావు గు రువారం తెలిపారు.ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని రైతు లు దళారులను నమ్మి నష్టపోతున్నారని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల ని రైతుల పక్షాన అసెంబ్లీలో కొట్లాడితే వెంటనే ప్రభుత్వం దిగి వచ్చి కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేశారని అన్నారు.అందులో భాగంగా సిద్దిపేట మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించామని తెలిపారు.రైతులు దళారులను నమ్మి నష్టపోకుడదని కొనుగోలు కేంద్రాల ను ద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ధర్మపురిలో ఘోర రోడ్డు ప్రమాదం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారు 63వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందగా 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐగురుక మహేష్ కథనం ప్రకారం.. ధర్మపురి వైపు నుండి జగిత్యాల వైపు వెళ్తున్న సిమెంట్ లోడ్ లారీ ఎదురుగా జగిత్యాలకు వెళ్లి ధర్మపురికి వస్తున్న ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో బైక్ పైనున్న ముగ్గురు యువకులు ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. బైకును ఢీకొట్టిన లారీ అదేవేగంతో నిర్లక్ష్యంగా ఎడమవైపు తిప్పగా పక్కన వెళ్తున్న ఆటోకు తగలగా ఆటోలో ప్రయాణిస్తున్న 8 మంది హనుమాన్ భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం వెంటనే జగిత్యాలకు తరలించారు.బైకుపై వస్తూ మృతి చెందిన యువకుల్లో ధర్మపురికి చెందిన మాదాసు అమర్ నాథ్ (18) ఇటీవలే ఇంటర్ పూర్తిచేశాడు. అదేవిధంగా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన పడాల రిశ్వంత్ (16), సారంగపూర్ మండలం రేచుపెల్లి గ్రామానికి చెందిన కోల మయాంక్ (15) లు ఇటీవలే ఇంటర్ ప్రథమ సంవత్సరం పూర్తిచేశారు.కాగా ధర్మపురికి చెందిన మాదాసు లచ్చన్న లక్ష్మి దంపతులకు నలుగురు సంతానం కాగా వివిధ కారణాలతో కొడుకు,ఇద్దరు కూతుళ్ల గతంలోనే మృతిచెందగా ఉన్న ఒక్కగానొక్క కుమారుడు అమర్‌నాథ్ సైతం రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడటంతో ఆ కుటుంబం రోదిస్తున్న తీరు ప్రతీ ఒక్కర్నీ కదిలించింది. పడాల రిశ్వంత్, కోల మయాంక్‌లు సెలవులకోసం అమ్మగారి ఊరైన ధర్మపురికి వచ్చారు.అతివేగంగా లారీని నడిపి ఘోర ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహారాష్ట్రకు చెందిన సయ్యద్ ఖాసీం బాసుమియాగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు అమర్ నాథ్ తండ్రి లచ్చన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.బాధిత కుటుంబాలను ఓదార్చిన మంత్రి అడ్లూరి ధర్మపురి శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురు యువకుల కుటుంబాలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ గురువారం కలిసి ప్రమాద ఘటనా వివరాలను తెలుసుకుని యువకుల మృతిపట్ల తీవ్ర సంతాపం తెలిపారు.బాధిత కుటుంబాలను ప్రభుత్వంత రుపునఅన్నివిధాలాఆదుకుంటామనితెలిపారు.

## వీ-హబ్ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వీహబ్ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం పెద్దపల్లి వీహబ్ నైపుణ్యాల శిక్షణా కేంద్రంలో సెర్ఫ్ సంస్థకు చెందిన ఎపిఎంలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు, మండల సమాఖ్య అధ్యక్షులకు వీహబ్ కార్యక్రమాలపై నిర్వహించిన టిఓటి ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని స్వశక్తి సంఘాల మహిళలకు కొత్త వ్యాపార నైపుణ్యాలు నేర్పించి పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి పెద్దపల్లి జిల్లాలో వీహబ్ నైపుణ్యాల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలకు బ్యాంకుల నుండి రుణాలు పొందడం, ఉత్పత్తులకు బ్రాండింగ్, లేబులింగ్ చేయడం, మార్కెట్లో స్థిరపడడం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇక్కడ అందిస్తున్నామని అన్నారు.ఇప్పటికే చిన్న స్థాయిలో వ్యాపారం చేస్తున్న మహిళలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు కూడా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు.డిగ్రీ, బీటెక్ వంటి ఉన్నత చదువులు అభ్యసిస్తున్న యువతులకు ఉద్యోగ అవకాశాల కోసం అవసరమైన ఇంటర్వ్యూ నైపుణ్యాలు కూడా ఈ కేంద్రంలో అందిస్తున్నామని చెప్పారు.జిల్లాలోని స్వశక్తి సంఘాల మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగేందుకు సెర్ఫ్ సిబ్బంది, మండల సమాఖ్య అధ్యక్షులు సమష్టిగా కృషి చేయాలని, విహబ్ అధికారులు ఈ దిశగా ప్రత్యేకంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు.మన జిల్లాలోని వీహబ్ సాధించే విజయాల పరిశీలించి ఇతర జిల్లాలో కూడా వీహబ్ కేంద్రం ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని, ఇతర జిల్లాలకు ఆదర్శవంతంగా నిలిచే విధంగా మన విహబ్ కేంద్రం విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ కాలిందిని, అదనపు డిఆర్డిఓ బి. రవీందర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న,వీహబ్ డైరెక్టర్ జైహింద్, అసోసియేట్ డైరెక్టర్ ఉష, ప్రోగ్రాం మేనేజర్లు తాజ్, అబిద్,శివ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్ పొలాస గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామ సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించి వీడియోను ప్రదర్శించారు. అనంతరం ఈ కార్యక్రమంలో గ్రామముకు సంబంధించి వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ నేరుగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ....ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహిస్తారని గ్రామ ప్రజలు గ్రామసభలో పాల్గొని వారి సమస్యలను తెలపాలని అలాగే గ్రామ అభివృద్ధికి సంబంధించిన పథకాల వివరాలను నిధుల వివరాలను తెలుసుకోవచ్చని వారు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి.నరేష్, డి.పి.ఆర్.వో పి.నరేష్, ఎంపిడివో రమా దేవి, తహసీల్దార్ వరదన్, గ్రామ సర్పంచ్ శంకరయ్య, వివిధ స్థాయిల ప్రజా ప్రతినిధులు, వివిధ స్థాయిల అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభ

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ప్రజాపక్షం/ ఉట్నూర్:** గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఉట్నూరు రైతువేదికలో నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి నివేదిక' గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయని తెలిపారు.ఉట్నూరు పంచాయతీలో మొదటి విడతగా 66 ఇళ్లకు రూ. 90 లక్షలు జమ అయ్యాయని, జిల్లా వ్యాప్తంగా 16 వేల ఇళ్లకు రూ. 220 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఐటిఐలో టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా యువతకు రోబోటిక్స్ వంటి ఆధునిక అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, డ్రైవింగ్ శిక్షణ ద్వారా ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు వెదురు తయారీదారుల ఇళ్లను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, ఎంపీడీవో రామ్ ప్రసాద్, సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'టెన్త్' పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/బోధన్:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. ఆయా తరగతి గదులను సందర్శించి పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందితో ఎవరైనా సెల్‌ఫోన్లు తెచ్చారా..? అని ఆరా తీశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరు కూడా పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తేకూడదని, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా, కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల సీళ్లు తెరిచారా లేదా..? అని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మంగళ ఉన్నారు.

## ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు

మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్



**ప్రజాపక్షం / గజ్వేల్:** సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో ప్రజల భాగస్వా మ్యం ఎంతో అవసరమని, దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ఆ దిశగా కృషి చేయాలని వం టిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మో హన్ స్పష్టం చేశారు. వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ జయ భారతి అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు ఆమె హాజరై మాట్లాడారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని అమలు చేయనుండగా, ఆ కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, పార్టీలకు అతీతంగా వర్తింపజేస్తుండగా, పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికం గా ప్రయోజనం పొందాలని సూచించారు. ము ఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ 500కే వంట గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి, తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్నదాన్యానికి రూ 500 బోనస్ తదితర వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. అయితే గ్రామ సభల్లో అర్హులైన పేదలను గుర్తించాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవాలని తద్వారా ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించనున్నట్లు చెప్పారు. వివిధ అంశాలపై అధికారులు తమ నివేదికలను సభకు సమర్పించగా, నెలకొన్న సమస్యలను ప్ర జలు సభ దృష్టికి తెచ్చారు.ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, ప్రత్యేక అధికారి పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని భక్తులు ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శాస్త్రినగర్,సాత్ శ్రీనగర్ కాలనీల్లోని హనుమాన్ ఆలయాల్లో రాష్ట్ర బిజెపి నాయకుడు రావుల రాంనాథ్,స్థానిక కౌన్సిలర్ రమ్య ఈశ్వర్లు పాల్గొని స్వామివారికి భక్తితో పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు.ఈ వేడుకల్లో ఆలయ అధ్యక్షుడు భూమేష్,సుదర్శన్,కమిటీ నాయకులు కమల్ నయన్,శ్రీనివాస్ గౌడ్,ఉమాపతి గౌడ్,కొత్తూరుసాయినాథ్,గంగాధర్,అనంతస్వామి,శ్రీనివాస్,నర్సాగౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, నవీన్ రావ్ తదితరులు పాల్గొన్నారుఅనంతరం ప్రజా ప్రగతి పాలనలో భాగంగా 13వ వార్డు శాస్త్రినగర్ దక్షిణ భాగంలో వార్డు సభను నిర్వహించారు.ముఖ్యంగా కొత్త పెన్షన్లు, వృద్ధా ప్య,ఇందిరమ్మ ఇళ్లు,గృహ జ్యోతి వంటి పథకాలకు సంబంధించిన అప్లికేషన్లను స్వీకరించి,అర్హులైన ప్రతి లబ్ధిదారునికి న్యాయం చేస్తామని తెలిపారు.ప్రజలు అభివృద్ధి,సంక్షేమ పథకాలను అన్ని విధాలుగా సద్వినియోగం చేసుకోవాలని,ప్రజల శ్రేయస్సు కోసమే ఈ సభలు నిర్వహిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. వార్డు ప్రముఖులు ,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో

## బాధిత కుటుంబానికి అండ

ఎల్‌ఓసి మంజూరు చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా ముత్తాయికోట గ్రామానికి చెందిన గుండారం లచ్చగౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న ముత్తాయికోట సర్పంచ్ గుండారం శ్వేత కిరణ్ గౌడ్ ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అనంతరం చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం విషయాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు వెంటనే రూ. 3 లక్షల ఎల్‌ఓసి మంజూరు చేయించారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే రోహిత్ రావు కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు హనుమంత్ రావు, మండల నాయకులు బాలకిషన్, మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశురాం గౌడ్‌కు సర్పంచ్ శ్వేత కిరణ్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉండి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో బాగంగా గురువారం అందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామ సభ తెలంగాణ గీతంతో ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని గ్రామ ప్రజలకు చదివి వినిపించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పథకాల లబ్ధిదారుల వివరాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల ఆరోగ్యానికి ప్రాదాన్యతనిస్తూ ప్రతి గ్రామంలో మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు 30 రకాల వైద్య పరిక్షలు నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని 28 స్వయం సహాయక సంఘాలకు రూ. 3.50 కోట్ల రుణాలు అందించిగా రూ. 2.50 లక్షల వడ్డీ సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, వడ్డీ లేని ఋణాలు ,భీమా పథకాలు ,రైతు భరోసా, రైతుభీమా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అల్మాయిపేట గ్రామంలోని సర్వే నెం 513 లో కొత్త కాలనీ ఏర్పాటు కు ముందస్తు వస్తే రోడ్లు ,అండర్ గ్రౌండ్ ,డ్రైనేజ్ వ్యవస్థ ,నీటి ట్యాంక్ విద్యుత్ సౌకర్యాలు ,ఇళ్ల నిర్మాణం వంటి అన్ని మౌళిక వసతులు కల్పిస్తాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ హామీ ఇచ్చారు. మంజూరైన 7 ఇందిరమ్మ ఇళ్లలో 4 మాత్రమే నిర్మించబడిన నేపథ్యంలో మిగిలిన లబ్దిదారులు కూడా వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన



ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వ్యక్తిగతంగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అందోల్ నియోజకవర్గంలో త్వరలో పార్మసి కళాశాల స్థాపన జరుగుతుందని సంగుపేట వద్ద రెండు, మూడు పరిశ్రమలు రానున్నట్లు వెల్లడించారు. పేదలకు చెందిన సుమారు 40 ఎకరాల అసైన్డ్ భూమి తప్పుగా రిజిస్ట్రేషన్ అయిన విషయంపై ఆర్డీఓ కు ఆదేశాలు జారీ చేసి రిజిస్ట్రేషన్ రద్దు చేసి భూములను అసలు లబ్దిదారులకు తిరిగి ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ం చేపట్టిన పథకాలు అర్హులందరికి చేరేలా చూడాలని ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే రెండు నెలల్లో 10 శాఖల ద్వార చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు చురుకుగా పాల్గొన్నాలని కోరారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ. 800 కోట్లను అందజేసి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని నాలుగు లక్ష ఇందిరమ్మ చీరలు పంఫిణి చేయడంలో పాటు 50 వేల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొత్తగా పిల్లలకు పోషకాహారంతో కూడిన రాగి జవాతో బ్రేక్ ఫాస్ట్ పథకం , ఇంగర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పథకం ,ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా, పథకాలను ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ముగ్గురు ఇందిరమ్మ, ఇళ్ల లబ్దిదారుల గృహ నిర్మాణాకు మంత్రి కలెక్టర్ కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, సర్పంచ్ ,ఉప సర్పంచ్ ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత పోలీసు కుటుంబానికి అండగా ఉంటాం

ఎస్‌పి అఖిల్ మహాజన్ భరోసా



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్:** విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ భరోసా ఇచ్చారు. గత జనవరి 5న ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ, గుండెపోటుతో మరణించిన 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్(35) కుటుంబానికి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు అసోసియేషన్ తరపున కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ సులోచన, సీసీ కొండరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం అభివృద్ధి కోసమే '99 రోజులు'

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజపక్షం/మెదక్ :** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్షంగా పని చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు స్పష్టం చేశారు. యాక్షన్ ప్లాన్ లో భాగంగా ఏప్రిల్ 2న రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గురువారం మెదక్ పట్టణంలోని దయరా 16,17 వార్డులు, అనంతరం హావేలి ఘనపూర్ మండలం ముత్తాయి కోట, హావేలి ఘనపూర్ లో నిర్వహించిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎ మ్మెల్యే రోహిత్ రావు హాజరయ్యారు.ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మం డల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక సందర్బంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలతో పాటు గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్య లు తీ సుకుంటున్నామన్ని, సిసి రోడ్లు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థలను, సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్న బియ్యం, తదితర పథకాలను 6 గ్యారంటీలను అమలు చేస్తున్నదని తెలిపారు.ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భా గంగా మార్చి 6న ప్రారంభమైన కార్యక్రమం మార్చి 15 వరకు పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ జరిగిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ పథకాల కింద లబ్దిదారుల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పథకం, మహిళకు ఉచిత బస్సు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ వం టివి ఇదివరకే ఇచ్చామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, గ్రామ ఉప సర్పంచ్‌లు ప్రజాప్రతినిధు లు, మండల స్థాయి అధికారులు, హాజయ్యారు.

## 'ఆటిజం' మానసిక వ్యాధి కాదు

ఆటిజంను అధిగమించొచ్చు

డాక్టర్ల సత్యకుమార్ స్వామి, శ్రీకాంత్, దీపక్ రాథోడ్




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఆటిజం అనేది మానసిక వ్యాధి కాదని, ఆటిజం అనేది 15,18 నెలల వ్యవధిలో గుర్తించినట్లయితే పిల్లల నడవడికను గుర్తించి వైద్యుల సలహాలు సూచనల మేరకు పిల్లలతో కలిసి పోవటంతో ఈ ఆటిజంను అధిగమించవచ్చని పీడియాట్రిక్ అసోసియేషన్ జిల్లా వైద్యులు డాక్టర్ సత్యకుమార్ స్వామి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ దీపక్ రాథోడ్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మారుతినగర్‌లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్, ఇందూర్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇండియన్ పీడియాట్రిక్ అసోసియేషన్ నిజామాబాద్ వైద్యులు, డాక్టర్ సత్యకుమార్ స్వామి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ దీపక్‌రాథోడ్‌లు పీడియాట్రిషియన్స్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ, డాక్టర్ రాజేందర్ సూరినీడు తదితరులు హాజరై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆటిజం వ్యాధిని 1980 సంవత్సరంలో గుర్తించటం జరిగిందని తెలిపారు. అనంతరం 2022 లో 50 మంది ఆటిజం బారిన పడ్డారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆటిజమనేది మానసిక వ్యాధి కాదని తెలిపారు. ఆటిజంను గుర్తించడానికి పలు లక్షణాలున్నాయని, అయితే ఈ ఆటిజంకు సంబంధించి ధృవీకరణ పత్రాన్ని హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో మాత్రమే ప్రస్తుతం ఇవ్వటం జరుగుతుందన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామన్నారు. ప్రతి 50 మంది చిన్నారుల్లో ఒకరు ఈ ఆటిజం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆటిజం సంబంధించి పూర్తిస్థాయిలో జీవితాంతం ఉండదని సరైన సమయంలో సరైన విధంగా వైద్యుల సలహాలు సూచనల మేరకు నడుచుకున్నప్పుడు పిల్లలతో సఖ్యతగా ప్రేమగా వారు చేసే తప్పిదాన్ని వారికి స్పష్టంగా ప్రేమతో తెలియజేయటంతో వారిలో మార్పు తీసుకరావటం సులభతరమవుతుందన్నారు. అయితే ఈ ఆటిజమనేది జన్యుపరంగా మనం చుట్టూ నివాసముండే పరిసరాలను బట్టి కూడా రావచ్చన్నారు. ముందుగా ఈ ఆటిజం బారిన పడిన పిల్లల లక్షణలు ఒకరితో ఒకరు కలిసి ఉండకపోవటం ఒంటరిగా ఉండటం, మౌనంగా ఉండటం ఇలాంటి లక్షణాలుంటాయన్నారు. అయితే ఈ ఆటిజం తల్లి మానసిక ఆరోగ్యం, తీసుకునే ఆహారం, తల్లి శారీరక ఆరోగ్యం చెడు అలవాట్లు పొగ తాగడం ఆల్కహాల్ తీసుకోవటం, షుగర్ వ్యాధిగ్రస్తుల సంక్రమించే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రకృతికి సంబంధించి పోను తనలో తాము మాట్లాడుకోవటం ఆడిన ఆటలు పదేపదే ఆడటం ఇతర పిల్లతలో కలవకపోవటం తన లోకంలో తానే ఉండిపోవటం, మానసిక ఎదుగుదల లేకపోవటం, ఎదిరించి మాట్లాడటం కొత్త మనుషులతో కాంటాక్ట్‌లో ఉండకపోవటం ఇలా రకరకాల లక్షణాలుంటాయని, ఈ లక్షణాలు తల్లిదండ్రులు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవటం ద్వారా వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. అలాగే హైపర్ టెన్షన్ ఉన్న పిల్లల్లో ఎక్కువగా షుగర్‌కు సంబంధించి చాక్లెట్లు తినిపించటంతో హైపర్ యాక్టివ్ అనేది పెరిగే ఆస్కారముంటుందన్నారు. వీలైనంత వరకు హైపర్ ఆక్టివ్ ఉన్న పిల్లలు చక్కెర ఎక్కువగా ఉన్న తినుబండరాలను పెట్టకూడదని సూచించారు. ప్రత్యేక పద్ధతిలో నేర్పించటంజరుగుతుందని స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి సిద్ధయ్య తెలిపారు. విద్యార్థులు వారి ఆరోగ్య స్థితిగతులు అనుకరించే పద్ధతిని గమనిస్తూ వారికి ఏవిధంగా చెబితే వారిలో మార్పు తీసుకరావచ్చనేది గుర్తించి విద్యనందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే వారికి ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండేందుకు అందరూ ఒకేచోట ఉంచటం వా రిలో మరింత ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పెం పొందించేలా చదువుతో పాటు విద్య, యోగా ఆటలు ఆడించటం పాటలు నృత్యాలు లాంటివి చేయించటం జరుగుతుందన్నారు. అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సత్యనారాయణ, రాంరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దివ్యాంగులు, అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ అభివృద్ధికి శ్రీకారం..

రూ.1.06 కోట్లతో పలు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోంది.బిజెపి శాసనసభా పక్ష నాయకులు బీజేఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెలే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గురువారం మండంలోని పలు గ్రామాల్లో పర్యటించి,మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి,సుమారు రూ.1.06 కోట్ల వ్యయంతో చేపటునున్న వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపనలు చేశారు.కౌట్ల బి గ్రామంలో రూ.1.06 కోట్ల నిధులతో అభివృద్ధి మండలంలోని కౌట్ల బి గ్రామలో కోటి 6 లక్షల రూపాయల భారీ నిధులతో పలు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు.ఈ నిధులతో గ్రామంలో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ రూ.30 లక్షలతో మూడు ఎస్.హెచ్.జి భవనాలు,మరో రూ.30 లక్షలతో మూడు వర్కింగ్ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.వీటితో పాటు చిన్న పిల్లల ఆరోగ్యం,విద్య కోసం రూ.24 లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు,జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.2 లక్షలు,అలాగే గ్రామ మౌలిక సదుపాయాలైన సీసీస రోడ్లు,డ్రైనేజీల కోసం రూ.20 లక్షలను కేటాయించారు.సారంగాపూర్ మండల కేంద్రంలో పనుల ప్రారంభం అనంతరం మండల కేంద్రంలో కూడా పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఇక్కడ రూ.30 లక్షలతో మూడు ఎస్.హెచ్.జి భవనాలు,రూ.30 లక్షలతో వర్కింగ్ షెడ్లు,రూ.12 లక్షలతో అంగన్‌వాడి భవనం రూ.30 లక్షలతో అంతర్గత రోడ్లు,డ్రైనేజీ పనలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శనంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని,నిధుల వినియోగంలో పారదర్శకత పాటిస్తూ నాణ్యమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం శంకుస్థాపనల అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి గ్రామాల్లో పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఆదేశించారు.సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బిజెపి సీనియర్ నాయకులు రావుల రాంనాథ్,జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంతవ మం డల అధ్యక్షుడు సత్యం చంద్రకాంత్,మండల అధ్యక్షుడు నరేష్,గ్రామ సర్పంచ్ భూమన్న,ఉప సర్పంచులు కృష్ణ రెడ్డి,భూమారెడ్డి,సత్యపాల్‌రెడ్డి,రాజు రెడ్డి, దయాకర్ రెడ్డి తో పాటు వివిధ శాఖల మండల అధికారులు,పార్టీ కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

కలెక్టర్, కమిషనర్ దివ్య దేవరాజన్




**పజాపక్షం/సంగారెడ్డి/కొండాపూర్ :** కొండాపూర్ మండలం తొగర్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవ రాజన్ ,జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామ సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో బాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు. ఈ సందర్బంగా పంచాయతీ రాజ్ కమీషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలలే ఉన్నారని మహిళలు పనిచేస్తే సాదించలేనిది ఏదీ లేదని తెలిపారు. గ్రామాభివృద్దిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉపాది హామీ పథకం ద్వార సీసీ రోడ్లు శానిటేషన్ పనులు గ్రామ పంచాయతీ భవనాలు ,సంఘ భవనాలు నిర్మించుకోవచ్చని వివరించారు. ఉపాది కార్డుదారులకు 100 రోజుల పని కల్పించాలని ,వేసవిలో కూలీలకు తాగునీరు. నీడ పస్ట్ ఎయిడ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో బాగంగా ప్రతి ఇంటి నుండి తడి ,పొడి చెత్త వేరు చేసి అందించాలని సూచించారు. గ్రామ సభలో స్వీకరిచిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి లబ్దిదారులకు చేరేలా కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళా సాదికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి స్వయం సహయక సంఘాలకు రుణాలు డిజిటల్ హెల్త్ కార్డులు ,జీవనోపాది అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో అమలవుతున్న పథకాల లబ్దిదారుల వివరాలను వెల్లడిస్తూ గ్రామ సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలు తమ ఆర్జీలు అభ్యంతరాలు, సూచనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో రైతు భరోసా పథకం కింద సంవత్సరానికి రూ. 12వేల చొప్పున రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ 202526 యాసంగి సీజన్‌కు రూ. 167 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 12,649 మంది లబ్దిదారులకు ఎంపిక చేసిన 443 ఇండ్లు పూర్తి స్తాయిలో నిర్మాణం వివిధ దశల నిర్మాణంలో ఉన్న ఇండ్లకు రూ. 163 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందించడంలో పాటు నిరాశ్రయులకు స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో డిసెంబర్ 2023 నుండి ఇప్పటి వరకు దాదాపు 4.98 కోట్ల మంది మహిళలు ప్రయాణించి రూ. 224. 68 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు తెలిపారు. రూ 500 గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,76,570 మందికి రూ. 22 కోట్ల సబ్సిడీ అందించగా ,గృహజ్యోతి పథకం కింద 2,17,527 లబ్దిదారులకు రూ. 165.39 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సన్న రకం వరి దాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ చెల్లిస్తూ 2.14.785 టన్నుల కొనుగోలు చేసి రూ. 10.73 కోట్ల బోనస్ రైతులకు అందించినట్లు తెలిపారు. చేయూత పథకం సామాజిక భద్రత పెన్షన్లు కింద 1.52,571 మందికి రూ. 36.కోట్లు రుణాలు ,15.074 గ్రూపులకు వడ్డి లేని ఋణాలు రూ. 49.70 కోట్ల రూపాయాలు అందించడం జరిగింది. ఇందిరమ్మ చీరల పథకం కింద 1.98560 చీరల పంపిణి చేయగా ఆహార భద్రత కింద 51,490 కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 1.56,720 మందికి లబ్ది చేకూర్చి నట్లు తెలిపారు. ప్రతి నెల 9017 మెట్రిక్ టన్నుల సబ్సిడీ బియ్యం పంఫిణి జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా అల్పాహారం పథకం ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం ఇంటర్ విద్యార్థులకు మద్యాహ్న భోజనం ,దివ్యాంగ విద్యార్థులకు మెటర్ వాహనాల పంఫిణి మద్యాహ్నాం బోజనం పథకం ఇంటర్నెట్ వరకు విస్తరణ పంటల సహాజ పేంద్రియా వ్యవసాయం పంటల వైవిద్య కరణ వంటి పథకాలను చేపట్టనున్నట్లు తెలిపారు. జడ్పీ సీఈఓ జానకిరెడ్డి ,పీడి డీఆర్‌డిఓ జ్యోతి గ్రామ సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఉప సర్పంచ్ ప్రజాప్రతినిధులు సంబందిత అదికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ



**లక్నో:** ఐపిఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమీర్ రిజ్వి (70*; 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ట్రిస్టన్ స్టబ్స్ (39*; 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. లక్ష్యఛేదనలో ఢిల్లీకి ఆరంభంలోనే వరుస షాక్‌లు తగిలాయి. కెఎల్ రాహుల్, అక్షర్ పటేల్ డకౌట్ కాగా.. పాథుమ్ నిశాంక (1) నిరాశపర్చాడు. నితీశ్ రాణా (15) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. దీంతో ఢిల్లీ 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సమీర్ రిజ్వి.. స్టబ్స్‌తో కలిసి ఢిల్లీని విజయం దిశగా నడిపించాడు. ఈ జోడీ అభేద్యమైన ఐదో వికెట్‌కు 76 బంతుల్లో 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, మహ్మద్ షమి, మోసిన్ ఖాన్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్‌లో మిచెల్ మార్ష్ (35; 28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (36; 25 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్) రాణించారు. ఐడెన్ మార్క్రమ్ (11), నికోలస్ పూరన్ (8), రిషభ్ పంత్ (7), ఆయుష్ బదోని (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో నటరాజన్, లుంగి ఎంగిడి చెరో 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.

## జింబాబ్వే పర్యటనకు భారత్



**ముంబై :** వరల్డ్ చాంపియన్ భారత జట్టు ఈ ఏడాది జులైలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఆఫ్రికా దేశంతో మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్ ఆడేందుకుగాను టీమ్‌ఇండియా.. జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్నట్టు బుధవారం బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. పొట్టి ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి దక్కించుకున్న భారత్.. చివరిసారిగా 2024లో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. ప్రపంచకప్ విజయం తర్వాత టీమ్‌ఇండియాకు ఇదే తొలి ద్వైపాక్షిక సిరీస్. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఇరుజట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరుగుతాయి.

## ఏషియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌కు విశ్వనాథ్, సచిన్



**ఉలన్బాతర్ (మంగోలియా) :** ఏషియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజూ భారత బాక్సర్లు దుమ్మురేపారు. మంగోలియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 కిలోల క్యాటగిరీలో విశ్వనాథ్.. 5–0తో కిర్గిస్థాన్ బాక్సర్ బెక్జట్ ఎర్గెష్వో ఏకపక్ష విజయం సాధించి తదుపరి రౌండ్కు ముందంజ వేశాడు. మెన్స్ 60 కిలోల విభాగంలో సచిన్.. 4–1తో బుయండలై బయర్ఖు (మంగోలియా)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు.

## పోటీ కోసం జికె
(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### సింథటిక్ వస్త్రాల ఉత్తత్తి అధిక నగరం

☞భారతదేశ మొదటి ముస్లిం రాష్ట్రపతి ఎవరు?
జాకీర్ హుస్సేన్
☞ మొదటి రాజ్యాంగ సవరణ రాజ్యాంగానికి ఎన్నో షెడ్యూల్ని కలిపింది?
9
☞ 'పచ్చల ద్వీపం (ఎమరాల్డ్ ఐలాండ్)' అని పేరుగాంచిన ప్రదేశం
ఐర్లాండ్
☞ ప్రపంచంలోని మొదటి మహిళా ప్రధాన మంత్రి ఏ దేశానికి చెందినవారు?
శ్రీలంక
☞కుతుబ్షాహీ రాజ్యం ఎప్పుడు పతనమైంది?
క్రీ.శ. 1687
☞ 'చిప్కో' అంటే ... ?
చెట్లను ఆలింగనం చేసుకోవడం
☞ తెలంగాణ రాష్ట్రోదయం గ్రంథ రచయిత ఎవరు?
ఆచార్య కోదండరాం
☞ఎత్తయిన ప్రాంతంలో ఇల్లునిర్మించుకోవడం
వరద నివారణ చర్య
☞ వాల్మీకి రామాయణానికి రాఘవీయం అనే వ్యాఖ్యను ఎవరు రాశారు?
రావు మాదానాయకుడు
☞ టీవీ రిమోట్ కంట్రోలర్ నుంచి ఏ తరంగాలు వెలువడతాయి?
పరారుణ కిరణాలు
☞ జాతీయ ఆదాయాన్ని దేశంలో ప్రథమంగా లెక్కించింది ఎవరు?
దాదాభాయ్ నౌరోజీ
☞ భారతదేశ మొదటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
హెచ్‌జె కానియా
☞ ఎర్రచందనం ఏ జిల్లాలోని అడవులలో లభిస్తుంది?
చిత్తూరు
☞ఆస్ట్రేలియా అకాడెమీ ఆఫ్ సైన్సెస్ కరస్పాండింగ్ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన భారతీయుడు ఎవరు? (ఈ ఘనత సాధించిన తొలి భారతీయ శాస్త్రవేత్త ఈయనే
సీఎన్ఆర్ రావు
☞కిందివాటిలో దేనికి ఎక్కువబలం ఉంటుంది?
కేంద్రక బలం
☞వాతావరణ మార్పు జాతీయ అనుసరణ నిధి ప్రారంభ మొత్తం ఎన్ని కోట్ల రూపాయలు?
100
☞అంతర్జాతీయ న్యాయ స్థానం ఎక్కడ ఉంది?
హేగ్
☞ భారతదేశంలో పోర్చుగీసు గవర్నరుగా ఎవరిని నియమించారు?
ఫ్రాన్సిస్కోడి అల్మెడా
☞ గాంధేయ విధానాల్లో చిప్కో ఉద్యమాన్ని ఏమని పిలిచేవారు?
అడవి సత్యాగ్రహం
☞ విద్యుత్ ఆవేశానికి ప్రమాణం
కూలుంబు
☞ గట్టి కలప లభించు ప్రాంతం
అమెజాన్
☞ మొక్క లేతగా ఉన్నప్పుడు కిరణజన్య సంయోగ క్రియ జరుపుకొనుమొక్క భాగము?
కాండము
☞ మూడింట రెండు వంతులు ఉష్ణమండ



లంలో ఉన్న ఖండం
దక్షిణ అమెరికా
☞ విద్యుత్ ప్రవాహానికి ప్రమాణం
ఆంపియర్
☞ హిమోగ్లోబిన్ వుండే రక్త భాగము
ఎరిత్రోసైట్
☞ భారతదేశంలో మొగల్ సామ్రాజ్యాన్ని ఎవరు స్థాపించారు?
బాబర్
☞ నిక్టలోపియా అని ఏ వ్యాధిని అంటారు?
రేచీకటి
☞శంకరాచార్యుడు బోధించిన తాత్త్వికశాఖ
అద్వైతం
☞ రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే పదార్థం?
అమ్మోనియం పెర్క్లోరైట్
☞ 'సోలదగండడు' అనే బిరుదు ఎవరిది?
ఒకటో బద్దెగడు
☞సైబీరియన్ కొంగ కనిపించే సాంక్చ్యుయరీ
భరత్పూర్
☞ దీనిని రాతినూనె అంటారు.
పెట్రోలియం
☞ వాహకంలోని కరెంట్ని కొలిచే పరికరం



అమ్మీటర్
☞ఇందులో ఏదేశానికి వీటో అధికారం కలదు?
ఫ్రాన్స్
☞ కణములో కేంద్రకము కలదని తెలిపినది.
రాబర్ట్ బ్రౌన్
☞ 1858లో క్వీన్ విక్టోరియా ప్రకటనను ఎవరు చాటారు?
కానింగ్
☞ గవర్నర్ ను అభిశంసించే అధికారం ఎవరికి ఉంది?
ఎవరు అభిశంసించలేరు
☞ దక్షిణాన విజయనగర రాజులకు ప్రధాన విరోధులైన సుల్తానులు ఎవరు?
బహమనీ
☞ వీటో అధికారం వున్న ఐ.రా.స. అంగం
భద్రతా మండలి
☞ 1 కూలుంబు / 1 వోల్ట్ =, 1 ఫారడ్
☞ పొటాషియం పెర్మాంగనేటు నీటిలో కలిపిన నీటిరంగు ఇలా ఉంటుంది.
ఊదా
☞ ఏ విటమిను ఎనిమల్ ప్రొటీన్ ఫ్యాక్టర్ అంటారు?
బి12
☞ 'ఘటిక' అనేది ఎవరి నివాస స్థావరం?
బ్రాహ్మణ పండితులు
☞ ఏ శాసనంలో మొదటి తెలుగు కంద పద్యాలున్నాయి?
కురిక్యాల శాసనం
☞వజ్రం దేని రూపాంతరం?
కార్బన్
☞కింది ఏ సంగ్రామం భారతదేశంలో మొగలు సామ్రాజ్య స్థాపన, తర్వాత దాని వ్యాప్తికి ఆరంభంగా గుర్తింపు పొందింది?
కణా సంగ్రామం
☞రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరగనప్పుడు ఏ ఆర్టికల్ ప్రకారం గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేస్తారు?
213
☞సింథటిక్ వస్త్రాల ఉత్తత్తి అధిక నగరం?
ముంబయి

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి
షేక్ బాష్ మియా



ప్రజాపక్షం/వరంగల్ : ప్రజలకు మరింత చేరువై, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం చేపట్టామని వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో కాశిబుగ్గ సెంటర్‌లో సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని, ప్రజాహక్కుల రక్షణకు అండగా ఉండే సిపిఐని ప్రజలు ఆదరించి, ఆర్థికంగా బలోపేతమవడానికి విరివిగా విరాళాలు అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బుస్స రవీందర్, గన్నారపు రమేష్, వరంగల్ మండల సహాయ కార్యదర్శి జన్ను రవి, ఆరే రాజు, కొయ్యడ మనోహర్, అయితే ప్రసాద్, వసంత, భాగ్యశ్రీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్‌వలీ ఉల్లాహ్‌ఖాద్రీ అన్నారు. వరంగల్ నగరంలోని ఎల్బీ నగర్‌లో నిర్వహించిన ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా సిపిఐ కార్యక్రమం ప్రధానంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలతో నేరుగా కలసి వారి దైనందిన సమస్యలను అర్థం చేసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. సేకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, నాయకులు జగదీష్, అజాజ్, రమత్ మతీన్, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

**హసన్‌పర్తి :** ఇంటింటికీ సిపిఐ సామూహిక విరాళాల సేకరణను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి పార్టీ శ్రేణులకు కోరారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన ఇంటింటికీ సిపిఐ సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. కార్యక్రమంలో నేదునూరి రాజమౌళి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాంపల్లి లక్ష్మయ్య గోపు బుచ్చిరెడ్డి. బండ రాజిరెడ్డి బండ దామోదర్ రెడ్డి, బండ జయపాల్ రెడ్డి గిన్నారపు రాజు, గద్దం రాజు, గద్దం శాంత, గద్దం రాదా, రేణిగుంట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు ఫించన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

**కోదాడ:** ఇంటింటికీ సిపిఐ గడపగడపకు సిపిఐ అనే నినాదంతో ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం కోదాడ పట్టణంలోని రామిరెడ్డి పాలెంలో ఎంఎస్ నగర్‌లో ప్రాంతాలలో సిపిఐ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన వారికి ఫించన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని పోరాట కార్యక్రమాన్ని రూపొందించబోతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, సాయిబెల్లి, లింగయ్య, గోపినాయక్, రెహ్మాన్, మోసిన్, జానీ పాల్గొన్నారు.








## కమ్యూనిస్టులంటే మోదీ, అమిత్ షాలకు భయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు కమ్యూనిస్టులంటే ఎందుకంత భయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ్మా ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలచంలో జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా బాల నరసింహ్మా హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో అమిత్‌షా సిపిఐపైన కమ్యూనిస్టులపైన చేసిన ఆరోపణలు సరికాదన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాలని లేకపోతే ప్రశ్నించే శక్తులు కనుమరుగవుతాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందు వల్లనే మోదీ, అమిత్ షాలు కమ్యూనిస్టులను, కమ్యూనిజాన్ని, పోరాటం చేసే వాళ్ళని, ప్రశ్నించే వాళ్ళని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. గద్దర్ లాంటి తెలంగాణ జాతిపితను పార్లమెంటు సాక్షిగా విమర్శించడం అంటే ఇంతకన్నా సిద్దుమాలిన పని ఇంకొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ శతాబ్ది కాలం నుంచి చేసిన పోరాటాలు, త్యాగాలు ఎన్నెన్నో చెప్పలేనివని, భవిష్యత్తు మరిన్ని ఉద్యమాలకోసం గడప గడపకు సిపిఐ విరాళాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని, ప్రజాహక్కుల రక్షణకు అండగా ఉండే సిపిఐని ప్రజలు ఆదరించి, ఆర్థికంగా బలోపేతమవడానికి విరివిగా విరాళాలు అందజేయాలని ఆయన కోరారు. గద్వాల జిల్లా కేంద్రంలో సురవరం సుధాకర్ రెడ్డి పేరుతో ఏర్పాటు చేసే సిపిఐ జిల్లా కార్యాలయం నిర్మాణానికి పెద్ద ఎత్తున సహకరించగలరనీ కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు ఆశన్న, నాగార్జున, కాశీం, ఉప్పేరు కృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కార్మిక చట్టాల రద్దుకు పోరాటాలు

ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా
అధ్యక్షుడు రెహమాన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** హక్కులు హరిస్తున్న కొత్త కార్మిక చట్టాల రద్దుకు కార్మికలోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.రెహమాన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తెలంగాణ మెడికల్ అవుట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సయ్యద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మికుల సంక్షేమానికి మరణ శాసనాలైనా లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులతో చీకటి ఒప్పందాలు చేసుకుని లాబాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను దొడ్డి దారిన తీసుకొచ్చారన్నారు. కార్మికవర్గం సర్వహక్కులు కోల్పోయి ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు, యాజమానుల వద్ద కట్టు బానిసలుగా మర్చేందుకు ఈ లేబర్ కోడ్‌లను తీసుకోచ్చారన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి 12గంటల పని విధానాన్ని అమలు చేసే ప్రయత్నం చేయడం కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. కనీస అవసరాలకు సరిపడా వేతనాలు చెల్లించకుండా చట్టం తేవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ చట్టాల ద్వారా పేదవారిని ఇంకా పేదవారీగా మార్చే ప్రయత్నం తప్పా అభివృద్ధి కాదన్నారు. ప్రభుత్వం ఆసుపత్రిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు వర్కర్స్‌కు వేతనాలను నేరుగా కార్పోరేషన్ ద్వారా మరి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి చట్లావాసు, ఉపాధ్యక్షులు, భాను చందర్, పహీం, చంద్రశేఖర్, షకీల్ జాన్ లైఖ పాషా, హాజీ, అంజీ, నగేష్, సీను పాల్గొన్నారు.

# దళిత, బహుజనులపై పెరుగుతున్న దాడులు

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మారుపాక అనిల్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, దళిత, బహుజనులపై దేశవ్యాప్తంగా దాడులు పెరుగుతున్నాయని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం తన వినాశకరమైన విధానాలతో సామాజిక సమాధి కడుతోందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, బహుజన, దళిత, మైనారిటీ వర్గాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆరోపించారు. దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ కరీంనగర్ జిల్లా సమావేశం గురువారం జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బోయినీ తిరుపతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జాతీయ సమితి సభ్యుడు బొయిని అశోక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరై మారుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తోందని, మనువాద భావజాలాన్ని రుద్దడం ద్వారా సమాజాన్ని విడగొట్టే కుట్రలు చేస్తోందన్నారు.దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుందన్నారు. అన్ని సామాజిక శక్తులు ఏకమై ఈనియంతృత్వ పోరాటాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 17, 18 తేదీల్లో వరంగల్‌లో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. సమావేశంలో బత్తుల బాబు, గంగాధర రఘు, వినోద్ కుమార్, నాంపల్లి, బి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతకు ప్రతిరూపంగా మహిళా సంఘాలు

ప్రతీ మహిళా, మహిళా సంఘాలలో చేరాలి

వ్యాపారాలు చేసే మహిళలకు వడ్డీ లేని రుణాల మంజూరు

కుటుంబాన్ని పోషించే స్థాయికి మహిళలు ఎదగాలి: మంత్రి సీతక్క





**ప్రజాపక్షం/ములుగు:** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగు కాంతులు వెల్లివిరుస్తున్నాయని, మహిళా సాధికారతకు సమాఖ్య భవనాలు చిహ్నంగా ఉంటాయని, రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఐక్యతకు ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని పివి కన్వెన్షన్ హాల్‌లో ప్రజాపాలన...ప్రగతి ప్రణాళిక గ్రామ సభకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. రాష్ట్ర గీతంలో గ్రామ సభ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా ప్రజల జీవితాలలో వెలుగులు వెల్లి విరుస్తున్నాయని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన అనంతరం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామాలలో ఉండే ప్రతి ఒక్కరికి తెలియజేయడం జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందిరమ్మ ఇల్లు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి పథకాలు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 4లక్షల 70వేల మహిళా సంఘాల వారికి వడ్డీ లేని రుణాలను అందించి వివిధ వ్యాపారాలు చేసుకోవడానికి ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, వ్యాపారంలో భాగస్వాములైన మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ముగిసిన మేడారం మహా జాతర సందర్భంగా 560 మంది మహిళలకు 6 వందల కోట్ల రూపాయలను వడ్డీ లేని రుణాలు అందించడం పక్షం రోజులలోనే మూడు కోట్ల 50లక్షల రూపాయల ఆదాయాన్ని ఆర్జించారని తెలిపారు. ప్రస్తుత కాలంలో కల్తీపాలు అమ్మకాలు జరుగుతున్న ఈ సందర్భంలో స్వచ్ఛమైన పాలు అందే విధంగా రానున్న రోజులలో మహిళా సంఘాల వారికి గేదెలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందని, సేకరించిన పాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో సద్వినియోగం చేసుకుంటుందని అన్నారు. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా పొదుపు సంఘాల ద్వారా గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుంటు వ్యాపారాలు స్థాపించాలని, మహిళా సంఘాల సభ్యులకు కుట్టుమిషన్ల శిక్షణ, స్వయం ఉపాధి కోర్సులను, కంప్యూటర్ కోర్సులు కూడా ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం వెంకటాపూర్ మండలానికి చెందిన 31 కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు వెంకటాపూర్ గ్రామంలో శెట్టి జయ సదానందం ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారుల గృహ ప్రవేశ కార్యక్రమానికి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి హాజరయ్యారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ అంచనా విలువ రూ.10లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణం పనులకు మంత్రి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, వెంకటాపూర్ సర్పంచ్ సుగుణ, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమంలో భాగంగా విరాళాల సేకరణ




**ప్రజాపక్షం/నర్సంపేట :** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టిందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్ అన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా నర్సంపేట పట్టణంలోని నెహ్రూ నగర్ సెంటర్‌లో విరాల సేకరణ చేపట్టగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్క పెల్లి రమేష్ ప్రారంభించి మాట్లాడుతూ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుని దేశాన్ని, మతోన్మాద, కార్పొరేట్ కబంధాల హస్తాల నుండి విముక్తి చేసి తమ సమాజ స్థాపనకై రాజీలేని పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. నిరంకుషిత నిజం దించడానికి సాగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేలమంది తాగాలతో 3000 గ్రామాలు విముక్తి పది లక్షల ఎకరాల భూమి పంచెను ఘనమైన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడడాలని, వామపక్ష ప్రజాతంత్ర పురోగమిశక్తులు కోరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఇంటింటికి సిపిఐ పార్టీ పిలుపులో భాగంగా విరాళాల సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దిడ్డి పార్థసారథి, సిపిఐ సీనియర్ నాయకులు ఇల్లందల సాంబయ్య, నర్సయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**ప్రజాపక్షం/ధర్మసాగర్:** హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం శివారులో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో స్పాట్ లో ఇద్దరు మృతి చెందగా 5గురికి తీవ్ర గాయాలు జరిగినట్లు పోలీసులు తెలిపారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మృతులు ఏనుగుల శివ, లోకేష్ ఒకే కుటుంబానికి చెందిన వారిగా సమాచారం. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప హాస్పిటల్‌కి తరలించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో నర్సాపూర్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, 'కుడా' చైర్మన్, కలెక్టర్

**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్క్ సమీపంలో ఉన్న రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను , భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్ లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే, కుడా ఛైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు. అదేవిధంగా రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ ఎస్టీ సెల్ ను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభంలోనూ ఆగని సంక్షేమ పథకాలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డ్ సభలు జరుగుతున్న నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి 29వ డివిజన్ వార్డ్ సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ కూడా హాజరయ్యారు.కార్యక్రమం రాష్ట్ర గీతంతో ప్రారంభమైంది. అనంతరం వార్డ్ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో 99 రోజుల ప్రణాళిక ద్వారా చోటు చేసుకుంటున్న అభివృద్ధి, మార్పులను వివరించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తోందని చెప్పారు.కార్యక్రమం అనంతరం స్థానికంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్ధ జగన్,డివిజన్ అధ్యక్షులు పూర్ణ,నాయకులు విజయ్,శ్వేత,రోషన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లు

ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

**ప్రజాపక్షం/వాజేడు:** పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ళని 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రాణాళికలు భాగంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం కేంద్రం లోని గురువారం నాలుగు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు చెడెం కృష్ణవేణి, చిడెం పార్వతి, గొంది కమల, గొంది సారక్క లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు. అలాగే గ్రామపంచాయతీ సమీపంలో 63 కెవి ట్రాన్స్ఫారం ఓపెన్ చేశారు. అనంతరం ప్రజా ప్రణాళికలో భాగంగా గ్రామ పంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు 99 రోజుల ప్రణాళికలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామానికి చెందిన కుర్సం జానకి 26000, కొంగాల గ్రామ పంచాయతీకి చెందిన చిట్టెం శివానంద్ 8000 రూపాయలను చెక్కులను అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతటికల్లు సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీకాంత్, నాగారం సర్పంచ్ బోదెబోయిన స్వరూప, మండల నాయకులు కాకర్లపూడి కళ్యాణ్, జగన్ బాబు, వాసు బాబు, ఉప సర్పంచ్ మందపాటి సుబ్బరాజు, పాల్గొన్నారు.

## పకడ్బందీగా ప్రభుత్వ పథకాలు అమలు: కలెక్టర్




**ప్రజాపక్షం/తరిగొప్పుల:** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని తరిగొప్పుల గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయితీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో తహశిల్దార్ మోసిన్, మండల ప్రత్యేక అధికారి రాణా ప్రతాప్, గ్రామ సర్పంచ్ జ్యోతి, పంచాయితీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఐకి విరివిగా విరాళాలు ఇవ్వండి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** పేద ప్రజల కోసం పనిచేస్తున్న సీపీఐకి విరివిగా విరాళాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్ అన్నారు. గురువారం సీపీఐ మండల కమిటీ ఆద్వర్యంలో సామూహిక నిధి సేకరణను మండల కేంద్రంలో రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ చేస్తున్నటువంటి మహత్తరమైన రాజకీయ పోరాటంలో ఆర్థికంగా సహకరించి ప్రజా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాష, మండల కార్యవర్గ సభ్యులు సుధాకర్, నాయకులు నూర్నిశ, పెద్ద రాములు, సత్తయ్య, బుచ్చయ్య, మల్లేశం, సాయిలు, ఆలీఫా, ఐలయ్య, పాల్గొన్నారు.

## ఇంధన ధరల భారంపై కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపి



**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్:** పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని లోక్‌సభలో ప్రశ్నించారు. మార్కెట్ ఆధారిత ధరల విధానంతో రైతులపై అదనపు భారం పడుతోందని, సాగు ఖర్చులు పెరిగి రైతుల ఆదాయాలు దెబ్బతింటున్నాయన్నారు.వ్యవసాయ రంగానికి ప్రత్యక్ష ఉపశమనం కల్పించే విధంగా ప్రత్యేక ధరలు లేదా సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేసిన వరంగల్ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కేంద్రం తీసుకుంటున్న చర్యలు రైతులకు సరిపోవడం లేదని అభిప్రాయపడ్డారు. పంటల రవాణా ఖర్చులు, ఎరువులు, యంత్రాల వినియోగం ఇంధనంపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో ధరల పెరుగుదల రైతులను ఆర్థికంగా కుంగదీస్తోందని అన్నారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి మాట్లాడుతూ ఇంధన ధరలు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయిస్తాయని, అవసరమైతే కేంద్రం పన్ను తగ్గింపుల ద్వారా జోక్యం చేసుకుంటుందని తెలిపారు. గతంలో ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం, ఇటీవల అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల నేపథ్యంలో రూ.10 చొప్పున సుంకం తగ్గించడం వంటి చర్యలు తీసుకున్నామని చెప్పారు.అయితే, ఈ చర్యలు సాధారణ వినియోగదారులకు మాత్రమే పరిమితమై రైతులకు ప్రత్యేక ఉపశమనం కల్పించలేదన్నారు. వరంగల్ జిల్లాలో ఇంధన ధరలు స్వల్పంగా తగ్గినప్పటికీ, రైతులపై వాస్తవ భారంలో పెద్ద మార్పు లేదని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధంగా అమలు

బాలికలను ఉన్నత విద్యవైపు ప్రోత్సహించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు గ్రామస్తుల సహకారంతో నాగారం ఆదర్శంగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభ ను గ్రామ సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా.. ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రం లో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పింఛన్లు తదితర ఎన్నో పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయానికొస్తే ఒక్కో గ్రామానికి దాదాపుగా 35పైగా ఇండ్లు మంజూరై ఉన్నాయన్నారు. ఒక్క నాగారం గ్రామంలోనే 800 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, గృహ జ్యోతి పథకం కింద 63 లక్షల రూపాయలు వినియోగదారులకు ఉచిత విద్యుత్ ప్రయోజనం కలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ అమలుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎల్ త్రీ లో ఉన్న వారికి తదుపరి ఇచ్చే ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, జడ్పీ డిప్యూటీ సీఈవో రవి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, విద్యుత్ శాఖ డీఈ అశోక్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల సమస్యలు తెలుసుకునేందుకే గ్రామ సభలు

ప్రతీ ఇంటికి ఉపయోగపడే పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**ప్రజాపక్షం/స్టేషన్‌ఘన్‌పూర్:** తనపై నమ్మకంతో నన్ను ఎమ్మెల్యే గా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అవినీతి, అక్రమాలు లేని నిజాయితీతో కూడిన పాలన అందించడమే నా ఏకైక లక్ష్యం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జఫర్ గడ్ మండలం ఉప్పుగల్ గ్రామం, స్టేషన్ ఘనపూర్ మండలం పామునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2సంవత్సరాల 4నెలలు అవుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో ప్రతీ గ్రామంలో గ్రామ ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ప్రజలకు వివరించి, గ్రామ సమస్యలను తెలుసుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఇంటికి ఉపయోగపడే సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని వెల్లడించారు. గతంలో ఎవరైనా ఆలోచించారా పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి చేయాలని....? రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతీ ఇంటికి సన్న బియ్యం పంపిణి చెస్తోందని అన్నారు. సన్న బియ్యంతో ఈ రోజు పేద ప్రజలు కడుపు నిండా అన్నం తింటున్నారని తెలిపారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు గృహ అవసరాలకు సైతం 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులో ఊబిలో ఉండి 8లక్షల కోట్లకు వాయిదాలు, మిత్తిలు చెల్లిస్తూ కూడా ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు.

## రూ. 4.70 లక్షల విలువ గల గుట్కా పట్టివేత



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ టైలర్ స్ట్రీట్ లోని రాజీవ్ గాంధీ స్టాచ్యు దగ్గర శివం కిరాణా స్టోర్ లో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. నిందితుడు రాజ్ పుత్ చేతన్ అట్టి నిషేధిత పొగాకు ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుండి తెప్పించి ఇక్కడ పలు షాపుల వారికి అమ్ముతున్నట్లు విచారణలో వెల్లడైంది. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు హన్మకొండ ఎస్సై కిషోర్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది మహిపాల్, తిరువర్ధన్ అట్టి కిరాణా షాప్ పై రైడ్ చెసి గుట్కాలు స్వాధీనపరుచుకున్నట్టు తెలిపారు.

## ప్రశాంతమైన వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/ములుగు:** 2025–26 విద్యా సంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ములుగు సిద్ధార్థ రెడ్డి వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు అందరూ హాజరయ్యారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నట్లు వారు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షకు పరీక్షకు మధ్యన ఉన్నటువంటి రోజులలో పాఠశాలకు హాజరై తదుపరి పరీక్షకు సిద్ధం కావాలని, ఉపాధ్యాయుల సలహాలు, సందేహాలను నివృత్తి ద్వారా ఉత్తమ ఫలితాల సాధన కృషి చేయాలని వారు అన్నారు.

## రైతులు దళారుల చేతిలో మోసపోవద్దు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీ నాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** రైతులు పండించిన పంటలు తక్కువ ధరకు ధళారులకు విక్రయించి మోసపోవద్దని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ అన్నారు.గురువారం మండల కేంద్రంలో గూడూరు పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ మొక్కజోన్న కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ ఇన్చార్జి కే శ్రీనువాస్‌రావు తహశిల్దార్ నాగభవని ఏవో అబ్దుల్ మాలిక్ ఎంపీడీవో సత్యరారాయణనెక్కొండ మార్కెట్ కమిటి చైర్మన్ ఎడ్ల నరేస్‌రెడ్డి సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలునాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి రైతులతో కలిసి మొక్కజోన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ మాట్లాడుతూ మనప్రాంత రైతులు ఎక్కువగా మొక్కజోన్న పండిస్తున్నారని అందుకే రైతులు సంక్షేమం కోసం రూ 2400 వందల మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఈ మొక్కజోన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన మొక్కజోన్నలను విక్రయించి ఆర్థికంగా ఎదుగాలని సూచించారు.మండలంలో మొక్కజోన్న రైతులు ప్రవేటు వ్యాపారస్తులకు అమ్మి మోసపోవద్దని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజోన్న కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఎమెల్యే వారికి సూచించారు. రైతును రాజు చేయడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకలు చిట్టెవెంకన్న మాదవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి బొల్లికోండ మధు యాకయ్య చిరబోయిన కుమార్ శ్రీనువాస్ రసూల్ సర్పంచ్‌లు పాల్గోన్నారు.

## సిఎం రేవంత్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి: సిపిఐ

ప్రజాపక్షం/ ఖమ్మం : కేరళ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పినరయి విజయన్ పట్ల చేసిన వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించు కోవాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. విజయన్‌ను మోదీతో పోల్చటం అంటే రాజకీయ పబ్బం గడుపుకోవటమేనని బలమైన సిద్ధాంతంతో పనిచేసే ఎల్‌డిఎఫ్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. బిజెపి వ్యతిరేక ఫ్రంట్‌లో వామపక్షాలు ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డికి ఈ విషయాలు గుర్తుకు రాలేదా అని సురేష్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఏమి చూసి విజయన్‌ను మోదీతో పోల్చారని, అధికారంలోకి రావడం కోసం ఇంత దిగ జారుడు ప్రచారం తగదన్నారు. రాష్ట్రానికి ఒక మాట చెప్పి ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారన్నారు.

## నకిలీ బంగారం కేసులో ముగ్గురు అరెస్టు



ప్రజాపక్షం/ ఖమ్మం : నకిలీ బంగారంతో బ్యాంకును మోసం చేసిన కేసులో ముగ్గురిని, సైబర్ నేరగాళ్లకు సహకరించారని మరో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులను కల్లూరు సబ్ డివిజన్ పరిధిలోని ఏన్కూరు, సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... సత్తుపల్లి కేంద్రంగా కోట్లాది రూపాయల విలువ కలిగిన సైబర్ నేరం చోటు చేసుకున్న సంగతి విధితమే. ఈ నేరంలో నేరస్తులకు సహకరించారన్న ఆరోపణతో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు ఏసిపి వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన నేరాల కేసులో నిందితులైన ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియ, సిఎస్‌పి బ్యాంక్ చంద్రుగొండ మేనేజర్ అఖిల్ అబ్దుల్‌కు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేశారు. చంద్రుగొండ సిఎస్‌బి బ్యాంకు ఉద్యోగులైన బెండాలపాడుకు చెందిన ఓర్సు కృష్ణ, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెంకు చెందిన బ్యాంకు ఉద్యోగి మందా శ్రీహరిబాబు, చంద్రుగొండ మండలం మద్దుకూరుకు చెందిన బ్రాంచ్ ఆపరేషన్ మేనేజర్ జుంజునూరి రాధాకృష్ణ ఉన్నారు. ముగ్గురు నిందితులను సత్తుపల్లి శ్రీహరి అరెస్టు చేశారని ఈ కేసులో మరి కొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు ఏసిపి తెలిపారు. ఏన్కూరు మండలంలోని నాగార్జున గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందిన కేసులో ముగ్గురిని ఏన్కూరు పోలీసులు అరెస్టు చేశారు. ఏన్కూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం పొందిన కేసులో నలుగురిపై కేసు నమోదు కాగా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. బ్యాంకు మేనేజర్ కెవి ప్రశాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. శ్రీపాది సతీష్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బంగారాన్ని నిర్ధారించే అధికారిగా పని చేస్తున్నారు. శ్రీపాది మౌనిక, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లు 242 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.9.53 లక్షల రుణాన్ని పొందారు. రుణం తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు నిబంధనల ప్రకారం బంగారాన్ని వేలం వేసేందుకు సిద్ధమయ్యారు. వేలం సందర్భంగా పైన పేర్కొన్న వారు తాకట్టు పెట్టినవి నకిలీవని గుర్తించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో నిందితులైన శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజో నరేష్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రెండవ ముద్దాయిగా ఉన్న మౌనిక పరారీలో ఉన్నారు.

# సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టిజన్‌లు

జెఎసిగా ఏర్పాటు
నేడు కెటిపిఎస్
అంబేద్కర్ సెంటర్‌లో భారీ ధర్నా



ప్రజాపక్షం/పాల్వంచ : తమ సమస్యల సాధన కోసం ఆర్టిజన్‌లు సమ్మెకు సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వంతో కొట్లాడేందుకు అన్ని సంఘాలతో కలిసి తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ (జెఎసి)ని ఏర్పాటు చేశారు. వివిధ దశలలో తమ నిరసనలను వ్యక్తం చేయటానికి, అవసరమైతే నిరవధిక సమ్మె బాట పట్టడానికి సైతం కార్యాచరణ సిద్ధం చేసుకొంటున్నారు. నేడు కెటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో మహా ధర్నాకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. దీనికి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సిఎండీలకు సమ్మె నోటీసులు అందజేశారు. దీనిలో బాగంగా ఎన్‌పిడిసిఎల్ మరియు వివిధ డివిజన్ల ఆఫీసులలో, ట్రాన్స్‌కో, జెన్‌కో వ్యాప్తంగా ధర్నాలకు దిగాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జెఎసి ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిశీలించి న్యాయం చేయాలన్నారు. బ్రిటీష్ చట్ట పరిధిలోని 1947 స్టాండింగ్ ఆర్డర్‌ను తక్షణమే రద్దు చేయాలని, ఒకే సంస్థలో ఒకే సర్వీస్ రూల్స్ ప్రకారం ఏపిఎస్‌సిబి సర్వీస్ రూల్స్‌ని అమలు చేయాలన్నారు. చదువు, విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లిస్తూ జెన్‌కోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్‌లకు క్వార్టర్ సదుపాయాన్ని కల్పించాలని, డిసెంబర్ 04, 2016 కటాఫ్ డేట్ కలిగిన కాంట్రాక్ట్ కార్మికులను, ఐడి నెంబర్ కలిగిన కార్మికులను ఆర్టిజన్ కార్మికులుగా గుర్తించాలన్నారు. ఆరవ దశ నిర్మాణంలో పని చేసిన కార్మికులను ఏడవ దశలో ఆర్టిజన్‌లుగా విధుల్లోకి తీసుకోవాలన్నారు. నేడు పాల్వంచ కెటిపిఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా, 7వ తేదీన వరంగల్‌లోని ఎన్‌పిడిసిఎల్ లో ధర్నా, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని యెడల అనంతరం మరుసటి రోజు 8వ తేదీ నుండి సమ్మె బాట పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెఎసి చైర్మన్ అనిల్ కుమార్ (హెచ్ 82 యూనియన్ ) కన్వీనర్ వెంకటేశ్వర్లు, (1322 యూనియన్) కో చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, (327 యూనియన్) కో కన్వీనర్ సాయిబాబు, (సిఐటియు) వైస్ చైర్మన్ నిమ్మల వెంకటరావు, ( టిఆర్‌కెవిఎస్ ) కోశాధికారి రమేష్, (బిఎంఎస్) మరియుజెన్‌కో కన్వీనర్ క్రిష్ణారెడ్డి, జెన్‌కో వైస్ చైర్మన్ తేజావత్ రమేష్ పాల్గొన్నారు.

## పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్




ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : కనీసం నిలువ నీడ లేని కటిక పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 28,30,32వార్డులో గురువారం నిర్వహించిన గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఈ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేని వందలాది నిరుపేద కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ఎంతో కాలంగా కిరాయి ఇండ్లల్లోనే జీవనం సాగిస్తున్న కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఈ సమస్యలపై సిపిఐ పార్టీ తరుపున పలు మార్లు ప్రభుత్వాలకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడిగా మంత్రి ఇళ్ల స్థలాలు, ఇండ్లు మంజూరు విషయంపై సానుకూల నిర్ణయం తీసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం ఇళ్ల స్థలాలు, ఇండ్ల మంజూరు అంశంపై గ్రామసభల్లో ఏకగ్రీవ తీర్మానం చేయాలని సభలను ఆయన కోరారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, ఆయా వార్డుల మున్సిపాలిటీ నాయకులు, అధ్యక్ష,కార్యదర్శులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సు కోసమే గ్రామ సభలు

అదనపు కలెక్టర్ శ్రీజ



ప్రజాపక్షం/బోనకల్ : ప్రజా శ్రేయస్సు కోసం 99రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాలు, అమలు చేయబోయే వివిధ పథకాలను వివరించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి రూ.5లక్షలు బీమా కల్పించే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకం ప్రవేశపెడుతుందన్నారు. నూతన రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని బ్యాంకు లింకేజి రుణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ద్వారా గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై కూడా గ్రామసభలో చర్చ జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమాదేవి, తహాశీల్దార్ రమాదేవి, ముష్టికుంట్ల గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్కే.సైదులు, ఎఇఓ త్రివేణి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూముల ఆక్రమణదారుల వాహనాలు సీజ్

ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం చర్యలు
వివరాలు వెల్లడించిన సిపి సునీల్‌దత్



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఖానాపురం హవేలీ పోలీసు స్టేషన్‌పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూములను అక్రమించి పేదల నుంచి నగదు వసూలు చేసిన ముఠాసభ్యులకు సంబంధించిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారికి చెందిన స్థిర, చరఆస్తులను అటాచ్‌మెంట్ కోసం చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం మీడియాకు తెలిపారు. గురువారం ఐదు వాహనాలను సీజ్ చేయగా సుమారు రూ.45 లక్షల విలువచేసే ఆస్తులను అటాచ్‌మెంట్ కోసం చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసు కస్టడీలో ఉన్న నిందితులు బల్లి శ్రీనివాస్, పోలెబోయిన ముత్తయ్య, కొప్పెర వెంకన్న, తాళ్లూరి కృష్ణ, కుంజా కృష్ణయ్య, కల్తీ రామచంద్రయ్య, బాణాల లక్ష్మణాచారిలను విచారించగా వారు సుమారు 1549 మంది బాధితుల నుంచి 2,88,38100 రూపాయలు వసూలు చేసినట్లు అంగీకరించారన్నారు. ర్యాలీలు, కోర్టు, సర్వేలు, వినోభ నవోదయ కాలనీలో తాత్కాలికంగా నిర్మించుకున్న ఇళ్లకు కరెంటు, నీరు తదితర సౌకర్యాల పేరుతో ఖర్చు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. మిగిలిన నగదుతో స్వప్రయోజనాలకు, స్థిరాస్తులు కొనుగోలుకు ఖర్చుచేసినట్లు అంగీకరించారన్నారు. నిందితుల్లో ఒకరైన తాళ్లూరి కృష్ణకు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేయగా కవిరాజ్‌నగర్ రోడ్డు నెంబర్ ఒకటిలో సుమారు రూ.20 లక్షలతో తన ఇంటిపై మొదటి అంతస్తు నిర్మించాడని తెలిపారు. రెండవ నిందితుడు బాణాల లక్ష్మణాచారి నుంచి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకోగా, పోలెబోయిన ముత్తయ్యకు చెందిన టాటా మ్యాజిక్ , టాటా ఇంట్రా ట్రాలీ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొప్పెర వెంకన్నకు చెందిన ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకోగా పదిలక్షల రూపాయలతో ఇంటి స్థలం కొనుగోలు చేసినట్లు గుర్తించామన్నారు. మరో ముఠా సభ్యుడు చిప్పలపల్లి వీరయ్యకు చెందిన బ్యాంక్ ఖాతాలో రూ.4,48,774 నగదు ఉన్నట్లు గుర్తించగా మరో పదిలక్షల రూపాయల నగదు ఏన్కూరుకు చెందిన పొన్నెబోయిన బేబీ అనే మహిళ వద్ద ఉంచి ఎన్నికల సమయంలో పార్టీ మీటింగ్‌లకు కొంత ఖర్చుచేసినట్లు తేలిందన్నారు. అలాగే హుస్నాబాద్‌లో జరిగిన పార్టీ మీటింగ్‌కు సుమారు పదిలక్ష రూపాయలు ఖర్చు చేయగా ఇతర ఖర్చులు, స్వప్రయోజనాలకు వినియోగించినట్లు తమ విచారణలో అంగీకరించారన్నారు. కస్టడీ అనంతరం నిందితులను తిరిగి గురువారం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సిపి వెల్లడించారు. స్థిర చరాస్తులు, ఐదు వాహనాల విలువ రూ.10.40లక్షలు, ఇంటి విలువ రూ. 19.90లక్షలు, పదిలక్షలు విలువ చేసే ఇంటిస్థలం, బ్యాంక్ ఖాతాల్లో దాచిన నగదు నాలుగులక్ష నలభై ఎనిమిది వేల రూపాయలు మొత్తం కలిపి సుమారు రూ.44.78 లక్షల వరకు ఉంటుందని పోలీసు కమిషనర్ వెల్లడించారు.

## ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు పథకాలు, సేవలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని, దళారీ వ్యవస్థను రూపుమాపి పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు రోజు, రోజుకు మరింత ప్రేమను పెంచుకుంటున్నారన్నారు సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్. పట్టణంలోని 23 వార్డుల్లో ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 10, 11 వార్డుల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు, అధికారులు, ఏఈలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, పెన్షన్లు, ఉచిత గ్యాస్, చేయూత, గృహ జ్యోతి, కళ్యాణలక్ష్మి /షాదీ ముబారక్, రైతు బంధు వంటి పథకాల వివరాలు తెలియజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీలు, వార్డ్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే ఇంటింటికీ సిపిఐ



ప్రజాపక్షం/ బోనకల్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికే ఇంటింటికి సిపిఐ క్యాక్రమాన్ని చేపట్టినట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు వెల్లడించారు. గురువారం మండల పరిధిలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందాపురం(ఎల్) గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. చాలా మంది ఇందిరమ్మ ఇళ్ల సమస్యను తమకి తెలియచేశారన్నారు. గోవిందాపురం( ఎల్) గ్రామంలో కౌలు రైతులు ఎక్కువ మంది ఉన్నారని, ఇక్కడి నుండి మధిర లేదా బోనకల్ ప్రాంతాలకు మొక్కజొన్నను తరలించడం ఇబ్బందికరమైన పరిస్థితి అన్నారు. బోనకల్ మండలంలో ఉన్న ఐదు వ్యవసాయ క్లస్టర్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యలు తెలుసుకోవడానికి తాము ప్రయత్నించినప్పుడు పలువురికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని గతంలో చెప్పారని, కాని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రామారావు, షేక్ బ్రహ్మం, యువజన నాయకులు జక్కుల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించాలి

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం నగరంలోని మున్సిపల్ క్వార్టర్స్‌ను వాటిలో నివసిస్తున్న మున్సిపల్ కార్మికుల పేర క్రమబద్ధీకరించాలని సిపిఐ ఫ్లోర్ లీడర్, 43వ డివిజన్ కార్పొరేటర్ బిజి క్లెమెంట్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికలలో ఎక్కువ మంది 43వ డివిజన్‌లోనే ఉన్నారని, వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 43వ డివిజన్ సభ గురువారం బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగింది. బిజి క్లెమెంట్ మాట్లాడుతూ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఎక్కడో స్థలాలు ఇవ్వడం కాకుండా ప్రస్తుత క్వార్టర్స్‌లో మౌలిక వసతులు కల్పించి కార్మికులకే స్వాధీనపర్చాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కమ్యూనిటీ హాల్ ప్రజలకు ఉపయోగపడేవిధంగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణం, ఆరు గ్యారెంటీలకు సంబంధించి పెద్ద సంఖ్యలో అధికారులకు దరఖాస్తులు అందజేశారు. మున్సిపల్ క్వార్టర్స్‌ను క్రమబద్ధీకరించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. డివిజన్ ప్రత్యేకాధికారి సుధాకర్, వార్డు ఆఫీసర్ ఇమ్రాన్, డివిజన్ బాధ్యులు కె. గురుమూర్తి, కె. సతీష్‌రెడ్డి, వెంకన్న, పి. రామమూర్తి, విద్యుత్ అధికారి రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

## 99 రోజుల కార్యాచరణ
## జెడ్‌పి సిఇఒ దీక్షారైనా



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టిందని జెడ్పి సిఇఒ దీక్షారైనా తెలిపారు. గురువారం ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో తొలుత రాష్ట్ర గీతాన్ని అలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశాన్ని వినిపించి వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలను తెలపడంతో పాటు కొత్తగా అమలు చేసే పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. రఘునాథపాలెంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పి సిఇఒ దీక్షారైనా పాల్గొని మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. సుపరిపాలనను అందించేందుకు 99 రోజుల కార్యాచరణ చేపట్టి గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అశోక్‌కుమార్, వ్యవసాయ శాఖ ఎడి కొంగర వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి , అనురాధ, ఉప సర్పంచ్ ప్రశాంత్, వార్డు సభ్యులు , పిఎసిఎస్ ఛైర్మన్ తాతా రఘురాం, అధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో పది మంది అరెస్టు




ప్రజాపక్షం/ ముదిగొండ : మాజీ సర్పంచ్ ప్రస్తుత సర్పంచ్ భర్త పాము సెల్వరాజు కిడ్నాప్ కేసులో పది మందిని అరెస్టు చేసినట్లు ముదిగొండ సిఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం... కిడ్నాప్‌కు గురైన సెల్వరాజు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్ దర్యాప్తు చేపట్టడం జరిగిందని పండ్రేగుపల్లిలో షేక్ ఇబ్రహీం, షేక్ పక్రుద్దీన్ అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఉందని ఆయన తెలిపారు. ప్రతి విషయంలోనూ తమకు అడ్డుగా వస్తున్నాడని భావించిన షేక్ పక్రుద్దీన్ అతని కుమారులు హైదరాబాద్ నుంచి కిరాయి వ్యక్తులను తీసుకు వచ్చి సెల్వరాజును గత నెల 25న కిడ్నాప్ చేశారు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో పోలీసులకు సెల్వరాజు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ముస్తఫా, షేక్ పక్రుద్దీన్, షేక్ ఖాసీం సాహెబ్, సయ్యద్ మహ్మద్, మహీర్ ఖాన్ సింగ్, గుల్జీత్‌సింగ్, ఆజాద్ సింగ్, ఇస్మాయిల్, కోమల, వరికుప్పల తరుణ్ ను అరెస్టు చేసినట్లు మురళీ తెలిపారు.

# ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యం

మేయర్ పునుకొల్లు నీరజ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని ఖమ్మం నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం ఖమ్మం నగరంలోని అన్ని డివిజన్లలో సభలు నిర్వహించారు. ఈ సభల్లో రాష్ట్ర గీతాలాపనతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందేశం వినిపించారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి, అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు సంబంధించి సభలో వివరించారు. పలు డివిజన్లలో జరిగిన సభల్లో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటి వద్దకే పాలన తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను రూపొందించి అమలు చేస్తుందన్నారు. 99 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వార్డు ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన**

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. గురువారం రూ. 30 లక్షలు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి డివిజన్‌లో నిర్మించనున్న సిసి రోడ్లు, డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ప్రజలకు అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

అశ్వాపురం గ్రామసభలో సమస్యల వెల్లువ
ప్రజలతో నేరుగా మమేకమైన కలెక్టర్



ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ అశ్వాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌కు అశ్వాపురం సర్పంచ్ బానోత్ సదర్ లాల్ ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో గ్రామ పంచాయితీ అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితులు, గ్రామంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామ సభకు భారీగా జనసందోహం తరలి వచ్చి, ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు వివరించడం విశేషం. ఈసందర్భంగా గ్రామ ప్రజలు ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సమస్య, పేదలకు గృహ నిర్మాణ సాయం ఆలస్యం, కంటి శస్త్ర చికిత్సలకు అవసరమైన వైద్య సహాయం, స్మశాన వాటిక అభివృద్ధి లోపాలు, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, బస్టాండ్ సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, మహిళలకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వంటి అనేక సమస్యలను ప్రస్తావించారు. అదే విధంగా గ్రామంలోని మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. పలువురు రాజకీయ నాయకులు కూడా గ్రామ సమస్యలను సమగ్రంగా వివరించి, పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. ప్రజల సమస్యలను విన్న కలెక్టర్ అంకిత్, ప్రతి అంశాన్ని గమనించి సంబంధిత అధికారులకు వెంటనే సూచనలు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి సమయపాలనతో చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపిడిఒ ముత్యాలరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**హెచ్‌ఎం, వార్డెన్‌లకు షోకాజ్ నోటీసులు జారీ..**

అశ్వాపురం మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ అంకిత్ గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి హాస్టల్ నిర్వహణపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సదుపాయాలు, పరిశుభ్రత, భోజన నాణ్యత వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా హాస్టల్‌లో ఉన్న పరిస్థితులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న భోజనం నాణ్యత సరైన స్థాయిలో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌కు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వెంటనే లోపాలను సరిదిద్దాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదనికలెక్టర్ స్పష్టం చేశారు

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
03-04-2026
www.prajapaksham.in

‘బిచ్చగాడు’ లాంటి బ్లాక్ బస్టర్ తరువాత మల్టీ టాలెంటెడ్ విజయ్ ఆంటోని, దర్శకుడు శశి కాంబోలో ‘వంద దేవుళ్లు’ అనే సినిమా రాబోతోంది. ఇక తాజాగా ఈ మూవీ నుంచి ‘ఇది కలనో’ అంటూ సాగే మెలోడీ గీతాన్ని విడుదల చేశారు.

రీల్

### నయనతార నిర్మాతగా

# ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’



తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె.సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు. హీరో రానా దగ్గుబాటి ఈ సినిమా తెలుగు టీజర్‌ని లాంచ్ చేశారు.
ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది& మనం ఇప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయం ఉందని అంటున్నాడు అనే వాయిస్తో ప్రారంభమైన టీజర్ క్రేజీగా ఆకట్టుకుంది. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఇంకా ఉంది& ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది అనే డైలాగ్తో ప్రదీప్ రంగనాథన్ ఎంట్రీ, కృతి శెట్టిని వర్షంలో కలిసే సన్నివేశం ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా కనిపించింది. ఎస్.జె.సూర్య ఎంట్రీ టీజర్‌కు మరో హైలెట్‌గా నిలిచింది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అని ఆయన చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది. దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ క్రేజీ లవ్ స్టోరీని ఫ్యూచరిస్టిక్ వరల్ బ్యాక్ డ్రాప్‌లో డిజైన్ చేయడం జరిగిందని నిర్మాత నయన తార చెప్పారు. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌డ్రాప్‌లో స్కోర్, రవి వర్మన్ కెమెరా వర్క్ సినిమా స్థాయిని, టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రదీప్ రంగనాథన్, ఎస్.జె.సూర్య, కృతి శెట్టి, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారహ్, మాళవిక నటించారు.

## తెలుగులో తొలి ఎఐ సినిమా అంబ’s రివెంజ్




చలనచిత్ర పరిశ్రమలో చరిత్ర సృష్టిస్తూ, సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ పూర్తిస్థాయి కృత్రిమ మేధ (ఎఐ) సాయంతో రూపొందుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్ అంబ’s రివెంజ్ ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మాతగా, రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్ గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ పౌరాణిక చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. శ్రీ లలితకళా చిత్రాలు, నక్క తోక ఫిలమ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది.ఈ సందర్భంగా నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు, క్రియేటివ్ డైరెక్టర్ జయవర్ధన్ మాడి మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టాము. అంబ’s రివెంజ్ ప్రాజెక్టు కోసం అత్యాధునిక ఎఐ టూల్స్‌ను వినియోగిస్తూ విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరిస్తున్నాం. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాం అని తెలిపారు.తెలుగు సినీ పరిశ్రమలో ఎఐ ఆధారిత కథా చిత్రాల దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. పౌరాణిక కథను ఆధునిక సాంకేతికతతో మిళితం చేస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రం తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ : శ్రీకాంత్ రెడ్డి కుందూరు, కొ-ప్రొడ్యూసర్ : రాణి మాడిసన్.

## గద్దర్ అవార్డు కంటే పెద్ద గుర్తింపు ఈటీవీవిన్

### యుఫోరియా డైరెక్టర్ గుణ శేఖర్



యుఫోరియా సినిమాకు తెలంగాణ ప్రభుత్వం రెండు గద్దర్ ఫిల్మ్ అవార్డ్సలను ఇచ్చింది కాని అంతకంటే పెద్ద గుర్తింపు ఈటివి విన్ వారిచ్చారని డైరెక్టర్ గుణశేఖర్ వ్యాఖ్యానించారు. యుఫోరియా సినిమా ఈటివి విన్‌లో ప్రసారం అవుతున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో గుణ శేఖర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా కెరీర్ ఉషా కిరణ్ మూవీస్ సంస్థలోనే ప్రారంభమైంది. ఉషా కిరణ్ మూవీస్ స్టాండర్డ్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. రామోజీ రావు నాకు చాలా ఇన్స్పిరేషన్. కథా చర్చల్లో ఆయన నా అభిప్రాయం కూడా అడిగే వారు. అది నాకు గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆ సంస్థ నాకు మంచి పునాది వేసింది. అదే సంస్థ నా ‘రుద్రమదేవి‘ సినిమాను తీసుకుంది. ఇప్పుడు ‘యుఫోరియా’ కూడా అదే సంస్థలో వస్తోంది. యుఫోరియా చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం రెండు ప్రతిష్టాత్మక అవార్డులు ఇచ్చింది. ఉత్తమ కథా రచయితగా నన్ను, ఉత్తమ సహాయనటిగా భూమికను గౌరవించింది. అంతకంటే పెద్ద గుర్తింపు ఈ రోజు ఈటీవీ విన్ వారు ఇచ్చారు. ఈటివి విన్‌లో ఈ సినిమా విడుదల కావడం నాకు చాలా గర్వంగా ఉంది. నిజానికి ఓటీటీ వాళ్లు కంటెంట్ను బోల్డా చెప్పడానికి ప్రోత్సహిస్తారు. కానీ అలాంటి సంస్థలే ఈ కథ షాకింగ్‌గా ఉందని వెనకడుగు వేశాయి. ‘బోల్డ్’ అంటే విజువల్‌గా కాదు, కంటెంట్ రూపంలో చెప్పేది. ఈటివి కథల ద్వారా సమాజానికి అద్దం పట్టే సినిమాలను తీయడంలో ముందుంది. ‘చిత్రం’, ‘మయూరి’, ‘మౌన పోరాటం’ లాంటి ఎన్నో అద్భుత కథలను చెప్పారు. సమాజంలో జరిగే సంఘటనలను ప్రజలకు చూపించారు. అదే నాకు స్ఫూర్తి. ఆ స్ఫూర్తితోనే ‘యుఫోరియా’ తీశాను అని చెప్పారు. ఈ ప్రెస్ మీట్‌లో ఈటివి విన్ మార్కెటింగ్ హెడ్ యువకాంత్, రాగిణి గుణ , ప్రొడ్యూసర్ నీలిమ గుణ , విఘ్నేష్ గవిరెడ్డి పాల్గొన్నారు.

## రోల్ నచ్చితే చేస్తా : మాళవిక నాయర్

శర్వానంద్ హీరోగా, మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం బైకర్. రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవి క్రియేషన్స్ నిర్మాణంలో తెరకెక్కించిన ఈ సినిమా ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్‌లోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక నాయర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. 2024 ఏప్రిల్లో కథ విన్నాను. చాలా నచ్చింది. దర్శకుడు అభిలాష్ చాలా ఫ్రెష్ కంటెంట్ ఉన్న క్యారెక్టర్ రాశారు. బైకర్ ఇండియాలో ఫస్ట్ మోటోక్రాస్ ఫిల్మ్.



ఇందులో నా క్యారెక్టర్ గురించి ఎక్కువగా రివీల్ చేయకూడదు. ఇందులో నా పాత్ర కథకు బ్రిడ్జ్గా ఉంటుంది. ఒక స్పోర్ట్స్‌మాన్ జీవితంలో ఫ్యామిలీ రోల్ చాలా కీలకం. ఇందులో వైఫ్ అండ్ హస్బెండ్ ఏ నిర్ణయం అయినా కలిసి తీసుకుంటారు. కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇవాల్వ్ అవుతూ ఉంటుంది. పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న మంచి రోల్ చేశాను. ఫాదర్ సన్ ఎమోషన్ ప్రత్యేకంగా ఉంటుంది. రాజశేఖర్‌తో నాకు సీన్స్ ఉన్నాయి. ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవం. అంత సీనియర్ అయినప్పటికీ సెట్‌లో అందరితో చాలా క్లోజ్‌గా ఉంటారు. మనం ఏదైనా చెబితే వింటారు. అది చాలా గొప్ప గుణం. సెలెక్టివ్‌గా చేయడానికి కారణం ఏంటంటే నాకు ప్రతి సారి కొత్త క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. డిఫరెంట్ లేయర్స్ ఉన్న పాత్రలు చేయాలని అనుకుంటాను. అలాంటి పాత్రలు వస్తే ఖచ్చితంగా చేస్తాను. ఒక క్యారెక్టర్ చేసే ముందు ఆడియన్స్‌ను దృష్టిలో పెట్టుకుంటాను. మనం సినిమాలు చేస్తున్నదే వాళ్ల కోసం. అలాగే ఆ క్యారెక్టర్ నాకు పర్సనల్‌గా కనెక్ట్ అవుతుందా లేదా చూసుకుంటాను. ఖచ్చితంగా కొత్తగా అనిపిస్తే చేస్తాను. ఇప్పటివరకు నా జర్నీ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను.
ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను.




## ‘పెద్ది’ పహిల్వాన్ పోస్టర్ రెడీ

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న పెద్ది సినిమాలో నుంచి పెద్ది పహిల్వాన్ పోస్టర్ ను హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం విడుదల చేశారు. పహిల్వాన్ గిరి కోసం బాడీ పెంచుకున్న బాడీ బిల్డర్ పాత్రలో రామ్ చరణ్ చక్కగా ట్రాన్స్ ఫర్మ్ అయ్యారు. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్ గా జరుగుతోంది. రామ్ చరణ్ సరసన జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాను ఈనెలాఖరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఏ ఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## 17న ‘తిమ్మరాజుపల్లి టివి’ విడుదల

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కెఎ ప్రొడక్షన్స్‌పై నిర్మిస్తున్న సినిమా ‘తిమ్మరాజుపల్లి టివి’. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. ‘తిమ్మరాజుపల్లి టివి’ చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పిరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 17న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ‘తిమ్మరాజుపల్లి టివి’ సినిమాను ఓవర్సీస్‌లో శ్లోక ఎంటర్ టైన్ మెంట్స్, వైబ్రెంట్ మూవీస్ రిలీజ్ చేయబోతున్నాయి. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను ఓవర్సీస్ ప్రేక్షకులకు అందించిన ఈ రెండు డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ‘తిమ్మరాజుపల్లి టివి’ కంటెంట్‌పై పూర్తి నమ్మకంతో డిస్ట్రిబ్యూషన్ కు ముందుకొచ్చాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో ‘తిమ్మరాజుపల్లి టివి’ సినిమా ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.




### భీకర దాడులు
(మొదటి పేజీ తరువాయి)

వైట్‌హౌస్ నుండి 20 నిమిషాలసేపు ట్రంప్ కీలక ప్రసంగం చేశారు. ఇరాన్‌లో యుద్ధ పరిణామాలను ప్రజలకు వివరించారు. నెలరోజుల అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంలో సైనిక చర్యలు దాదాపు పూర్తయ్యాయని, మరో రెండు మూడు వారాల్లో మొత్తం దాడి లక్ష్యాలు పూర్తిచేస్తామని చెప్పారు. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చిన నేపథ్యంలో, ఈ యుద్ధం అమెరికన్ల కోసమేనని సముదాయించే ప్రయత్నం చేశారు.ఈ యుద్ధాన్ని భవిష్యత్తుకు ఒక పెట్టుబడిగా చూడాలని కోరారు. ఐతే ట్రంప్ విధించిన టైమ్‌లైన్‌కు నెతన్యాహూ అంగీకరించారా?లేదా? అనే విషయం వెంటనే తెలియరాలేదు. ఈ యుద్ధానికి కీలకమైన హోర్ముజ్ సమస్య పరిష్కారంపైఆయన స్పష్టత ఇవ్వలేదు. యుద్ధం పూర్తయితే ఈ జలసంధి దానంతట అదే తెరచుకుంటుందని తేలిగ్గా చెప్పేశారు. అమెరికా ఎన్నటికీ గల్ఫ్ మిత్రదేశాల చేయి వదిలిపెట్టబోదని భరోసా ఇచ్చారు. ఇరాన్ నావికాదళం తుడిచిపెట్టుకుపోయింది, వారి నాయకులు హతులయ్యారు, కానీ అణ్వాయుధాల విషయంలో ఇరాన్‌ను ఎప్పటికే నమ్మలేం, వారి అణుకేంద్రాలను శాటిలైట్ నిఘాలో పెట్టాం, వారి నాయకత్వం ఒక ఒప్పందానికి దిగి రాకపోతే ఇరాన్‌లోని కర్మాగారాలను, ఆయుధవ్యవస్థలను సంపూర్ణంగా తునాతునకలు చేస్తాం అన్నారు. తీవ్ర గందరగోళం-ఉద్రిక్త పరిస్థితులమధ్య ఆయన ప్రకటనతో అమెరికా-ఇరాన్ మధ్య పశ్చిమాసియాలో యుద్ధం మరో కీలక దశకు చేరుకునే ఘటనలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రంప్ ప్రకటన రాగానే శత్రువు లొంగిపోయే వరకూ తమ యుద్ధం కొనసాగుతుందని, తాము కాల్పుల విరమణ కోరుకోలేదని ఇరాన్ ప్రటించింది. ఇజ్రాయెల్ కూడా దాదాపుగా ఇలాంటి ప్రకటనే చేసింది.
చర్చలు-దౌత్యానికే తాను ప్రాధాన్యత ఇస్తున్నాననీ, కానీ ప్రతి ప్రయత్నాన్నీ ఇరాన్ తిరస్కరిస్తోందని ట్రంప్ అమెరికా జాతిని ఉద్దేశించిన ప్రసంగంలో చెప్పారు. హోర్ముజ్ జలసంధిని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐ.ఆర్.జి.సి) నుండి విముక్తి చేసేందుకు నాటో మిత్రదేశాలు సహకరించే వరకూ ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. హోర్ముజ్ జలసంధిని రక్షించుకోవాలని సాధారణ దేశాలన్నింటికీ ఆయన పిలుపు ఇచ్చారు. అదేసమయంలో ట్రంప్ చాలా భిన్నంగా స్పందిస్తూ, హోర్ముజ్ జలసంధితో తమకు ఎలాంటి పనీ లేదని, దానిని తాము కోరుకోవడంలేదని, హోర్ముజ్ మాకు అవసరం లేదని కూడా ప్రకటించారు. ఒక సారి యుద్ధం ముగిసిపోతే హోర్ముజ్ జలసంధి దానంతట అదే నౌకల రాకపోకల నిమిత్తం తెరచుకుంటుందని చెప్పారు. ‘‘హోర్ముజ్ జలసంధికి వెళ్ళి మీ ఆయిల్ మీరే పోరాడి తెచ్చుకోండి’’ అని ట్రంప్ రెండు రోజుల క్రితం నాటో మిత్రదేశాలను విమర్శించారు. ఇక మీకు అమెరికా ఎలాంటి సహాయం చేయదని, నాటో నుండి వైదొలగే ఆలోచన చేస్తున్నామని ఆగ్రహంలో ట్రంప్ ప్రకటనలు చేసిన తర్వాత జాతినుద్దేశించిన ప్రసంగంలో, హోర్ముజ్‌ను రక్షించుకోవాలని అన్ని దేశాలకు పిలుపు ఇచ్చారు. ఇరాన్‌లో ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా గత ఏడాది డిసెంబరు నుండి ప్రారంభమైన అంతర్గత ఉద్యమసమయంలో 45,000 మంది తన సొంత దేశ ప్రజలనే ఇరాన్ నాయకత్వం చంపుకుందని విమర్శించారు. గడచిన 47 సంవత్సరాలుగా ఇరాన్‌లో ఇవే పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు.
ఎక్కువ క్షిపణులు ఉత్పత్తిచేసి ఆధిపత్యం చెలాయించాలని ఇరాన్ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఇరాన్ లక్ష్యాలు నెరవేరకుండా తాము తలపెట్టిన నిర్దేశిత కార్యక్రమం దాదాపు పూర్తవుతోందని, రాబోయే రెండు మూడు వారాల్లో త్వరగా తమ పని పూర్తిచేస్తామన్నారు. ఇరాన్ నౌకవ్యవస్థను తుడిచిపెట్టాం, వారి నాయకులు అందరూ హతులయ్యారు, వారికి అణు సామర్థ్యం లేకుండా చేశాం, లేకపోతే బహుశా వారు అణ్వాయుధాలను ప్రయోగించి ఉండేవారే,టె అక్కడ అణుకేంద్రాలను శాటిలైట్ నిఘాలో పెట్టాం, ఇరాన్‌లో పరిపాలనను మారుస్తాం, ఇప్పటికే ఇరాన్‌లో పరిపాలన మారింది, ఖమేనీకాలంనాటికంటే ఈనాడున్న ఇరాన్ పాలకులు కొంత మతఛాందసవాదాన్ని వదులుకుని ఆలోచిస్తున్నారని అన్నారు. ఒక ఒప్పందం లేకపోవడంవల్లనే ఇజ్రాయెల్ క్షేమంగా బయట పడిందని అన్నారు.

# ఇది న్యాయ వ్యవస్థపై ప్రత్యక్ష దాడి

### పశ్చిమ బెంగాల్ ఘటనపై ‘సుప్రీం’ ఆగ్రహం



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో జరిగిన న్యాయాధికారుల నిర్బంధ ఘటనపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మాల్డా జిల్లాలో, ముగ్గురు మహిళలతో కూడిన ఏడుగురు న్యాయాధికారులను, మాల్డాలో కొంతమంది అసాంఘిక శక్తులు నిర్బంధించడాన్ని ‘న్యాయ వ్యవస్థపై ప్రత్యక్ష దాడి’గా అభివర్ణించింది. ఈ ఘటనను ఉద్దేశపూర్వక చర్యగా పేర్కొంటూ, ఇది కేవలం వ్యక్తులపై దాడి మాత్రమే కాకుండా కోర్టు అధికారాన్ని సవాలు చేయడమని పేర్కొంది. ఈ వ్యవహారాన్ని విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పాంచోలీ ఉన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో శాంతిభద్రతల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, డిఇఐపికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తాను స్వయంగా అర్థరాత్రి వరకు పరిస్థితిని పర్యవేక్షించాల్సి వచ్చిందని ఆయన వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. న్యాయాధికారులను భయపెట్టే ఉద్దేశంతో ఈ చర్యలు జరిగాయని కోర్టు అభిప్రాయపడింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. న్యాయాధికారుల భద్రతను నిర్ధారించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. అలాగే ఓటర్ల జాబితా సమగ్ర సర్వే ప్రక్రియకు ఆటంకం కలగకుండా కేంద్ర బలగాలను మోహరింపచేయాలని ఎన్నికల సంఘానికి సూచించింది. అవసరమైతే ఈ ఘటనపై సిబిఐ లేదా ఎన్ఐఎ విచారణకు కూడా అనుమతి ఇచ్చింది. కోర్టు చేసిన వ్యాఖ్యల్లో రాష్ట్ర అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు కనిపించాయి. బుధవారం మధ్యాహ్నమే నిరసనకారులు ఘెరావ్ చేస్తున్నారనే సమాచారం ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం అత్యంత నిర్లక్ష్యానికి ప్రతీకగా ధర్మాసనం పేర్కొంది.
సహాయం కోసం రాష్ట్ర ఉన్నతాధికారులను స్వయంగా కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంప్రదించాల్సి వచ్చినప్పటికీ, జిల్లా స్థాయి అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందన్నదని పేర్కొంది. బుధవారం రాత్రి 11 గంటల వరకు ఎలాంటి సహాయం అందకపోవడం కోర్టు దృష్టిలో అత్యంత తీవ్రమైన వైఫల్యంగా తెలిపింది. ఈ ఘటనను కోర్టు న్యాయ వ్యవస్థపై మానసిక దాడిగా కూడా పేర్కొంది. న్యాయాధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసి సర్వే ప్రక్రియను అడ్డుకోవడమే లక్ష్యమని అభిప్రాయపడింది. తప్పు చేసిన వారు ఎవరనేది తమకు తెలియదని భావించవద్దని కూడా ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనకు కారణంగా ఉన్న నేపథ్యం కూడా ఉద్రిక్తంగా ఉంది. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే పేరుతో పెద్దఎత్తున పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై మాల్డా జిల్లాలో నిరసనలు జరుగుతున్నాయి. నిరసనకారులు ముందుగా న్యాయాధికారులతో చర్చలు జరపాలని కోరినా అనుమతి లభించకపోవడంతో కార్యాలయాన్ని చుట్టుముట్టి, వారిని సాయంత్రం నుంచి దాదాపు అర్ధరాత్రి వరకూ నిర్బంధించారు. తరువాత భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని న్యాయాధికారులను రక్షించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. అనంతరం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సంఘటనా స్థలానికి చేరుకుని నాలుగు రోజుల్లో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చుతామని హామీ ఇవ్వడంతో పరిస్థితి క్రమంగా సద్దుమణిగింది. కాగా, ఈ సంఘటన ఎన్నికల ప్రక్రియపై కూడా ప్రభావం చూపే అవకాశముంది. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ఉద్రిక్తతలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**బిజెపి కుట్రు : మమత ఆరోపణ**

మాల్డా జిల్లాలో న్యాయాధికారుల నిర్బంధాన్ని బిజెపి పన్నిన కుట్రగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రాన్ని అస్థిర పరచడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని సాగర్దిగి, సుదీ ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న మమత విమర్శించారు.
ఎన్నికల్లో గెలిచేందుకు ఆ పార్టీ ఎలాంటి అక్రమ విధానాలను అమలు చేయడానికైనా వెనుకాడడం లేదని అన్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ అవసరమని వ్యాఖ్యానించారు.

### నిరవధిక సమ్మె
(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో గురువారం కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి జాయింట్ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఫీల్డ్ స్థాయిలో పనిచేయుచున్న ఆశా వర్కర్లు డ్యూటీలో అనేక ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న వారికి ప్రమాద భీమా గానీ, హెల్త్ ఇన్సూరెన్స్ గానీ లేకపోవడం దారుణమన్నారు. ఆశా కార్యకర్తలకు పిఎఫ్, ఈఎస్ఐ లాంటి కార్మిక చట్టాలను అమలు చేయాలని, 35 క్యాజువల్ లీవ్‌లు, మెటర్నిటీ లీవ్‌లు అమలు చేయాలని, ఆశా కార్యకర్తలను ఏఎన్‌సి టార్గెట్ పేరుతో తీవ్ర పనిబత్తిడికి గురి చేయుచున్నారని తెలియజేశారు. ఆశా కార్యకర్తలకు అర్హత కలిగిన వారికి ఎఎన్ఎం, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలలో రిక్రూట్‌మెంట్‌కు 20 మార్కుల వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సర్వేలు, ఎన్నికల విధులు, పరీక్షలకు సంబంధించిన డ్యూటీలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇస్తున్నటువంటి కొద్దిపాటి జీతాన్ని సైతం ప్రతినెలా సక్రమంగా ఇవ్వకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకొని ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.కవిత, ప్రధాన కార్యదర్శి పి. రజినిలతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చినటువంటి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాదె బాల్ రెడ్డి మరణం సిపిఐకి తీరని లోటు

### ఎర్రజెండా కప్పి సిపిఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్ నివాళులు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు కృషి చేస్తూ, చిగురుమామిడి మండలంలో పార్టీ బలోపేతం కోసం తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన గాదె బాల్ రెడ్డి మరణం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐకి, వారి కుటుంబానికి తీరని లోటని సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం తుది శ్వాస విడిచిన బాల్ రెడ్డి మృతదేహంపై చాడ వెంకట్‌రెడ్డితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జడ్పీటిసి అందె స్వామి రెడ్ క్లాత్ మరియు సిపిఐ జెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇందుర్తి ప్రాంతంలో సిపిఐ బలోపేతం కోసం నాడు గునుకుల జనార్దన్‌రెడ్డి, ముస్కు రాజిరెడ్డి, కూన ముత్యాలు, గునుకుల రాంరెడ్డిలతో కలిసి పనిచేశారని, 1980 ప్రాంతంలో సిపిఐ నాయకులపై అనేక దాడులు, హత్యలు జరిగాయని, అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో పార్టీని నమ్ముకొని కార్యకర్తలకు అండగా నిలిచారని, అప్పటి నుండి పార్టీ బలోపేతం కోసం పార్టీ నాయకులను ప్రజాప్రతినిధులుగా గెలిపించడం కోసం నిరంతరం కష్టపడుతూ పనిచేశాడని,ఇందుర్తి పాల డైరీ మొట్టమొదటి చైర్మెన్‌గా పనిచేశారని,కొంత కాలం విఆర్‌ఓగా పనిచేశారని అటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇటు గ్రామాల అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశాడని వెంకటరెడ్డి పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషి చేశారని, ప్రధానంగా ఇందుర్తి ప్రాంతంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజల కోసం చేశాడని, అనేక పోరాటాలలో కీలక భూమిక పోషించిన వ్యక్తి అని, విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని అలాంటి గొప్ప వ్యక్తి బాల్ రెడ్డి మృతి అత్యంత బాధాకరమని,పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని, బాల్ రెడ్డి మరణం పట్ల సిపిఐ జిల్లా సమితి పక్షాన సంతాపాన్ని ప్రకటిస్తు వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. బాల్ రెడ్డికి నివాళ్ళర్పించి, అంత్యక్రియల్లో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి, లక్ష్మారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు గూడెం లక్ష్మీ, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చాడ శ్రీధర్ రెడ్డి, అందె చిన్న స్వామి, కాంతాల శ్రీనివాస్ రెడ్డి, బూడిద సదాశివ, సిపిఐ శాఖ కార్యదర్శి ఎం.డి.ఉస్మాన్ పాషా, వార్డు సభ్యులు అందె తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com